నా

సాహిత్యోపన్యాసాలు

★

దేవులపల్లి రామానుజరావు

నా
సాహిత్యోపన్యాసాలు

★

దేవులపల్లి రామానుజరావు

ప్రతులు 2000
1 9 7 8

మూల్యం : రూ. 5.00

దొరకుచోటు
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్ - హైదారాబాదు.

ముద్రణ :
శివాజీ ప్రెస్,
1732 గంజి బజార్
సికింద్రాబాదు.

తొలి పలుకు

శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు ఈనాటి సాహిత్యసత్వ్రతులలో విశిష్టస్థానం కలవారు. వారు సహృదయులు, రసహృదయులు, కర్తలు, కారయితలు, ప్రేరకులు, అనుమోదకులు. పరంపరీణంగా ఉత్తమసంస్కృతి పరాయణమయిన వారి కుదురే వారి కావ్యశిక్షగా సహకరించింది. సత్కావ్య సంసేవనంవల్ల ఆర్ద్రమయిన చిత్తవృత్తీ, పరిషత్సాంగత్యం వల్ల పరమాహ్లాదకారకమయిన ప్రవృత్తీ వారి వ్యక్తిత్వంలోని ఉదాత్త లక్షణాలు. తెలంగాణాజాతీయోద్యమ కార్యకర్తగా, ఆంధ్రసారస్వత పరిషత్తు సచివులుగా, గోలకొండ పత్రికా నిర్వాహకులుగా, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సంచాలకులుగా, రాజ్యసభాసభ్యులుగా, ఉస్మానియా విశ్వవిద్యాలయ సిండికేట్ సభ్యులుగా, తాత్కాలిక ఉపాధ్యక్షులుగా, ఉర్దూ అకాడమీ, తెలుగు అకాడమీ, అంతర్జాతీయ తెలుగు సంస్థ, కేంద్ర సాహిత్యఅకాడమీ-వంటి ఉన్నత విద్యాసాంస్కృతిక సంస్థల పరిపాలనా మండలి సభ్యులుగా, ఉపదేశక సమితి సదస్యులుగా తెలుగుల సర్వతోముఖ సాంస్కృతికవికసనానికి శ్రీ రామానుజరావుగారు చేసిన కృషి సాటికి పోటీకి అందనిది. ఈ ముఖంగా వారు గడించిన అనుభవం అపారమైనది; సంతరించుకున్న సాధన సంపత్తి బహుముఖమయినది. బహుభాషా సాహిత్యాలతోను, బహు కవిపండిత మండలితోను. వారికి గల ప్రచుర పరిచయం వారికి వినయ సుందరతను ఆర్జించి పెట్టింది.

బహుగ్రంథ రచనంవల్ల శ్రీ రామానుజరావుగారు ఈవరకే సుప్రథిత యశస్కులు. ప్రకృత రచన 'సాహిత్యోపన్యాసాలు' వారి ప్రతిష్ఠను ఆమ్రేడించ వచ్చింది. ఆ యా పరిషత్తుల కవిపండిత సమ్మేళనాల నుద్దేశించి వారు చేసిన ప్రాసంగిక ప్రవచనాలు, వివిధ సాంస్కృతిక విషయాలపై

కావించిన ఆకాశవాణి ప్రసంగాలు, ప్రత్యేక సాహిత్యసంచికల కోసం రూపించిన విద్వత్కవి పరిచయాలు ప్రకృతకృతిలో సంపుటీకరించ బడ్డాయి. 'తెలంగాణా ప్రాంతంలో తెలుగు దీపాలు ఎన్నడూ ఆరిపోలేదు', 'పర సంస్కృతులను జూచి తెలుగు వాడెన్నడూ ఉలికిపడలేదు', స్వచ్ఛందంగా సామాజిక బాధ్యతలను స్వీకరించిన నాడే రచయిత సమాజంలోని వ్యక్తిగా జీవిస్తూ, సామాజిక సమస్యలను అవగాహన చేసుకుని రచనలు చేసినప్పుడే రచయిత సమాజంపైన సరియైన ప్రభావాన్ని వేయగలుగుతాడు' ఈ ఉపన్యాసాలలో వారు నిష్కర్షించిన సారభూతమయిన సిద్ధాంతాలలో కొన్ని.

శ్రీ రామానుజరావు గారిది విశిష్ట మయిన పలుకుబడి. తెలంగాణా పునర్వికసన మహోద్యమంలో వైతాళికులయిన కథావశేషులు మాడపాటి హనుమంతరావు గారు, సురవరం ప్రతాపరెడ్డి, ఆదిరాజు వీరభద్రరావు, బూర్గుల రామకృష్ణరావు, పులిజాల హనుమంతరావు వంటి హేమాహేమీల సాన్నిహిత్యం వల్ల ఉత్తేజం పొందినప్పటికీ శ్రీ రామానుజరావుగారు రాజకీయ రంగంలోగాని, రచనా వ్యాసంగంలోగాని తమదైన వ్యక్తిత్వాన్ని స్థిరపరచుకున్న వారు; తమదైన శైలిని తమంత తాముగా శిల్పించుకున్నవారు.

సమగ్రత, సంగ్రహత దేవులపల్లి వారి రచనా ఫక్కిలోని ప్రముఖ లక్షణం. ఏ ప్రసంగాన్ని ఎత్తుగడ చేసినా, ఏ చర్చను కొనసాగించినా, ఏ గోష్ఠిని ముక్తాయింపు చేసినా వారి ఆలోచనా సరళీ, అవగాహనారీతీ ఆవిష్కరణ విధానమూ ఔచితీ సుందరంగా భాసిస్తుంటాయి. హితంగానూ, మితంగానూ చెప్పడం వారికి వెన్నతో పెట్టిన విద్య. అభిప్రాయ భేదమున్నప్పటికీ యెదుటి వారిని నొప్పించకుండా ఒప్పించేవాదనా పటిమ వారి సొమ్ము. ప్రతి పదం ఆచి తూచి ప్రయోగించినట్లుగా మనకనిపిస్తుంది. కాని, వారి పదనియోజన పద్ధతిలోని నిసర్గగుణమే అంత. అది యదృచ్ఛా శిల్పమే కాని, జ్ఞాత శిల్పం కాదు. కట్టమంచి రామలింగారెడ్డి, రాళ్ళపల్లి

అనంతకృష్ణశర్మ, పూతలపట్టు శ్రీరాములురెడ్డి, రొక్కం లక్ష్మీనరసింహందొర, సురవరం ప్రతాపరెడ్డి. పైడి లక్ష్మయ్య, బెజవాడ గోపాలరెడ్డి మున్నగుఉదాత్తసంస్కృతి సంపన్నుల ఉపన్యాసాలలో కొట్టవచ్చినట్లు కనిపించే విలక్షణమయిన మాండలిక స్పర్శ దేవులపల్లి వారి రచనంలోనూ, ప్రవచనంలోనూ ప్రసరించి ఒక వింతహొయలును వెలారుస్తుంటుంది.సభాముఖంగా శ్రీరామానుజరావు గారి ఆశురూపప్రసంగాలు విన్న వారికి సముఖంలో వారి సంభాషణలలో ప్రాల్గొన్న వారికీ నా యీ మాట అతిశయోక్తి అనిపించదు. వారి శైలిలో ఆవేశం కంటే ఆలోచనపాలు అధికం. అయితే అది ఆపాత మధురంగా అలరించడమే గాక ఆలోచనామృతంగా నూతన భావాలను రేకెత్తిస్తుంది.

సంస్థా పరిపాలనంలోనూ, సాహిత్య పరిపోషణంలోనూ శ్రీరామానుజరావు గారు ఉన్నత పదస్థులు. వారి యీ కృషి సంస్కృతి ప్రియులకు చక్కటి నజరానా.

నాగార్జుననగర్
వినాయక చతుర్థి
6-9-1978

తూమాటి దొణప్ప
నాగార్జున విశ్వవిద్యాలయం.

నా మాట

ఇటీవల కొన్ని సారస్వత వేదికల మీదా, ఆకాశవాణి నుండీ, నేను చేసిన ప్రసంగాలు మిత్రుల కోరికపైన ఈ గ్రంథరూపములో వెలువరించ నైనది. నా సాహిత్యవ్యాస సంపుటాలలో ఇది మూడవది. మొదటి సంపుటము సారస్వత నవనీతము, రెండవ సంపుటము రేడియోప్రసంగాలు, మూడవది యీ సంపుటము.

ఈ సంపుటములో ఉర్దూ తెలుగు భాషల పరస్పర ప్రభావాలను గూర్చి చేసిన ప్రసంగాలు నాల్గు ఉన్నవి. హైదరాబాదు ఆకాశవాణి కోరిక పైన యీ ప్రసంగాలు చేయనైనది. కొందరు అపోహపడినట్లు ఉర్దూ విజాతీయమైన భాషకాదు. అది మన దేశములో పుట్టి, పెరిగిన భాష. ఆ భాషా వికాసానికి ఇతరభాషలు మాట్లాడువారు చేసిన కృషి గణనీయ మైనది. ఇతర రంగాలలో ఏమైనప్పటికి, భాషారంగములోను సాహిత్య రంగములోను, ప్రాంతము మతము మొదలైన సంకుచిత భావాలకు చోటు లేదు భారతీయ సాహిత్యచరిత్ర ఇందుకు మంచి ఉదాహరణము.

ఈ సంపుటములో ఇద్దరు ప్రముఖ సాహిత్యవేత్తలను గూర్చి వ్రాసిన వ్యాసాలు రెండు ఉన్నవి. అవి ప్రత్యేక సంచికల కొరకు వ్రాసినవి. ఇవి గాక మరో రెండు వ్యాసాలు కూడ ప్రత్యేక సంచికలకు వ్రాసినవే.

ఇంతకు పూర్వము నా రచనలను ఆదరించిన ఆంధ్రమహాజనులు యీ సంపుటమును కూడ అభిమానించగలరని ఆశిస్తున్నాను.

ఈ గ్రంథానికి తొలిపలుకు వ్రాసిన మిత్రులు డాక్టర్ దోణప్ప గారికి ధన్యవాదాలు.

హైదరాబాదు
22-9-78

దేవులపల్లి రామానుజరావు

వి ష య సూ చి క

తెలంగాణ సాహితీ వికాసము

(నెల్లూరు ఉపన్యాసము – ఫిబ్రవరి 1978)

తెలుగు దేశ చరిత్రలో, తెలుగు సీమ భూగోళంలో నెల్లూరు మండలం విశిష్టమైనది. కళలకు, సాహిత్యానికి, సంస్కృతికి తరతరాలనుండి కాణాచి సింహపురి. అందుచేతనే సింహపురిలో జరిగే సన్మానానికి ప్రత్యేక ప్రాధాన్యాన్ని మన కవి, పండితులు యిస్తున్నారు. అనేక సంవత్సరాలనుండి కవిత్రయ జయంతులు జరుపుతు ఆ సందర్భాలలో కవులను పండితులను ఆహ్వానించి వారిచేత విద్వదభిరామమైన ఉపన్యాసాలను చేయించే ప్రశస్తి, సంప్రదాయం నెల్లూరులో నెలకొని యున్నది. విశ్వవిద్యాలయాలు చేయించే ఎక్స్టెన్షన్ లెక్చర్స్ వంటివి. యీ కవిత్రయ జయంతి సందర్భంలో జరిపించే ఉపన్యాసాలని విద్వాంసుల ఏకగ్రీవ అభిప్రాయం.

ఈ సంవత్సరం యీ సన్మానాన్ని స్వీకరించి ప్రసంగించవలెనని ఆహ్వానించినపుడు నాకు కొంత ఆశ్చర్యము కలిగినది. అంతేకాదు నిర్వాహకుల వివేకములో కొంత సందేహము కలిగినది. అయితే ఇంకా ఆలోచించినపుడు ప్రతి సంవత్సరం కవి పండితులను మాత్రమే ఆహ్వానించే యీ ప్రశస్త సంప్రదాయాన్ని యీ సంవత్సరానికి నిలిపివేసి విద్వాంసుల శ్రేణికి చెందని వ్యక్తి నొకరిని యీ పర్యాయం ఆహ్వానించి జరిగే చమత్కారము చూడవలెనని యీ నిర్వాహకులు ఉబలాట పడినారేమో యని నాకు తోచినది. అదే నిజమైతే ఆ ఉబలాటం తీర్చవలెననే నేను మీ ముందు నిలిచినాను. నా యీ సాహసానికి మరొక కారణం నాకు పరమాప్తులై యీ జయంతుల నిర్వాహణ కార్యకలాపాలకు యాజమాన్యము వహిస్తున్న డా॥ బెజవాడ గోపాలరెడ్డి గారి నిర్ణయం కాదనగలిగే శక్తి లేక పోవడం.

ఈ రోజు నేను యేమి మాట్లాడవలెనని ప్రశ్నించుకున్నపుడు అప్రయత్నంగా రాయప్రోలు పద్యమొకటి నా నాలుకమీద దొరలినది.

పాయలు పాయలు గా విడి
పోయిన తెనుగు కన్నియ ముంగురులకు, వే
ణీ యోగ్యా భరణముగా జడకుచ్చు ల
ల్లి యిచ్చితి భక్తిన్.

వెంటనే యీనాటి ప్రసంగానికి యీ పద్యాన్నే ప్రధాన ప్రాతిపదికగా చేసుకుంటే బాగుంటుందనే తలంపు మెరపువలె మెరసినది నిజమే! తెలుగు కన్నియ ముంగురులు పాయలు పాయలుగా విడిపోయినవి. ఎన్ని పాయలు? ఎంత కాలంనుండి? అనేక శతాబ్దాల నుండి, క్రీస్తుకు పూర్వం నుండి, రెండు వేల సంవత్సరాలనుండి, తెలుగు వానికి విదేశాలతో వ్యాపారం చేసే సంబంధాలు రెండు వేల సంవత్సరాలకు పైగా ఉన్నవి. స్వర్గీయ మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు వ్రాసిన వాక్యాలు వినండి. "ఆనాడు (అనగా క్రీస్తుపూర్వం) మన దేశము, రోము మొదలైన పడమటి నగరాలతోను, తూర్పు దేశాలతోను, ద్వీపాలతోను వర్తక వ్యాపారాలు సాగించింది. ఓడల వర్తకులతోపాటు మన మతము, మన విద్యలు, మన కళలు అన్నియు కూడ తూర్పుదేశాలకు, ద్వీపాలకు వెళ్ళినవి. ఈ విధంగా భారతీయ సంస్కృతిని తూర్పు దేశాలలోను, ద్వీపాలలోను వ్యాపింపజేసిన మొట్ట మొదటివారు మన పూర్వులు బౌద్ధాంధ్రులు, కాళింగు లూను"—విదేశాలతో తెలుగు వారికి గల సంబంధాలు మిక్కిలి ప్రాచీనమైనవి. ఈనాడు మనము తెలుగును గూర్చి అంతర్జాతీయ స్థాయిలో ఆలోచిస్తున్నాము — తెలుగువారు తగినంత సంఖ్యలో అన్నిదేశాలలో కనిపిస్తున్నారు. మళ్ళీ రాయప్రోలువారు చెప్పిన పద్యమే వినండి.

"మోటుపల్లి తీరమున లంగరేసి ఓ
డలు సుంక మర్పింప నిలుచునాడు
రాయలసీమ రారాయబిడ్డు వసించి
చిత్రచరిత్రల్ రచించు నాడు
పాకాల చెరువు చెంపలపండు ధాన్యము
అన్య దేశాధీరు లడుగునాడు
అద్దంకి కోడెల నాబోతులకు నై
దూరా గతులు కొని త్రోలు నాడు
ఖండ ఖండాంతరములన్ ప్రకాశమయ్యె

తెనుగు తల్లి లాలాటికా తిలక దీప్తి
తమ్ముడా మాయనిత్తువే తల్లి వన్నె
చెల్లెలా చిన్నబుత్తువే తల్లి చిన్నె"

అను ప్రబోధము యీనాడు మనలను ఉత్తేజితము చేస్తున్నది.

అయితే సాంస్కృతిక సంబంధాలు పరస్పరమైనవి. మనము కొంత ఇచ్చినప్పుడు మరికొంత తీసుకోవడం కూడా జరుగుతుంది. పరదేశ, పరప్రాంత, పరభాష, పర సంస్కృతులను జూచి తెలుగు వాడెన్నడు ఉలికిపడలేదని చరిత్ర చాటుచున్నది. ఈ దృక్పథంతో తెలుగు దనాన్ని పరిశీలించినపుడు వ్రాయవలసిన సంగతులు ఒక గ్రంథమే కాగలదని అనిపిస్తున్నది.

ఈనాడు తెలుగువారు విదేశాలలోను, మన దేశంలోని ఇతర రాష్ట్రాల లోను అధిక సంఖ్యలో నివసిస్తూ ఆయాదేశాల, అయాప్రాంతాల అభివృద్ధికి పాటు బడుతున్నారు. కొన్ని విదేశాలలో తెలుగువారు మనకన్న ఆర్థికంగా సంపన్నులై సామాజికంగా పురోగాములై ఉన్నారు. బర్మా, మారిషస్, దక్షిణాఫ్రికా, ఫిజీ, మలేషియా మొదలైన దేశాలలోని తెలుగువారు ఇందుకు నిదర్శనం. ప్రత్యేకంగా వారికి కులసంబంధమైన స్పృహలేదు. ఏకులం వారో, ఎప్పుడు వెళ్ళినారో తెలియదు కానీ, తెలుగు మాట్లాడే వారంతా ఒకే కులంగా రూపొందినారు. మన సంస్కృతిని విదేశాలకు, విదేశాలలోని తెలుగువారికి అందించే ప్రయత్నంతో పాటు కులరహితమైన అక్కడి సంస్కృతిని మనం గ్రహించే ప్రయత్నం చేయ వలసి ఉంటుంది. ఈ కుల రహితమైన సమాజ పరిణామఫలితంగా ఆదేశాలలోని తెలుగు భాష పరిణామము కూడ మనం గమనించవలసి ఉంటుంది. భాషనుబట్టి కులాన్ని పోల్చుకోలేని నుడికారము అది. ఈ నుడికారము పైన సహజంగా అక్కడి భాషల ప్రభావం కూడా పడి ఉంటుంది. అంతర్జాతీయ తెలుగు సంస్థవంటి సంస్థలు విదేశాలలోని తెలుగు భాషా పరిణామాన్ని పరిశీలించవలసి ఉంటుంది. ఇదే విధంగా భారతదేశంలోని ఇతర రాష్ట్రాల తెలుగు నుడికారాన్ని కూడా పరిశీలించవలసి ఉంటుంది.

కొన్ని విదేశాలలో, తెలుగు, సాహిత్యపరంగా కూడ మంచి అభివృద్ధి పొందినది. బర్మాలో వివిధ వాఙ్మయ ప్రక్రియలలో సాధన చేసిన తెలుగు రచయితలు, తెలుగు పత్రికలు, తెలుగు సారస్వత సంఘాలు, నాటక సమాజాలు

ప్రశంసనీయమైన కృషి గావించి, సాంస్కృతిక చైతన్యానికి పాటుపడుట జరిగినది. ఇటీవల అంతర్జాతీయ తెలుగు సంస్థ బర్మా, మారిషస్ దేశాలను గూర్చి రెండు పుస్తకాలు ప్రకటించినది. ఇతర దేశాలలోని తెలుగు భావను గూర్చి కూడ యిటువంటి పుస్తకాలు ప్రచురణ కావలసిన అవశ్యకత ఉన్నది. ఇది జరిగినపుడు విదేశాలలోని తెలుగు సాహిత్యవికాస చరిత్రకు తగిన సామగ్రి లభించగలదు.

ఇతర దేశాల ఇతర రాష్ట్రాల తెలుగు స్వరూప స్వభావాల పరిశీలన నాప్రసంగానికి ప్రస్తుతం కాదు. మన తెలుగు సీమలో విభిన్న ప్రాంతాల మాండలికాలను గూర్చి కొద్దిగా ప్రస్తావించి తెలంగాణా సాహిత్య వికాసాన్ని సమీక్ష చేయడమే యీనాటి నా ప్రసంగ ఉద్దేశ్యం. ఇందుకు భూమికగా కొన్ని మాటలు చెప్పవలసి ఉంటుంది. తెలుగుజాతికి ఉజ్జ్వలమైన చరిత్ర ఉన్నది. అయితే యీ చరిత్రను పరిశీలించినపుడు తెలుగువారు ఏకపరిపాలన క్రింద ఉన్న ఘట్టాలు మూడు మాత్రమే మనకు కనిపిస్తున్నవి మొదటి మారు కాకతీయ యుగంలో; రెండవ పర్యాయం గోలకొండ రాజుల పరిపాలనలో; మూడవసారి నేటి ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డ తరువాత, ఈ విషయంపై మల్లంపల్లి సోమశేఖరశర్మగారు వ్రాసినమాటలు గమనించండి.

''గణపతి దేవ మహారాజు తెలుగు మాట్లాడే ఆంధ్రులందరిని ఒక్క రాజ్యంలోకి తీసుకరావలెనని మొదటిసారి ప్రయత్నించాడు. ఈ మహారాజుకు సమకాలికుడు తిక్కన సోమయాజి. ఈయన మహాకవి. నెల్లూరు పాలించిన తెలుగు చోళరాజు మనుమసిద్ధి ఆస్థానంలో ఉండి విరాటపర్వము దగ్గరినుండి సంస్కృత మహాభారతం పదిహేను పర్వాలున్ను తెనుగు చేసి మనదేశంలోని వేద, మత, ధర్మానికి గట్టి విత్తనం వేశాడు. మనది ఆంధ్రదేశం, మనం ఆంధ్రులమనే జాతీయాభిమానం మొదటిసారి మనకు యీ కాలంలోనే కలిగింది. దేశంలో క్రొత్త ఉత్సాహం ప్రబలింది. ఇక లోటేమిటి? గణపతి దేవమహారాజు సర్వవిధాల సమర్థుడు, శౌర్యపరాక్రమాలు గలవాడు ... మన ఆంధ్రదేశం ఇంచుమించుగా ఓరుగంటి కాకతీయుల అధికారంలోనికి వచ్చింది'' ''తరువాత తెలుగు దేశంలోని అత్యధిక భాగాన్ని పరిపాలించినవారు బహమనీ రాజులు(అయితే బహమనీ రాజ్యము బహు భాషా రాష్ట్రము. మహారాష్ట్ర, కర్ణాటక, తెలుగు ప్రజల సమష్టికుటుంబము, పూర్వపు హైదరాబాదువలె)బహమనీ రాజ్యం విచ్ఛిన్నం అయిన తరువాత గోలకొండ రాజ్యం యేర్పడినది. గోలకొండ రాజ్యచరిత్ర అంటే ముస్లిం సుల్తానుల పరిపాలన

లోని ఆంధ్రదేశచరిత్ర అన్నమాట, గోలకొండ తెలుగు రాజ్యము. గోలకొండ సుల్తానులు తెలుగు ప్రభువులు అయినారు." తెలుగు కవిత్వంలో ఇబ్రాహీం కుతుబ్‌షా, ఇభరాముడుగా మారి తెలుగు జనానికి అభిరాముడైనాడు. బహమనీ రాజులక్రింద, గోలకొండ సుల్తానులక్రింద ఫారసీ, ఉర్దూ భాషలతో తెలుగు భాషకు, తెలుగు దేశానికి పరిచయము కలిగినది. ఈప్రభావం ఆనాటి నుండి నేటివరకు కనిపిస్తుంది.

గోలకొండ రాజ్యం పతనమైన తరువాత ఇరువై సంవత్సరాల క్రింద వరకు అనగా ఆంధ్రప్రదేశ్ యేర్పడేవరకు మధ్యన ఉన్న కాలంలో తెలుగుదేశం భిన్న పరిపాలన క్రింద ఉండిపోయినది. తెలంగాణా ప్రాంతం, రాయలసీమ ప్రాంతం, సర్కారు ప్రాంతాలు రూపొందినవి. సర్కారు, రాయలసీమ ప్రాంతాలు ఇంగ్లీషు పరిపాలన క్రిందికి పోయి తమిళ, కర్ణాటక, మళయాళ భాషీయులతో కలిసి ఉండటం తటస్థించినది. ఇంగ్లీషు వారికి సామంతుడైన నిజాం యేలుబడిలో తెలంగాణా, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలతో కలసి నిలిచినది. రాయప్రోలు ప్రస్తావించిన తెలుగు కన్నియ ముంగురులు యీ విధంగా పాయలు పాయలుగా తెలుగు సీమలోనే విడిపోయినవి. తత్ఫలితంగా తెలుగు భాషా వికాసంలో మాండలికమైన ప్రత్యేకతలు యేర్పడినవి. రాయలసీమ, సర్కారు జిల్లాలు, తెలంగాణము అనే మూడు పాయలలో, యీ ప్రత్యేకతలను స్పష్టంగా పోల్చుకోవచ్చును.

తెలంగాణ నిజాం యేలుబడి క్రింద సుమారు నూటాయేబది సంవత్సరాలు ఉండి పోయినది. ఈ 150 సంవత్సరాలలో ఇక్కడి సాహిత్య స్వరూపాన్ని పరిశీలించడం అవసరం. తెలంగాణాలో కూడ జిల్లా స్థాయిలో మాండలికమైన ప్రత్యేకతలు మనకు కనిపిస్తున్నవి. మహబూబునగరు జిల్లా భాషకు ఖమ్మం జిల్లా భాషకు వ్యత్యాసాలు మనం పోల్చుకోవచ్చును. ఆదిలాబాదు నిజామాబాదు జిల్లా మాండలికాల ప్రత్యేకతను మనం గమనించవచ్చును. మెదక్ వరంగల్ జిల్లాల మాండలిక స్వరూపాన్ని మనం గుర్తించవచ్చును. తెలుగు అకాడమీ పక్షాన జిల్లా స్థాయి భాష సర్వే జరుగు చున్నది. ఈ సర్వే ఫలితం భాషా శాస్త్రజ్ఞుల పరిశోధనలకు ఉపయుక్తం కాగలదని చెప్పవచ్చును.

తెలంగాణా మాండలికాన్ని పరిశీలించినపుడు శబ్దపరంగా మనకు కొన్ని ప్రత్యేకతలు కనిపిస్తున్నవి. "గెద్దం" అన్నమాటకు తెలంగాణా జిల్లాలో అర్థం వేరు.

ఆంధ్ర జిల్లాలలో అర్థంవేరు. ''వాకిలి'' అనగా తెలంగాణాలో ఇంటి ముందు చోటు కానితలుపుకాదు. "గడప" అన్నమాట తెలంగాణా వ్యవహారంలో "కడప". 'పోకలు' అనే మాటకన్న "బాగాలు" అనే మాట తెలంగాణా వ్యవహారంలో ఉన్నది. "పెదాలు" అన్నమాటకు పెదుములు అని తెలంగాణాలో వ్యవహారం. "అలా" అనేమాటకు తెలంగాణాలో "అట్లా" అంటారు. కావాలి, చేయాలి అనే "లి" ప్రత్యయం తెలంగాణా వాడుకలో లేదు. వచ్చాడు, పోయాడు కూడ తెలంగాణా వాడుకలో లేవు. గోలకొండ సుల్తానుల కాలంలోను, అంతకు ముందుగాను ఫారసీభాషా ప్రభావం వల్ల తెలుగులో అనేక ఫారసీ, ఉర్దూ శబ్దాలు వచ్చినవి. వీని సంఖ్య నూర్లలో ఉంటుంది. అయితే యీ శబ్దాల వాడుకలో కూడ తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలలో కొన్ని వ్యత్యాసాలు కనిపిస్తున్నవి. "షికారు" అనగా వాహ్యాళి కాదు "వేట". "ముద్దాయి" అనగా నిందితుడు కాడు నేరారోపకుడు. ఇంకా ఇటువంటి శబ్దాలను అనేకము సూచించ వచ్చును. మాండలికమైన వ్యత్యాసాలకు మచ్చులు మాత్రమే యీ శబ్దాలు. ఈ సందర్భంలో తెలంగాణా నుడికార ప్రభావం కూడ కొద్దిగా ఉర్దూమీద కనిపిస్తున్నదనీ, కొన్ని తెలుగు శబ్దాలు ఉర్దూలో కూడ దొరలినవని మనం గమనించవలసి ఉంటుంది. అ విషయం ప్రస్తుతం కాదు. తెలంగాణా ప్రాంతములోని మరికొన్ని సాంస్కృతిక ప్రత్యేకతలను కూడ యీ సందర్భంలో గమనించవలసి ఉన్నది. ఉదాహరణకు ఉత్తర భారతపు ప్రభావము వలన "హోళీ" పండుగకు తెలంగాణాలో ప్రాచుర్యం ఎక్కువగా ఉన్నది. మొహర్రం సందర్భంలో పీర్ల పండుగ కూడా ఇటువంటిదే. విజయదశమికి ముందుగా తొమ్మిది రోజులు తెలంగాణా ప్రాంతములో ప్రతి పట్టణంలోను, ప్రతి పల్లెటూరులోను స్త్రీలు వినోదించే బతుకమ్మ పండుగ తెలంగాణాకు ప్రత్యేకమైనది. ఈ విధమైన ప్రత్యేకతలను కొన్నింటిని ఆహార విహారాలలోను, ఆచార విచారాలలోను, వేషభాషలలోను పోల్చుకోవచ్చును. కాని యీ ప్రత్యేకతలు తెలుగు సంస్కృతిని విభజించునట్టివి కావని బహిరంగానికి మాత్రమే చెందినవని, అంతరంగికంగా ఆంధ్ర సంస్కృతి ఏకత్వానికి ప్రతిబంధకము కావని యీ సందర్భంలో స్పష్టీకరించవలసి ఉన్నది.

తెలుగు సాహిత్య చరిత్రలో తెలంగాణా ప్రాంతానికి విశిష్టమైన స్థానము. తెలుగు సాహిత్యములో ప్రశస్తమైన, గణుతి కెక్కిన గ్రంథాలు మూడు. భారతము, భాగవతము, రామాయణము. ఏకశిలానగరంలోని గణపతి దేవుని ఆస్థానంలో తిక్కన భారతావిష్కరణ జరిగినది. భాస్కరరామాయణము వ్రాసిన భాస్కరుడు,

మల్లికార్జున భట్టు, కుమార రుద్రదేవుడు, అయ్యలార్యుడు తెలంగాణా ప్రాంతము వారే. ఆంధ్ర మహాభాగవతము వ్రాసిన పోతనామాత్యుడు తెలంగాణా ప్రాంతీయుడే. మారన మార్కండేయ పురాణం యీ ప్రాంతముననే వ్రాసినాడు. మొట్టమొదటి అచ్చతెనుగు కావ్యము యయాతి చరిత్ర రచించిన పొన్నగంటి తెలగన్న యీ ప్రాంతము వాడే. సామాన్య ప్రజలకు అందుబాటులో నుండునట్లు జాను తెనుగులో రచన గావించవలెనని ప్రబోధించి బసవపురాణాన్ని వ్రాసిన పాల్కురికి సోమనాథుడు తెలంగాణా ప్రాంతీయుడే. ఈ విధంగా ప్రాచీన సాహిత్యం తెలంగాణాలో వర్ధిల్లినది. తెలంగాణము ఇతరాంధ్ర దేశంతో వేరొక పాయగా విడిపోయిన తరువాత కూడా తెలుగు సాహిత్యం యిక్కడ ప్రవర్ధమానమైనదని యీ సందర్భంలో చెప్పవలసి ఉన్నది. రాజకీయంగా వేరుపడి పోయినప్పటికిని భాషాదృష్ట్యా తెలంగాణా ప్రాంతం ఆంధ్ర ప్రాంతంలో సన్నిహిత సంబంధాలు కలిగియుండినది. ఈ సంబంధాలు ఎన్నడూ తెగిపోలేదు. కావున తెలంగాణా ప్రాంతంలో తెలుగు పాండిత్యంలేదని తెలుగు సంస్కృతికి చోటులేదని ఆంధ్రప్రదేశ్ యేర్పడక పూర్వం కొన్ని వర్గాలలో వ్యాపించిన అభిప్రాయం సరియైనది కాదు. తెలంగాణాలోని గ్రామాలలో తాళపత్ర గ్రంథాలులేని ఊరు లేనేలేదని చెప్పితే అతిశయోక్తి కాజాలదు. సుమారు ఏబది సంవత్సరాల క్రిందట నా చిన్నతనమున కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తు పక్షాన స్వర్గీయ జయంతి రామయ్య పంతులుగారి ఆదేశంపై స్వర్గీయ శేషాద్రిరమణ కవులలో ఒక్కరైన దూపాటి వేంకటరమణాచార్యులవారు తెలంగాణా ప్రాంతమంతా తిరిగి ఎన్నో శాసనాలను, నూర్ల కొద్ది తాళ పత్ర గ్రంథాలను సంపాదించిసాహిత్య పరిషత్తుకు అప్పగించి యుండిరి. ఇవి అన్నీ సాహిత్య పరిషత్తు కార్యాలయంలో యీనాటికి ఉండవచ్చును. ఆంధ్ర చరిత్రకు, ఆంధ్ర సాహిత్యానికి ఆక్కరయిన సామగ్రి అనేకము యీ శాసనాలలోను, యీ తాళపత్ర గ్రంథాలలోను లభించిందని విజ్ఞులు చెప్పిన మాటలు నాకు బాగా తెలిసిన సత్యము. ఈ తెలంగాణా శాసనాలలో కొన్నింటిని హైదరాబాదులోని లక్ష్మణరాయ పరిశోధక మండలివారు ప్రకటించినారు. మరికొన్ని శాసనాలు ఆర్క్యాలజీ శాఖకు అప్పగించబడినవి. ఇందులో కొన్ని ప్రకటితమైనవి కూడా. ఇంతకూ చెప్ప వలసిన మాట యేమనగా తెలంగాణా ప్రాంతంలో తెలుగు దీపాలు ఎన్నడూ ఆరి పోలేదన్న సత్యం - అప్పటి ప్రభుత్వ విధానాల వలన యీ దీపాలు దేదీప్య మానముగా ప్రకాశించక పోవచ్చును, కానీ మిణుకు మిణుకు మని వెలుగుచునే యుండెను. హైదరాబాదు నగరంలోని పరిస్థితి ఎట్లున్నప్పటికిని పల్లె ప్రాంతాలలో తెలుగు భాషా సాహిత్యములు అంతరించలేదు.

గోలకొండ సుల్తానులు ప్రజల మతాన్ని, ప్రజల భాషను, ప్రజల సంస్కృతిని ప్రోత్సహించి ఆదరించినారు. కానీ ఆసఫ్‌జాహీ వంశీయులు ఈ ఉత్తమ సంప్రదాయాన్ని పాటించలేదు. ముఖ్యంగా గత శతాబ్దం తుది భాగం నుండి భారతదేశానికి స్వాతంత్ర్యము వచ్చి హైదరాబాదు పైన పోలీసుచర్య జరిగేవరకు ప్రభుత్వవిధానాలు ప్రజల భాషలను అణచివేయునవిగా ఉండినవి. బ్రిటిషు పరిపాలనలో భాషలను అణచివేయుటకు ఇటువంటి ప్రయత్నాలు జరుగ లేదు. మాతృభాషలద్వారా విద్యాబోధన అవకాశాలు అప్పటి హైదరాబాదు రాష్ట్రంలో పూర్తిగా లేకుండెను. బ్రిటిషు పాలనలో గ్రంథాలయాల స్థాపన నిషేధించలేదు. రాజకీయాలతో సంబంధములేని సారస్వత కృషి బ్రిటిషు ప్రాంతంలో నిరంతరాయంగా జరిగింది. సి. పి. బ్రౌన్ వంటి సివిలియన్ అధికారులు ప్రజల భాషల వికాసానికి కృషిచేసిరి. వీరేశలింగం పంతులు మొదలైన వారి సారస్వత కృషికి ప్రభుత్వం ఆటంకాలు కలిగించలేదు. కానీ తెలంగాణా ప్రాంతంలో పరిస్థితి మరొక విధంగా ఉండినది. మాతృభాషల వికాసానికి గొడ్డలి పెట్టు వంటి విధానాలను హైదరాబాదు ప్రభుత్వం అమలు చేసినది. తెలుగు చదువు కొనడానికి అవకాశాలు లేనే లేకుండినవి. ఒక గ్రంథాలయాన్ని పెట్టుకోవడమే చాలా కష్టమైన పనిగా ఉండినది. కవిసమ్మేళనాలు, సారస్వత సభలను జరుపు కోవడం కూడా ప్రభుత్వానికి కంటగింపుగా ఉండినది. ఇందువలన ప్రజలలో స్వతంత్ర భావాలు వ్యాపిజెంది రాజకీయంగా తన అస్తిత్వానికి భంగము కలుగ గలదని అప్పటి ప్రభుత్వం అభిప్రాయపడినది. ఆంధ్ర అనే పేరిట ఏ ఉద్యమము సాగినప్పటికిని దానిని ప్రభుత్వం శత్రుభావముతో చూచినది. ఆంధ్ర అనే పదములో ఉద్యమాలు నడిపితే తుదకు యీ ఉద్యమాల ఫలితంగా తెలంగాణా ఆంధ్ర ప్రాంతముతో కలిసిపోయే ప్రమాదము వాటిల్లగలదని అప్పటి ప్రభుత్వం అభిప్రాయపడినట్లు ప్రామాణికమైన ఆధారాలు ఉన్నవి. అందుచేత సారస్వత కృషి కూడ ఆరోజులలో రాజకీయ కృషివలె ప్రచ్ఛన్నంగా జరుగవలసిన అవసరం యేర్పడినది. ఈ పరిస్థితినే వాగ్బంధన శాసన పైశాచిక తాండవమని స్వర్గీయ సురవరం ప్రతాపరెడ్డిగారు ఒకమారు వర్ణించియుండిరి.

తెలంగాణా ప్రాంతంలో ఊరూర ఉద్దండులైన సంస్కృతాంధ్ర పండితు లున్నప్పటికిని వారు సభలలో సమావేశమై పరస్పర అవగాహన చేసుకునే అవకాశాలు బొత్తిగా లేకుండెను. రాజ భాషయైన ఉర్దూ, ప్రాథమిక దశనుండి

విశ్వ విద్యాలయ దశవరకు బోధనాభాష కావడంవల్ల తెలుగు భాషాభివృద్ధికి గొప్ప సంకట పరిస్థితి యేర్పడినది. ఆ రోజులలో హైదరాబాదు రాష్ట్రం ఒక ప్రత్యేకమైన ద్వీపకల్పముగా సిద్ధమై అక్కడ నివసించే ప్రజలను ఇతర ప్రపంచము నుండి వేరు చేసినది. అందుచేత గత శతాబ్దమునుండి భారత స్వాతంత్ర్య ప్రాప్తివరకు అక్షరాస్యులైన ప్రజల సంఖ్య మిక్కిలి తక్కువగా ఉండెను. సంస్కృతాంధ్ర పండితులు కవులు గ్రాసవాసోదైన్యానికి గురియై పల్లెటూళ్ళలో కృశించిరి. కొద్దిమంది ఉర్దూ, ఫారసీ భాషలతో పరిచయం చేసుకొని ప్రభుత్వ ఆశ్రయముతో తమ పనులను నెరవేర్చుకొనిరి ఈ విధంగా తెలుగు భాషా వికాసానికి తెలంగాణా ప్రాంతంలో గ్రహణము పట్టినది.

ఈ పరిస్థితులలో తెలుగు భాషను ఆదరించి, ప్రోత్సహించినటువంటి సంస్థానాల కృషిని మనము మరచిపోవడానికి వీలులేదు. గద్వాల, వనపర్తి, ఆత్మకూరు సంస్థానాలను యీ సందర్భంలో ప్రశంసించవలసి ఉన్నది. ఆంధ్ర ప్రాంతానికి, తెలంగాణా ప్రాంతానికి ఒక విధంగా యీ సంస్థానాల ఆదరణ వలన సాంస్కృతిక సంబంధాలు పెంపొందినవి. ప్రతి సంవత్సరం ఆంధ్ర ప్రాంతమునుండి కవులు, పండితులు వచ్చి యీ సంస్థానాలలో సన్మానము పొందే వారు. ఇటువంటి వారిలో తిరుపతి వేంకట కవులు కూడ ముఖ్యులు. ఈ అవధానాలు ఆనాడు తెలంగాణా ప్రాంతానికి, ఆంధ్ర ప్రాంతానికి మధ్య భాషా పరమైన వంతెనలుగా ఉండినవి. వీనికితోడు కొన్ని నాటక సంఘాలు కూడ ఆంధ్ర ప్రాంతమునుండి వచ్చి తెలంగాణా ప్రాంతములోని కొన్ని పట్టణాలలో నాటకాలను ప్రదర్శిస్తుండేవి. మైలవరము, సురభి మొదలైన నాటక సంఘాలు వరంగల్లు మొదలైన తెలంగాణా ప్రాంతాలలో నాటకాలను ప్రదర్శించి యీ రెండు ప్రాంతాల మధ్య సాంస్కృతిక సమైక్యతను బలపరచిన సత్యము యీ సందర్భములో మనము గమనించవలసి ఉన్నది.

తెలంగాణాలోని పరిస్థితులను గమనించి యీ ప్రాంతమున సాహిత్య వికాసానికి కృషిచేయవలెనని సంకల్పించినవారు స్వర్గీయ కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగారు. ఆయన గొప్ప పరిశోధకుడు. తెలుగు భాషా వికాసానికి అపారమైన కృషిచేసిన మేధావి. నిష్కళంక దేశభక్తుడు. ఆ రోజులలో చాలా మంది ఆంధ్ర ప్రాంతీయులకు తెలంగాణాను కూర్చి సరియైన అవగాహన లేకుండెను. లక్ష్మణరావుగారు మునగాల సంస్థానానికి దివానులైనందువలన మునగాల సంస్థానా

ధీశ్వరులకు తెలంగాణా ప్రాంతంతో సంబంధాలు ఉండినందువలన ఆ ఉభయులు హైదరాబాదుకు రాకపోకలు చేస్తుండేవారు. లక్ష్మణరావుగారి కృషికి మునగాల రాజాగారి తోడ్పాటు లభించినది. ఈ విధంగా 1900 సంవత్సరమున శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయము స్థాపితమైనది. తరువాత 1904వ సంవత్సరమున రాజరాజనరేంద్ర భాషా నిలయం హనుమకొండలో స్థాపితమైనది. ఆ తరువాత మరి కొన్ని సంవత్సరాలకు వరంగల్లులో శబ్దానుశాసనాంధ్ర భాషా నిలయం స్థాపిత మయ్యెను. లక్ష్మణరావుగారి విజ్ఞాన చంద్రిక గ్రంథమండలి కూడా 1900 ల సంవత్సరమున హైదరాబాదులో స్థాపితమైనది. లక్ష్మణరావుగారు, రావిచెట్టు రంగారావుగారు, మునగాల రాజాగారి తోడ్పాటుతో తెలంగాణా ప్రాంతములో సాహిత్య వికాసానికి సాంస్కృతిక చైతన్యానికి గట్టిపునాదులను నిర్మించినారు. తరువాత క్రమక్రమంగా తెలంగాణాలో అనేక గ్రంథాలయాలు స్థాపితమై సాహిత్య సభలు జరిగి కవి పండితులను మేల్కొల్పి తెలుగు భాషాభ్యుదయానికి కృషి చేయడం జరిగింది. ఈ కృషికి లక్ష్మణరావుగారి అడుగుజాడలలో వారి ప్రోత్సాహంతో నాయకత్వం వహించినవారు మాడపాటి హనుమంతరావుగారు, సురవరం ప్రతాపరెడ్డిగారు, ఆదిరాజు వీరభద్రరావుగారు. తెలంగాణాలో తెలుగు వారిని మేలుకొల్పిన గౌరవము యీ మహనీయులకు ఈయవలసి ఉన్నది. ఆనాటి తెలుగు వాని చిత్తవృత్తిని ఒక కవి ఈ విధంగా వర్ణించినాడు

> హాలీ యంచును గాలిబంచును సదా యె
> ఖ్యాలె పో, షాయరిన్ చాలా చాలా నఫీ
> సు బుట్టిపడ మాషాల్లా రచించెన్గదా!

అని తెలుగు వాడు హర్షించే వాడట. ఇటువంటి పద్యాలు ఇంకా మరి కొన్ని ఉదహరించవచ్చును. మొత్తంమీద ఉర్దూ, ఫారసీ భాషల ప్రభావానికి లోనై తన మాతృభాషకు అంత ప్రాధాన్యం యీయని పరిస్థితిని ఆనాటి తెలంగాణములో కనిపించినది. ఈ సందర్భములో పైన పేర్కొన్న ముగ్గురు మహనీయుల మార్గదర్శకత్వంలో గ్రంథాలయాలు, పత్రికలు, గ్రంథమాలలు స్థాపితమై తెలంగాణాను మేలుకొల్పడం జరిగినది. ఈ విధంగా మేలుకొని యువకులు ముందంజ వేసి సాహిత్యవికాసానికి కంకణ బద్ధులైనారు. ఈ విధంగా తెలంగాణ సాహిత్య రంగంలో నవయుగోదయమైనది. కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయాన్ని స్థాపించిన 1900 సంవత్సరము నుండి యీ నవ యుగము

ప్రారంభమై 1948 సెప్టెంబరులో జరిగిన పోలీసు చర్యవరకు కొనసాగినదని చెప్ప వచ్చును. ఈ అర్థశతాబ్దములో సాహిత్య కృషి యే విధంగా జరిగినదో స్థాలీపు లాక న్యాయంగా వివరించడం యీనాటి నా ప్రసంగం యొక్క ముఖ్యోద్దేశము. అందుచేత ఈ కాలంలో సారస్వత వ్యాసంగము చేసిన వారిని గూర్చి మాత్రమే ప్రస్తావించనైనది. 1948 సెప్టెంబరు తరువాత జరిగిన సాహితీ వికాసము మరొక అధ్యాయము. డాక్టరు సి. నారాయణరెడ్డి ప్రభృతులైన ప్రముఖాంధ్ర కవులు, విమర్శకులు, రచయితలు, పోలీసు చర్య తరువాత తమ సాహితీ జైత్రయాత్రను ప్రారంభించినారు.

తెలంగాణా సాహిత్యరంగంలో నవయుగోదయానికి వైతాళికులు నిస్సం దేహంగా కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగారు. ఆయన బహు భాషా వేత్తలు, గొప్పమేధావి, మహావిజ్ఞాని. ఆధునిక యుగంలో తెలుగు భాషా వికసానికి కృషి చేసిన వారిలో వీరేశలింగంగారి ప్రక్కన ఉండవలసినవారు. ఆధునిక అవసరాల దృష్ట్యా తెలుగు భాష ప్రగతి చెందవలెనని ఉద్దేశించి అందుకు అనుగుణమైన వాఙ్మయాన్ని పుష్కలంగా నిర్మించిన మార్గదర్శి మహామనీషి లక్ష్మణరావుగారు. చరిత్ర పరిశోధన, భాషాపరిశోధన, విజ్ఞాన వాఙ్మయాభివృద్ధి, వచన వాఙ్మయ ప్రగతి లక్ష్మణరావుగారి ఆశయాలు. ఈ ఆశయాలకనుగుణంగా వారు తమ అనుయాయులను తీర్చిదిద్దినారు, మాడపాటి హనుమంతరావుగారి పైన లక్ష్మణ రావుగారి ప్రభావము స్పష్టముగా గోచరిస్తున్నది. ఆదిరాజు వీరభద్రరావుగారు లక్ష్మణ రావుగారి శిక్షణలో పెరిగిన వారు. సురవరం ప్రతాపరెడ్డిగారు లక్ష్మణరావుగారిని తమ మార్గదర్శకులుగా అభిమానించినారు. అందుచేత యీ ముగ్గురు ఆధునిక యుగంలో తెలంగాణా సాహిత్యాభివృద్ధికి లక్ష్మణరావుగారి అడుగు జాడలలో కృషిచేసిరి. మాడపాటి హనుమంతరావుగారు ఇంగ్లీషు, ఉర్దూ, ఫారసీ, తెలుగు భాషలలో ప్రవీణులై మహారాష్ట్రము, హిందీ, సంస్కృత భాషలతో తగినంత పరిచయం కలిగినవారు. ఉర్దూలో మంచి రచయిత కూడా. "ముషీర్ దక్కన్" అనే దిన పత్రికకు అనేక సంవత్సరాలు సంపాదకీయాలు వ్రాసినారు, తెలుగులో సరళమైన వచన రచన చేయగలిగినవారు. "క్షాత్రకాలపు హింద్వార్యులు" అనే గ్రంథాన్ని ఆయన మహారాష్ట్రము నుండి తెనిగించినారు. తెలుగు భాషలో మొట్ట మొదటి కథానిక రచయితలలో హనుమంతరావుగారిని పేర్కొనవలసి యున్నది. స్వయంగా మంచి కథలను వ్రాయడమేగాక మున్షీప్రేమ్‌చంద్ కథలను

మొట్టమొదటిసారి అనువదించి తెలుగు వారికి పరిచయం చేసిన గౌరవం మాడపాటి హనుమంతరావుగారికి దక్కుతున్నది. రాజకీయాలలో గోఖలేవంటి మితవాది అయిన హనుమంతరావుగారు తెలంగాణాలో రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక ఉద్యమాలకు వైతాళికులు - వారివలెనే ఆదిరాజు వీరభద్రరావుగారు రాజకీయాలతో సంబంధంలేక గొప్పపండితులై, బహుగ్రంధ రచయితలై, ఉత్తమ వ్యాసకర్తలై గ్రంథాలయోద్యమ నిర్వాహకులై తెలంగాణాలో నవచైతన్యానికి తోడ్పడినారు. సురవరం ప్రతాపరెడ్డిగారు సంపన్న కుటుంబీకులై బి. ఏ; బి. ఎల్ పట్టభద్రులై న్యాయవాదవృత్తిని అవలంబింపక తగిన అవకాశాలు ఉన్నప్పటికిని ప్రభుత్వ ఉద్యోగం స్వీకరింపక జీవిత మంతయు తెలుగు భాషాభి వృద్ధికి అర్పించిన త్యాగమూర్తులు; బహుభాషావేత్తలు; అనేక గ్రంధకర్తలు; ఉత్తమ శ్రేణికి చెందిన పరిశోధకులు, నిర్భయంగా పత్రికను నడిపిన సంపాదకులు. ఆయన గోలకొండ పత్రికద్వారా తెలంగాణా ప్రజలను అన్ని రంగాలలో మేలు కొలిపినారు. గోలకొండలో వీరు వ్రాసిన సంపాదకీయాలు అనేక విషయాలకు సంబంధించిన విజ్ఞాన నిక్షేపాలు. రామాయణ రహస్యాలు, హిందువుల పండుగలు, ఆంధ్రుల సాంఘిక చరిత్ర మొదలైన గొప్ప పరిశోధనాత్మకమైన గ్రంధాలను వారు వ్రాసినారు. వారు కవులు, కథకులు, విమర్శకులు, వ్యాసకర్తలు, బహుముఖ ప్రతిభాసంపన్నులు. వారు వ్రాసిన కొన్ని చిన్న కథలు నిరీక్షణము వంటివి కథానికా వాఙ్మయములో ప్రథమ శ్రేణికి చెందినవి.

తెలంగాణాను ఆధునిక యుగానికి అనుగుణంగా చైతన్యవంతము చేసిన మరికొన్ని సంస్థలను కూడా యీ సందర్భములో పేర్కొనవలసి యున్నది. అందులో ప్రత్యేకంగా రెండు పత్రికలను గురించి మొట్టమొదట ప్రస్తావించవలసి యున్నది. తెలంగాణాలోని మొదటి పత్రిక "హితబోధిని" 1913 వ సంవత్సరమున స్థాపితమై ఒక సంవత్సరం మాత్రమే నడిచినది. తరువాత 1920వ సంవత్సరమున రెండు పత్రికలు యించుమించుగా ఒకే పర్యాయం ప్రారంభమైనవి. ఒకటి తెనుగు పత్రిక వరంగల్లు జిల్లా ఇనుగుర్తి నుండి వెలువడి ఐదేండ్లు నడిచినది. రెండవది నల్లగొండ నుండి షబ్నవీసు నరసింహారావుగారి సంపాదకత్వమున వెలువడిన "నీలగిరి". ఇది కూడా ఐదేండ్లు నడిచినది. తెనుగు పత్రిక సంపాదకులైన ఒద్దిరాజు సీతారామచంద్రరావు, రాఘవ రంగారావు సోదరులు; సంపన్న కుటుంబీకులు. ఫారసీ ఉర్దూ, ఇంగ్లీషు, తెలుగు సంస్కృత భాషలలో ప్రావీణ్యము గలిగిన

పండితులు, రచయితలు. షబ్నవీసు నరసింహారావుగారు ఉర్దూ, తెలుగు భాషలలో ప్రవీణులు. ఈ రెండు పత్రికలు వాఙ్మయ ప్రచారానికి, రచయితలకు, జాతీయోద్యమానికి చేయూతనిచ్చి చేసిన కృషి చరిత్రాత్మకమైనది. వీని తరువాత 1925 వ సంవత్సరంలో గోలకొండ పత్రిక అర్ధ వార పత్రికగా ప్రారంభమైనది. తరువాత యీ పత్రిక 1947 లో దినపత్రికయై సుమారు ఇరువై సంవత్సరాలు నడిచినది. తెలంగాణాను ప్రబుద్ధము చేయుటలో గోలకొండ పత్రిక చేసిన కృషి చరిత్రాత్మకమైనది. సురవరం ప్రతాపరెడ్డిగారు యీ పత్రికకు సంపాదకులుగా లభించడం వలన దేశాభ్యుదయానికి, భాషాభివృద్ధికి అపారమైన మేలు కలిగినది. ఈ విధంగా తెలంగాణా రచనా రంగంలో నూతన యుగము ప్రారంభమైనది అప్పుడు యువరచయితలలో హైదరాబాదు నుండి ఒక సాహిత్య మాసపత్రిక వెలువడవలెనని ఒక గాఢమైన అభిప్రాయము కలిగినది. ఈ అభిప్రాయానికి మాడపాటి హనుమంతరావుగారి యొక్కయు, సురవరం ప్రతాపరెడ్డి గారి యొక్కయు తోడ్పాటు లభించినది. తత్ఫలితంగా "సుజాత" అనే మాసపత్రిక శ్రీ పి ఎన్. శర్మ గారి సంపాదకత్వమున వెలువడి కొన్ని సంవత్సరాలు నడిచినది. ఈ పత్రికలో విమర్శనాత్మకమైన వ్యాసాలు కథలు, కవితలు విజ్ఞానాత్మకమైన వచనరచనలు అనేకము వెలువడినవి బూర్గుల రామకృష్ణారావు గారు ఉర్దూ భాషసారస్వతాలను గూర్చి. ఉమర్ ఖయాంను గూర్చి, వ్రాసిన వ్యాసాలు యిందులో ప్రకటితమైనవి. రామకృష్ణారావుగారు స్వయంగా బహు భాషా ప్రవీణులు, కవులు, విమర్శకులు. ఆయన ఆ రోజులలో "ఎంకి" పాటల వంటి నవీన కావ్యాలను హర్షించి ప్రశంసాత్మకమైన వ్యాసాలను వ్రాసినారు. ఈ పత్రికలతో పాటు "ఆంధ్రాభ్యుదయం" హనుమకొండ నుండి, హైదరాబాదు జిల్లా తూపురాను నుండి "దేశబంధు", సికిందరాబాదు నుండి "తెలుగు తల్లి, "విభూతి", "దివ్యవాణి" అనే తెలుగు పత్రికలు వెలువడినవి. తరువాత 1945 లో అడవి బాపిరాజు గారి సంపాదకత్వముతో "మీజాన్" బి. ఆర్. చారిగారి సంపాదకత్వంలో "తెలంగాణా" అనే రెండు దినపత్రికలు వెలువడినవి. "ఆంధ్ర కేసరి'' ''ఆంధ్రవాణి'' అనే వార పత్రికలు సికిందరాబాదు నుండి "తరణి", వరంగల్లు నుండి ''శోభ" వంటి సాహిత్య పత్రికలు వెలువడి కొంత కాలం నడిచినవి. ఈ విధంగా తెలంగాణాలో నూతన యుగోదయమై అనేక మంది రచయితలు ఆవిర్భవించినారు. వీరి రచనలు పైన పేర్కొన్న పత్రికలలోను యింకా యీ ప్రసంగంలో ప్రస్తావించని అనేక పత్రికలలోను చూడవచ్చును. ఈ

పత్రికలన్నీ జాతీయోద్యమ ప్రభావితాలై నవీన వాఙ్మయ నిర్మాణానికి దోహదము గావించినవి.

ఈ నవ యుగోదయానికి పూర్వం కూడా తెలంగాణాలో ఉత్తమ శ్రేణికి చెందిన కవిపండితులుండిరని ఇంతకు ముందే చెప్పినాను. వీరిలో కొందరిని పేర్కొనవలసి యుండును. శ్రీ వెల్లాల సదాశివ శాస్త్రులవారు కొల్హాపుర వాస్తవ్యులు; బహు గ్రంథకర్తలు; మహా పండితులు. సంస్కృతంలోచంపువులు, శాస్త్ర చర్చలు గావించిన గొప్ప వైయాకరణి. చంద్రికా పరిణయ వ్యాఖ్యాత, ఆంధ్రుల చరిత్ర విమర్శనము మొదలైన బహు గ్రంథ కర్తలు. శ్రీ బుక్కపట్టణం శ్రీనివాసాచార్యుల వారు బాల కవులు. మైసూరు సంస్థానములో బాల సరస్వతి బిరుదాన్ని పొందినవారు. నవ ద్వీపములో తర్క తీర్థ బిరుదమును పొందిరి. ఉత్తర భారతంలోని దర్భాంగ, జోధ్‌పూర్, గవాలియార్, ఇందూర్, ధారానగర్, జమ్మూ మొదలైన సంస్థానాలలో దిగ్విజయం గావించిరి. ఎనిమిది భాషలలో శతఘంటకవనము చేసిరి. మదరాసు, కడప, బనగనపల్లి, పెనుగొండ, తాడిపత్రి, సురపురాలలో అవధానాలు గావించినారు. వీరి కుమారులైన వెంకటాచార్యుల వారు గొప్ప మేధావి. వీరి ఆశు కవితను హిందు, మదరాస్ మేల్ వంటి ఆంగ్ల పత్రికలు ప్రశంసించినవి మైసూర్‌లోని వైష్ణవ పీఠానికి అధిపతులుగా వెళ్ళిన పరకాల స్వాములవారు గద్వాల వాస్తవ్యులు శతాధిక గ్రంథ కర్తలు. రాయమూరు వాస్తవ్యులైన మల్లిఖార్జున శాస్త్రుల వారు శతావధానులు. గణిత శాస్త్రంలో ఎన్నికోట్ల సంఖ్యలైనను నోటితో లెక్కించి చెప్పగల సమర్థులు. వట్టెం వాస్తవ్యులైన పాపకవి తెలుగులో గొప్ప కవులు. ఆనాటి కవి పండితులలో పేర్కొనదగినవారు ఇంకను ఎందరో ఉన్నారు. వనపర్తి వాస్తవ్యులైన విక్రాల సోదరులు, గద్వాల వాస్తవ్యులైన కర్ణమడకల ఆనందాచార్యులవారు, పత్రి విశ్వేశ్వర శాస్త్రిగారు, గర్గభాగవతాది గ్రంథకర్తలు చివుకుల అప్పయ్య శాస్త్రి గారు, గాడేపల్లి వీరరాఘవశాస్త్రిగారు, నల్లగొండ జిల్లాకు చెందిన చిదిర మఠము వీరభద్రశర్మగారు మొదలైనవారు ప్రాచీన సంప్రదాయానికి చెందివారు. ఐతము రాజు కొండలరావుగారు బహు భాషా విశారదులు. ఉర్దూ, ఫారసీ, అరబ్బీ, సంస్కృతం, కన్నడం, ఇంగ్లీషు మొదలైన భాషలలో గొప్ప ప్రావీణ్యం కలిగి ఉర్దూ-తెలుగు, తెలుగు-ఉర్దూ నిఘంటువులు కూర్చిన విద్వాంసులు. ఇదే శ్రేణికి చెంది యీనాటికిని మన మధ్యన వున్న గుండేరావు హర్కారేగారు, వట్టెం నరసింహశాస్త్రిగారు, కోయిల్ కందాళై రామానుజాచార్యులుగారు, కప్పగంతుల

లక్ష్మణ శాస్త్రిగారు, కేశవపంతుల నరసింహశాస్త్రిగారు-విద్వత్కవులు, నిష్ణాతులైన పండితులు. వీరితో సమకాలికులై కొన్ని సంవత్సరాల క్రింద స్వర్గస్థులైన గంగుల శాయిరెడ్డి గారు, అంబటి లక్ష్మీనరసింహ రాజుగారు మొదలైనవారు పాత కాలానికి చెందిన కవులు. ఈ విధంగా తెలంగాణాలో కవి పండితుల సంఖ్య కెన్నడు కొదువ కలుగలేదు. ఒకమారు ఎవరో తెలంగాణాలో కవులు, పండితులు లేరని ఎక్కడనో అన్నప్పుడు స్వర్గీయ సురవరం ప్రతాపరెడ్డిగారు గోలకొండ కవుల సంచికను ప్రకటించి అందులో 354 మంది సమకాలికులైన కవులను పరిచయం చేసి రెండు నూర్లమంది పూర్వ కవులను ప్రస్తుతించిరి. తెలంగాణలోని పండిత కవులు ఆ రోజులలో చేసిన అవధానాలు, చెప్పిన ఆశు కవితలు పాండిత్యానికి, ప్రతిభకు ఆలవాలాలు. ఈ అవధానాలు ఆశుకవితలలోని పద్యాలను సేకరించి ప్రకటించితే ఒక రసవంతమైన కవితా సంపుటి కాగలదు. ఈ మధ్య ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమికి ఒక విద్వాంసులు యీ సూచన చేయగా ఆ పనిని మరొక విద్వాంసునికి అప్పగించనైనది. ఈ సందర్భములో అవధానిగా, ఆశు కవితా శిరోమణిగా, ప్రఖ్యాతిగాంచిన గాడేపల్లి వీరరాఘవశాస్త్రిగారిని గూర్చి ప్రస్తావించవలసి ఉన్నది. ఆయన గద్వాలలో ఆస్థాన కవీశ్వరులుగా ఉండిరి. అద్వితీయమైన ధార, గొప్ప ప్రతిభ ఆయన సహజ స్వత్వములు. ఆయన చేసిన సమస్యా పూరణలు, అవధానాలు, ఆశుకవితలు శ్రీనాథ తెనాలి రామకృష్ణాది పూర్వకవీశ్వరుల ప్రతిభావ్యుత్పన్నతలను తలపింప జేసెడివని చెప్పుదురు. ఒక సభలో 'పాండిత్య హీనాః కవయః' అని ఒకిరెత్తి పొడిచినప్పుడు వీరు.

"వ్యాసుండన్న పురాణ కర్త అతడా పాండిత్యహీనుండి, కా
ళాసుండన్న మహాకవీంద్రుడతడా పాండిత్యహీనుండు, వా
గ్వ్యాసంగుండగు భట్టబాణుడతడా పాండిత్యహీనుండు?

అని యాభై రెండు పాదములు శార్దూల వృత్తములో ఆశువుగా చెప్పి "...కుస్తీ కీవు డీకొందువా?"

నీ సంసారము గుట్టులోదలచి వందేయంచు వాకొందువా?'' అని ప్రశ్నించిరట. వీరు రసవంతంగా అనేక సమస్యలను పూరించిరి. వానిలో ''దారములేని హారము నుదారత నీకెవరిచ్చిరమ్మరో'' అను సమస్య ఒక ఉదాహరణ.

"సారసగాత్రి యొక్కతె నిశాసమయంబున మంచిముత్తెముల్
గూరిచి తాధరించి, తనుగూడెడు నాధు కవుంగిలింపజే
కూరెను గుర్తులవ్విగని కోమలి కిట్లనిరెల్ల నెచ్చెలుల్
దారము లేని హారము నుదారత నీకెవరిచ్చిరమ్మరో"

దీనినే పూర్వ కవులు కొందరు పచ్చలా దారములేని హారమనీ, మందారము లేని హారమనీ పూర్తి చేసిరని చెప్పితే యీ పూరణలోని స్వారస్యము స్పష్టము కాగలదు. ఇంకా యీ కాలంలోని పండిత కవులను చాలమందిని పేర్కొనవచ్చును. బహుభాషా ప్రావీణ్యము వీరి ప్రత్యేకత. అరబ్బీ, ఫారసీ, ఉర్దూలతోపాటు సంస్కృతాంధ్రాలలో నాటి పండితులు నిష్ణాతులు. వీరందరిని గూర్చి విపులముగా చెప్పడానికి ఒక ప్రత్యేక గ్రంథమే కావలసి వుంటుంది.

తెనుగు, నీలగిరి, గోలకొండ, సుజాత మొదలైన పత్రికల ఆవిర్భావముతో యువరచయితలకు ప్రోత్సాహం లభించి పరంపరాగతమైన సంప్రదాయం నుండి విభిన్నమైన సాహిత్యం, పుంఖాను పుంఖముగా ప్రకటితమైనది. కొంత కాలంనుండి దూర దూరాలుగా నుండిన యీ రెండు ప్రాంతాలు సాహిత్యపరంగా సన్నిహితమై ఉభయ ప్రాంతాల రచయితల మధ్య పరస్పర పరిచయం అభిమానం, పెంపొందినవి. విడిపోయిన రెండు పాయలు దగ్గరికి రాదగిన వాతావరణం యేర్పడినది.

కాకతి గణపతి దేవుని యేలుబడిలో ఏక ఖండంగా రూపొందిన తెలుగు సీమ బహమనీ సుల్తానుల ఆధిపత్యంలో మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలతో కలసి పోయి గోలకొండ రాజుల పాలనలో తిరిగి ఏక భాషా ప్రాంతంగా అవతరించి అసిఫ్‌జాహీ ప్రభుత్వం క్రింద ఆంగ్లరాజ్య విస్తరణ ఫలితాలైన రాజకీయ కారణాలవలన చీలిపోయి మళ్ళీ మహరాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలతో తెలంగాణము; తమిళ, కన్నడ, మళయాళ ప్రాంతాలతో ఆంధ్ర ప్రాంతంగాను రెండు పాయ లైనది. ఆంధ్ర ప్రాంతంతో విడిపోయిన 150 సంవత్సరాల కాలంలో తెలంగాణా పాయలో యే విధంగా ఆంధ్రసాహిత్య సంస్కృతులు–నాటి ప్రభుత్వము నుండి ప్రబల వ్యతిరేకతకు గురియైనప్పటికిని–చెదరిపోక నిలిచిన ఉదంతాన్ని కొంత ప్రస్తావించినాను. తెలంగాణా ప్రాంతాన్ని గ్రంథాలయోద్యమము, పత్రికలు, లక్ష్మణరావు ప్రభృతులైన విద్వాంసులు, నాయకులు యే విధంగా పునరుజ్జీవితం కావించినారో కూడా ప్రస్తావించినాను. ఈ పునరుజ్జీవన కృషికి తోడ్పడి నటు

వంటి మరికొన్ని ఉద్యమాలను కూడ యీ సందర్భంలో ప్రస్తావించవలసి యున్నది. ఆసిఫ్‌జాహీ పరిపాలనలో తెలుగువాడు తౌరక్యాంధ్రుడైనాడు. ప్రాథమిక విద్య కూడ తెలుగులో చదువుకునే భాగ్యం లభించలేదు. తెలుగు సరస్వతి అరబ్బీ, ఫారసీ, ఉర్దూ బిబ్బీల వెనక నెట్టివేయబడి తబ్బిబ్బు చెందినది. జిల్లాలలోను, పల్లెటూళ్లలోను తెలుగు సజీవంగా ఉన్నప్పటికిని ఆంధ్రనగరమైన హైదరాబాదులో తెలుగు అజ్ఞాత వాసము చేయవలసి వచ్చినది. 1921 వ సంవత్సరమున మహారాష్ట్ర విద్వాంసుడైన కర్వే పండితుని అధ్యక్షతన హైదరాబాదులో ఒక సంఘ సంస్కరణ సభ జరిగినది. ఆ సభలో మహారాష్ట్రులు, కర్ణాటకులు, తెలుగువారు సమావేశమైన వేదికమీద ఆలంపల్లి వెంకట్రామారావుగారు తెలుగులో ఉపన్యాసము మొదలు పెట్టగా సభ్యులు చప్పట్లతో హేళన గావించిరి. ఈ హేళన హైదరాబాదు ఆంధ్రులకు ఆవేదన కలిగించినది. వెంటనే అదే రోజు టేకుమాల రంగారావుగారి ఇంట్లో అప్పటి ఆంధ్ర ప్రముఖులు సమావేశమై "ఆంధ్ర జన సంఘము" అను ఒక సంస్థను స్థాపించిరి. ఆ సంస్థకు అధ్యక్షులు బారిష్టరు రాజగోపాలరెడ్డిగారు, కార్యదర్శి మాడపాటి హనుమంతరావుగారు.

నిజాం రాష్ట్రమందలి ఆంధ్రులయందు పరస్పర సానుభూతిని కలిగించి వారికొరకు సంఘాలను, సంస్థలను స్థాపించి ఉపన్యాస సభలను యేర్పాటుచేసి చైతన్యాన్ని కలిగించవలెనని యీ సంఘము ఆశయము. ఇందుకొరకు వారు నిర్ణయించిన కార్యక్రమం గ్రంధాలయాల స్థాపన,-నిర్వహణ, విద్యార్థులకు సహాయము - ప్రోత్సాహము, విద్వాంసులకు సన్మానము, తాళపత్ర గ్రంధాల శాసనాల సేకరణ - పరిశోధన, కరపత్రాల, లఘుపుస్తకాల ప్రకటన, విజ్ఞాన ప్రచారం ఆంధ్ర భాషా ప్రచారానికి కావలసిన ప్రయత్నాలు. ఈ ఆంధ్ర జన సంఘం క్రమక్రమంగా ఆంధ్రోద్యమంగా వ్యాపించి తెలంగాణాలో సాహిత్య ప్రచారానికి విశేషమైన కృషి గావించి యువకులను తెలుగు సాహిత్యాభిముఖులను చేసినది. తరువాత ఆంధ్రోద్యమము క్రమక్రమంగా రాజకీయోద్యమంగా పరిణమించి 1946 లో స్టేట్ కాంగ్రెస్‌లో లీనమైనది. అందుచేత సాహిత్య కార్యక్రమాలకు మరొక సంస్థ అవసరమైనది. కావున 1943 లో ఆంధ్ర సారస్వత పరిషత్తు స్థాపితమై ఇంచుమించుగా ఆంధ్ర జనసంఘ ఆశయాలతోనే తెలుగు భాషా వ్యాప్తికి అపారమైన కృషి గావించి అనేక రచయితలను ప్రోత్సహించి యీనాడొక మహా సంస్థగా విలసిల్లుతున్నది. ఆంధ్ర జనసంఘము, ఆంధ్ర

సారస్వత పరిషత్తు కృషి మూలంగా ఎందరో రచయితలు బయలుదేరి వివిధ వాఙ్మయ వీధులలో విహరించినారు. ఆంధ్ర ప్రాంతంలోని ఆంధ్రోద్యమానికి, తెలంగాణా ప్రాంతంలోని ఆంధ్రోద్యమానికి వ్యత్యాసమున్నదని యీ సందర్భములో చెప్పవలసి యున్నది. ఆంధ్ర ప్రాంతంలో అది ఒక ప్రత్యేక రాష్ట్ర సాధనకు కృషి చేసినది. తెలంగాణాలో అది మొదట సాహిత్య ప్రచార ఉద్యమంగా ప్రారంభమై తరువాత బాధ్యతాయుత పరిపాలన కొరకు పోరాటము నిర్వహించిన రాజకీయ ఉద్యమంగా పరిణమించినది.

గ్రంథాలయోద్యమమువలెనే ఆంధ్రోద్యమము కూడా తెలుగు భాషా సంస్కృతుల వ్యాప్తికి దోహదము గావించినది. ఈ ఆంధ్రోద్యమముతో పాటు, పత్రికలతో పాటు, గ్రంథాలయాలతో పాటు కొన్ని గ్రంథమాల లవతరించి పుస్తకాలు ప్రకటించి రచయితలను ప్రోత్సహించినవి. ఈ గ్రంథమాలలో పేర్కొనదగినవి. గోలకొండ, కిన్నెర, దివ్యవాణి, మాతృభారతి, ఆంధ్రశ్రీ, కాకతీయ, పూలతోట, వీరేశలింగ కవి కంఠాభరణ, కృషి ప్రచారిణి, శివధర్మ గ్రంథ మాల, విజ్ఞాన ప్రచారిణి, వెంకటేశ్వర, అణా, దేశోద్ధారక, ఆంధ్రకేసరి, సాహితీ మేఖల, సాధన సమితి మొదలైనవి. ఈ విధంగా తెలంగాణాలో 1900 నుండి 1950 వరకు సారస్వతోద్యమం ఒక మహోద్యమంగా అవతరించి పురోగమించి నది. సంప్రదాయాన్ని అనుసరించే కవిపండితులతో పాటు ఆధునిక వాఙ్మయ ప్రక్రియలలో సాధన చేసిన రచయితలు కూడ అనేకులు తెలుగు తల్లికి పూలదండలు వేసి ఆరాధించిరి. వీరి రచనలమీద ఆంధ్రోద్యమ ప్రభావము, జాతీయోద్యమ ప్రభావము, హైదరాబాదు ప్రజల విమోచనోద్యమ ప్రభావము స్పష్టంగా కని పిస్తున్నవి. గ్రంథాలయ సభలు, సారస్వత సమావేశాలు ఆనాడు వీరి ప్రతిభకు దోహదం గావించినవి.

ఫారసీ, ఉర్దూ భాషలతో తెలుగు భాషకు కొన్ని నూర్ల సంవత్సరాల సంబంధ ఫలితంగా ప్రాచీనకవుల కావ్యాలలో ఫారసీ, ఉర్దూ శబ్దాలు మనకు కనిపిస్తున్నవి. బహమనీ, గోలకొండ, ఆసిఫ్‌జాహీ పరిపాలన ఫలితంగా వ్యవ హారంలోనూ, సాహిత్యములోనూ, ఫారసీ, ఉర్దూ పదాలు పుష్కలంగా దొరలినవి. పరిపాలనా పరిభాషలో యీ శబ్దాలు ఇంకా ఎక్కువ సంఖ్యలో తెలుగు దేశ మందలి అన్ని జిల్లాలలో కనిపిస్తున్నవి. తెలంగాణాలో ఫారసీ, ఉర్దూ ప్రచారం ప్రభుత్వ ప్రోత్సాహంతో బాగా జరిగినది. చదువుకున్న తెలుగువారందరు ఫారసీ,

ఉర్దూలలో ప్రవీణులై ఉండిరి. ఈ భాషలలో చక్కగా వ్రాయగలిగిన తగినంత మంది తెలుగు వారు ఆ రోజులలో ఉండిరి. అయితే యీ భాషల ప్రభావం తెలుగు మీద ఎంతవరకు పడినది అన్న ప్రశ్న సహజంగా ఉత్పన్నమవుతున్నది. పరిశీలించి చూస్తే ఫారసీ, ఉర్దూ సాహిత్యాలు తెలుగును ఎక్కువగా ప్రభావితము చేసినట్లు కనిపించదు. ఈ ప్రభావము యేమైనా ఉంటె అది శబ్దజాలం మట్టుకే పరిమితమైనది. ఈ ఫారసీ, ఉర్దూ సాహిత్యాలను చదివిన ప్రేరణతో, ఉత్సాహముతో తెలుగులో వచ్చిన సాహిత్యం చెప్పదగిన దేమియు లేదు. ఇదేవిధంగా తెలుగు సాహిత్యం కూడా ఆ భాషలలోనికి వెళ్ళలేదు. తెలుగు మీద సంస్కృత ప్రభావం అందరికీ తెలిసినదే. ఇంగ్లీషు భాషా ప్రభావంతో తెలుగులో కావలసినంత వాఙ్మయము వచ్చినదికాని ఉర్దూ, ఫారసీల ప్రభావము తెలుగు సారస్వతం మీద యీ విధంగా కనిపించడంలేదు. కనీసం ఆధునిక యుగంలో బెంగాలీ భాష తెలుగు సారస్వతాన్ని ప్రభావితం చేసినంతగానైనను ఉర్దూ, ఫారసీ సాహిత్యాలు చేయలేదు. బంకిం చంద్రుడు, రవీంద్రుడు, శరత్‌చంద్రుడు తెలుగు వారికి సుపరిచితులు. వారి పుస్తకాలన్నీ యించుమించుగా తెలుగులోనికి వచ్చినవి. ఉర్దూ, ఫారసీ భాషలనుండి ఇటువంటి దిగుమతి జరుగలేదు. తెలుగు సాహిత్యం మీద ఆంగ్ల సాహిత్య ప్రభావంతో పోలిస్తే ఉర్దూ, సాహిత్య ప్రభావం చాలా తక్కువ. అయితే ఆంగ్లభాష ఒక మహా సముద్రం వంటిది. సకల ప్రపంచ సమస్త విజ్ఞాన సాహిత్య భాండాగారాలలోనికి ప్రవేశం కలుగజేసే మహత్తరమైన సాధనము ఆంగ్లభాష. చదువరులను ఉత్తేజితము చేయు శక్తి ఆంగ్ల భాషకున్నది. అయితే ఉర్దూ భాష ఇంతశక్తివంతమైనది. కానందువలన కాబోలు దాని ప్రభావం తెలుగు సాహిత్యం మీద ఎక్కువగా కనిపించదు. ఉర్దూ, ఆంగ్ల భాషవలె విశాలమైనది కాదు. అందులోని సాహిత్యం పరిమితమైనది. ప్రేమ్‌చంద్ తెలుగులోనికి వచ్చినప్పటికిని ఆయనకు హిందీ, ఉర్దూ భాషల రెండింటి యందును సమాన గౌరవ స్థానము ఉన్నది. గాలిబ్, సాదీ, ఎక్బాల్, ఫిర్‌దౌసీ, ఉమర్‌ఖయాం మొదలైన కవులను గూర్చి సుజాత వంటి సాహిత్య పత్రికలలో ఉత్తమ వ్యాసాలుకొన్ని ప్రకటితమైనవి. వారి వాఙ్మయం కొంత పరివర్తితమైనది. ఆధునికులైన తెలుగు కవులు కొందరు ఉర్దూ గజేల్ పద్ధతిని తెలుగులో గేయాలు వ్రాసినారు. ఇంతకన్న హెచ్చుగా ఫారసీ, ఉర్దూల ప్రభావము తెలంగాణాలోని తెలుగుపైన కనిపించదని చెప్పితే వాస్తవానికి వ్యతిరేకమైన మాటకాదు.

తెలంగాణాలో 1900–1950 మధ్యన అనగా అర్థశతాబ్దములో వచ్చిన వాఙ్మయాన్ని గూర్చి యీ సందర్భమున నాలుగు మాటలు చెప్పవలసియున్నది. ఈ వాఙ్మయముపై లక్ష్మణరావుగారి ఆశయాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నదని మొదలే చెప్పినాను. కావున చరిత్ర పరిశోధనకు సంబంధించిన వాఙ్మయము, విజ్ఞాన ప్రచారానికి సంబంధించిన వాఙ్మయము యీ అర్థశతాబ్దములో తెలంగాణములో కనిపిస్తున్నవి. పాత పద్ధతిని రచించిన కావ్యాలు కూడ యీ కాలంలో తగినన్ని వచ్చినవి. ప్రాచీన సంప్రదాయాన్ని అనుసరించే కవులు, పండితులతోపాటు ఆధునిక ప్రక్రియలైన కథానిక, నవల వంటి వ్యాసంగాలలో కృషిచేసిన రచయితలు కనిపిస్తున్నారు. చలం రచనల ప్రభావం కొందరి మీద కనిపిస్తున్నది. మునిమాణిక్యంవలె రచనలు చేసిన వారు కూడా ఉన్నారు. శ్రీశ్రీచే ప్రేరితమై రచనలు చేసిన వారున్నారు. ఇంకా రకరకాలైన ప్రక్రియలలో సాధన చేసిన వారున్నారు. ఎవరి ప్రభావానికి లోను కాకుండా స్వతంత్రమైన కవితలు, కథలు, వ్యాసాలు వ్రాసినవారు తగినంత మంది కనిపిస్తున్నారు. ఇక్కడి రాజకీయోద్యమాలచే ప్రభావితులై ఉత్కృష్టమైన కవితలు వ్రాసి ప్రజల ఉత్తేజితులను చేసిన కవులు మనకు కనిపిస్తున్నారు.

కానీ ఒక విషయం స్పష్టంగా కనిపిస్తున్నది. తెలంగాణాలో భావ కవిత ఛాయలు ఎక్కువగా పడలేదు. ఆంగ్ల సాహిత్య ప్రభావం చేత ఉత్తేజితులై అనేక రచనలు గావించిన భావ కవులు ఆంధ్ర ప్రాంతంలో అసంఖ్యాకులుగా ఉన్నారు. కాని భావ కవితా మార్గంలో ప్రయాణం చేసిన వారు తెలంగాణములో చాలా తక్కువ మంది. వీరు చేసిన రచనలు కూడా ప్రకటితమైనంత మట్టుకు స్వల్పమనే చెప్పవలెను.

ఆ అర్థ శతాబ్దములో యావదాంధ్ర ప్రఖ్యాతిగాంచిన కవులు తెలంగాణములో ఉన్నారు. శ్రీ వానమామలై వరదాచార్యులు పోతన మహా కావ్యము వంటి ఉత్తమ కావ్యాలు వ్రాసి నేటి తెలుగు కవులలో మేటిగా కీర్తిగాంచినారు. శ్రీకాళోజీ నారాయణ రావు అన్ని జాతీయోద్యమాలలో పాల్గొనిన స్వాతంత్ర్యయోధుడు, ప్రజాకవి, జనులకు అర్థమయ్యే సరళ శైలిలో మహో త్తేజకరమైనటు వంటి రచనలు చేసి ఆయన ప్రజలను స్వాతంత్ర్య పోరాటమువైపు అభిముఖులను చేసినాడు. నా గొడవ అనే సంపుటాలలో ఆయన రచనలు ప్రకటితమైనవి.

నల్లగొండలో నాజీశక్తుల
నగ్న నృత్య మింకెన్నాళ్లు ?
పోలీసుటండను
దౌర్జన్య శక్తులు పోషణ బొందే దెన్నాళ్లు ?

అని ఆనాడు ఆయన వాణి గర్జించినది. కాళోజి రచనలలో అడుగడుగునా ఒక విశిష్టత ఉన్నది. అప్పటి నిజాం ప్రవేశ పెట్టిన రాజ్యాంగ సంస్కరణల గూర్చి ఆయన వ్రాసిన గేయము మన జాతీయ ఉద్యమ వాఙ్మయములో శాశ్వతంగా నిలువదగినది. రెండవ ప్రపంచ యుద్ధము ఫలితంగా వచ్చిన ద్రవ్యోల్బణాన్ని గూర్చి వ్రాస్తూ "యుద్ధము మూలమున చలామణులకు ఉబ్బు రోగము వచ్చిందీ" అన్నాడు. సంఘంలోని వ్యత్యాసాలను గూర్చి వ్రాసిన గేయంలో "గట్టి దవడలౌక వైపు కమ్మని చకిలాలొకవైపు'' అన్న పాదాలు ఆయన విశిష్టతకు ఒక మచ్చు తునక, కాళోజి నూటికి నూరు పాళ్లు ప్రజాకవి. నేటి ఆంధ్ర ఆస్థాన కవీశ్వరులు డాక్టర్ దాశరథి, కాళోజీవలెనే స్వాతంత్ర్య యోధుడైన మహాకవి. నూనూగు మీసాల నూత్న యౌవనమున దాశరథి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని

'' తెలంగాణము రైతుదే
ముసలి నక్కకు రాచరికంబుదక్కునే ?''

అని గొంతెత్తి పలుకగా తెలంగాణమంతా ప్రతిధ్వనించినది.

'' పీడిత ప్రజావాణికి మైక్ అమర్చెదన్"

అన్నాడు ఒక సందర్భంలో దాశరథి.

'' మూడు కోటుల నొక్కటే ముడిబిగించెద"

నన్నాడు మరొక్క సందర్భంలో.

'' అనాదిగా సాగుతుంది అనంత సంగ్రామము
అగర్భ శ్రీనాధుడికి అనాధుడికి మధ్య''

అని ఆయన వేరొకసారి విజృంభించినాడు. నేటి తెలుగు కవులలో దాశరథిది అగ్రస్థానము. ఆయన కవితా దీపము మరెన్నో దీపాలను వెలిగించినది. శ్రీ కాళోజీ నారాయణరావు, శ్రీ దాశరధి కృష్ణమాచార్యులతోపాటు తెలంగాణ

ప్రజల ఉద్యమాలకు ప్రాతినిధ్యం వహించి ప్రజలను ప్రబోధించిన కవివరేణ్యులు అనేకులున్నారు. కళ కళ కొరకే అని ఆలోచించే పద్ధతి కవులు కారు వారు. సమ సమాజాన్ని కాంక్షించి తమ కవిత్వాన్ని ఆ ఆశయం కొరకు ఉపయోగించినారు యీ కవులు. లోకంతో మనకేమి లోలాక్షి౹ాపోదము అని వీరు అనుకోలేదు. దేశ పరిస్థితులను గుర్తించి సమస్యలను ఆకళింపు చేసుగొని, జాతీయ వికాసానికి ప్రజల అభ్యుదయానికి అనుగుణమైన రచనలు వీరు కావించినారు. కులమత విద్వేషాలకు అతీతంగా సమాజం పురోగమించవలెనని యీ కవుల ఆకాంక్ష.

ఏమి వ్రాయాలే నేనేమి వ్రాయాలే
ఏమి వ్రాయాలే నేనేమి వ్రాయాలే
నా యింటి నానుకొని పెను మంటలేరేగ
నాతమ్మ్రులేవిలయ నాట్యాలు సేయగా
నా కూనలీనాడు బాకులకు గురికాగ
నా అక్క చెల్లెంద్ర మానాలు దోపిడైనాక
నాతల్లి గుండియల్ కోతల్లు వడ్డాక
ఏమి వ్రాయాలే ....
నానేల కరువులకు తావలంబైనాక
నాకు ఆకలి డొక్క బూడు కున్నాక
నాసభ్య సంస్కృతుల్ నరుకుళ్ళు పడ్డాక
నానాయకుల రక్తనాళాలు దెగినాక
నా రాజ్య సౌధాల దారిద్ర వీధులే
బారు దీర్చుచునుండి కూలి పోతున్నాక
వారు కోరిన దెల్ల బూదియై పోయినాక
నేనే నాశనమొంద బూనుకున్నపుడు

అని ధవళా శ్రీనివాసరావు రజాకారు రాజ్యంలోని ఘోర దౌర్జన్యాలను ప్రతి ఘటించినారు. పోలీసు చర్య కాగానే నాయకులు పరస్పరము తగవులాడుకొని అధికారానికి పెనుగు లాడుతుండగా

ఉన్నావో లేవయ్యా ఓ జగన్నాథ
విన్నావ మాగోడు వీనులారంగ
తలదాచు కొనలేక తనువుపై లేక
తొలిపూటకే లేక తోడేమి లేక
తెలగాణ ప్రజల బన్నాలు విన్నావా
మమ్మేల వలసిన మా ప్రజాపతులు
దొమ్మిలో దిగినారు దుర్విధి వలన
గారాబు టొక బిడ్డ గణికయైనట్లు
మా రాజకీయాలు మలినంబులయ్యె

అని గడియారం రామకృష్ణ శర్మ గొంతెత్తి పలికినాడు.

తెలుగు తోటలలోన తెలుగు వన్నెలు లేవు
శోభ నిచ్చే దెన్నడో
తోటంత
సొగసు గులికే దెన్నడో
తేజమొచ్చే దెన్నడో
తోటంత తీగ బారే దెన్నడో

అని సిరి ప్రగడ భార్గవరావు తెలుగు తల్లి ఆనాటి దీనావస్థను జూచి ఆవేదన చెందినాడు. ఆనాటి తెలంగాణ కవుల రచనలకు ఇవి కొన్ని మచ్చు తునకలు మాత్రమే తెలంగాణా కవులలో శ్రీమతి సోమరాజు ఇందుమతీదేవి, పులిజాల హనుమంతరావు, ధవళా శ్రీనివాసరావు, సిరిప్రగడ భార్గవరావు, నెల్లుట్ల రామకృష్ణకవి, బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి, పొట్లపల్లి రామారావు (వీరు చక్కని కథలు వ్రాసినారు), కంచనపల్లి చిన వెంకట రామారావు, వెల్దుర్తి మాణిక్యారావు, అడ్లూరి అయోధ్యరామకవి, గార్లపాటి రాఘవరెడ్డి, గవ్వా మురహరి రెడ్డి, ఊటుకూరి రంగారావు మొదలైన వారు ఉత్తమ శ్రేణికి చెందిన కవిత్వము వ్రాసినారు. నందగిరి ఇందిరాదేవి, యల్లా ప్రగడ సీతాకుమారి, నందగిరి వేంకట రావు, ఇల్లిందల సరస్వతీదేవి, బూర్గుల రంగనాథరావు భాస్కరభట్ల కృష్ణారావు, ధరణికోట శ్రీనివాసులు, నెల్లూరి కేశవస్వామి, మొదలైన వారు ఉత్తమ శ్రేణికి

చెందిన కథానికలు వ్రాసినారు. చక్కని నవలలు వ్రాసిన వారిలో వట్టికోటఆళ్వారు స్వామి, భాస్కరభట్ల కృష్ణారావు, ఇల్లిందల సరస్వతీ దేవి మొదలైన వారిని పేర్కొనవలెను. వీరిలో స్వర్గీయ వట్టికోట ఆళ్వారు స్వామిని ప్రత్యేకంగా పేర్కొన వలెను. తెలంగాణా విముక్తి కొరకు జరిగిన అనేక ఉద్యమాలలో పాల్గొనిన స్వాతంత్ర్య వీరుడు. ఆళ్వారు స్వామి - తెలుగులో చౌక ధరకు మంచి పుస్తకాలను వ్రాయించి ప్రకటించి ప్రజలను ప్రబోధించిన సంస్కృతీ పరుడు ఆళ్వారు స్వామి- ఆయనది డిగ్రీలులేని పాండిత్యము. స్వయం కృషి చేత వ్యక్తిత్వాన్ని వికసింప చేసుకున్న దేశభక్తుడు ఆళ్వారు స్వామి.

ఆయన నవలలో రెండింటిని తప్పక పేర్కొన వలెను. ''ప్రజలమనిషి'' అనే నవలలో స్టేట్ కాంగ్రెస్ సంస్థ ఆవిర్భవించడానికి పూర్వము తెలంగాణాలోని పరిస్థితులను ఆయన చిత్రించినాడు, ''గంగూ'' అనే నవలలో నిజాం నిరంకుశ ప్రభుత్వానికీ, ప్రజలకూ మధ్యన కాంగ్రెస్ ఉద్యమము ప్రారంభము కాక పూర్వము జరిగిన పోరాటాన్ని చిత్రించినాడు. రెండు నవలలలోను ఆయన తెలంగాణ జన సామాన్యంలో వాడుకలో ఉన్న భాషను ఉపయోగించినాడు. ''మాలపల్లి'' శ్రేణికి చెందినవి యీ రెండు నవలలు. ఈ నవలల వలన కలిగిన ప్రేరణతో ఇటీవల శ్రీ దాశరధి రంగాచార్యులు చిల్లర దేవుళ్లు; మాయజలతారు, జనపదం మొదలైన ప్రశస్తమైన నవలలను వ్రాసినారు. మంచి విమర్శకులు, చరిత్ర పరిశోధకులు కూడా తెలంగాణములో ఉన్నారు. స్వర్గీయ ఆదిరాజు వీరభద్రరావు, శ్రీగడియారం రామకృష్ణశర్మ, శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం సోదరులు, స్వర్గీయ యం. డి. వీర భద్రయ్య విమర్శనా, పరిశోధనా రంగాలలో అపారమైన కృషి చేసి తెలుగు భాషను సుసంపన్నము చేసినారు. శ్రీసన్నిధానం సూర్యనారాయణశాస్త్రి, శ్రీ గుండేరావు హర్కారే, శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, శ్రీ కేశవపంతుల నరసింహశాస్త్రి మొదలైన వారు మహా పండితులు, మహాకవులు. సంగీతము, చిత్రకళలలో ప్రవీణులైనవారు యీ అర్ధ శతాబ్దములో తెలంగాణములో చాలామంది ఉన్నారు. ఉర్దూ- ఇంగ్లీషు భాషలలో ఉత్తమ రచయితలు, దినపత్రికలను ప్రతిభావంతంగా నిర్వహించిన సంపాదకులు, కూడా ఉన్నారు, ఈ విధంగా యీ అర్థ శతాబ్దంలో తెలంగాణా సాహితీ - సాంస్కృతిక రంగాలలో తన పాత్రను ప్రశంసనీయంగా నిర్వహించి సకలాంధ్ర స్థాయిలో సముచిత స్థానాన్ని ఆక్రమిస్తున్నది.

నూటా యేబది సంవత్సరాల క్రింద చీలి పోయిన తెలంగాణా పాయ తిరిగి 1 వ నవంబరు 1956 నాడు ఆంధ్రప్రదేశ్ యేర్పడినపుడు ఆంధ్ర

ప్రాంతంతో కలిసి పోయినది. ఈ రెండు పాయల కలయిక సహజమైనది; సముచితమైనది.

ఎఱ్ఱన, నన్నయ, తిక్కనల కవితకు కలయిక కల్పించిన మహాకవి, ఆయనను సంస్మరించే యీ సభలలో ఆంధ్ర, తెలంగాణా కలయికకు పురోగామి యైన తెలంగాణా సాహిత్యాన్ని గూర్చి ప్రశంసించడంలో ఔచిత్యము స్పష్టముగా కనిపిస్తున్నది.

తెలుగు ఆంధ్రప్రదేశ్ అధికార భాషగా ప్రకటితమైనది. అమెరికా, రష్యా మొదలైన దేశాలలోని కొన్ని విశ్వవిద్యాలయాలలో తెలుగు భాషాబోధన, పరిశోధన జరుగుతున్నది. భారత దేశములోని యితర రాష్ట్రాలలోనే కాక అంతర్జాతీయ స్థాయిలో కూడ తెలుగు బోధనకు, పరిశోధనకు, సాహితీ వికాసానికి కావలసిన ప్రయత్నాలు జరుగుతున్నవి. ఆధునిక అవసరాలకు అనుగుణంగా జాతీయ స్థాయిలోనే గాక అంతర్జాతీయ స్థాయిలో తెలుగు భాషాభివృద్ధి జరిగే మంచి రోజులలో మనము నివసిస్తూ ఉండడం మన అదృష్టంగా భావించు కుంటూ

ఏ ప్రపుల్ల పుష్పంబుల నీశ్వరునకు
పూజసల్పితినో యేమొ పూర్వమందు
కలద యేని పునర్జన్మ కలుగుగాక
మధుర మధురమైన తెలుగు మాతృభాష

అన్న రాయప్రోలు వాణిని సంస్మరిస్తున్నాను.

తెలుగు సాహిత్యం

తెలుగున సాహిత్యం ఎపుడు మొదలైనది? అను ప్రశ్నకు సమాధానము చెప్పుట శక్యముగాని పని. తెలుగు సాహిత్యం విషయంలోనే కాదు. ఏ భాషా సాహిత్యం విషయములోనైనా ఈ ప్రశ్నకు తగు సమాధానము రాజాలదు. మాటాడ నేర్చిన తొలి మానవుడు తన అంతర్గత భావాలను రమణీయముగ వెలువరింప గలిగినపుడే సాహిత్యం మొదలైనది. తన సుఖాన్ని, దుఃఖాన్ని ఆత్మ ప్రత్యయంతో భాషద్వారా నెలువరించుటకు తొలి మానవుడు చేసిన యత్నమే సాహిత్యముగ పరిణమించినది. సాహిత్యం మాత్రమే కాదు చిత్రలేఖన, సంగీతాది తదితర లలిత కళలును ఆదిమానవుని భావ వ్యక్తీకరణ కృషికి ఫలితములుగనే తొలుత ప్రాదుర్భావం పొందినవి.

తెలుగు ద్రావిడభాషా కుటుంబానికి చెందినదని పండితుల నిర్ణయము. కాని అది మూలద్రావిడ భాషనుండి ఎపుడు ఏతీరున విడివడి పరిణతి చెందినదో సవివరముగ తెలియవచ్చుటలేదు. ఇది ఎటులున్నను శాతవాహనుల కాలముననే, తెలుగుగడ్డపై తెలుగుభాష తన ప్రాతిపదిక రూపంలో వ్యాప్తి చెందినదని మాత్రము స్పష్ట మగుచున్నది. ప్రభువులు ప్రాకృతాన్ని అభిమానించిన ఫలిత ముగ కావ్యములు ఆనాడు ఆ భాషలలోనే వ్రాయబడినా తెలుగు భాషా ప్రభావం ప్రాకృతం మీదకూడ కొంతపడినదనే విషయాన్ని గాధాసప్తశతిలో అటనట కన్పడెడు తెలుగు పదాలు రుజువు చేస్తున్నవి. ఆ విధముగనే తెలుగుభాషను కూడ ప్రాకృతం ఎంతయో ప్రభావితం చేసినది. సాలంకాయనుల కాలమునను పరిస్థితులు ఇటులనే ఉండినవి. ఆ కాలమున రాజాదరణ కలది సంస్కృతము. కావున తెనుగు భాషలో సంస్కృత పదములు విరివిగ ప్రవేశింపగలిగినవి. ప్రభువు ఆదరణ లేకపోయినను సామాన్య ప్రజానీకమున తెలుగు చక్కగ ఆదరణను ఆర్జించి క్రీ. శ. 6 వ. శతాబ్ది ప్రాంతమున ప్రభువుల దృష్టిని ఆకర్షింప గలిగినది. రేనాటి చోళుల శాసనములు ఈ విషయమును రుజువు చేస్తున్నవి.

క్రీ. శ. 7వ శతాబ్దమున దక్షిణాపథమున తొలుత కర్ణాట ప్రాంతమును, తరువాత తెలుగు దేశమును చాళుక్యుల వశమైనది. ఈ చాళుక్యులు దేశీయులతో కలసి మెలసి దేశీయులుగనే వ్యవహరించడానికి భాషలను ప్రోత్సహించి, పరిపోషించిరి. వారి కృషివలన తొలుతగ లాభపడిన భాష కన్నడము. అందువలన ఆంధ్రభూమిని పాలించిన చాళుక్యులు సైతము మొదట కన్నడమునే ప్రోత్సహించిరి. కావుననే పంపడు, పొన్నడు మొదలగువారు జన్మతః తెలుగు దేశపువారే అయినను కన్నడమున రచనలను సాగించి, ప్రభువుల ఆదరణను ఆర్జించిరి. కాని క్రమముగ తెలుగు ప్రజలలో అదివరకే వ్యాప్తిలోనున్న దేశీయ ఛందములు ప్రభువుల దృష్టిని పండితుల దృష్టిని ఆకర్షింప గలిగినవి. సంస్కృత ఛందస్సు ప్రభావము కన్నడము ద్వారా వీనిపైన కొంతపడినను ఇవి తమ తెలుగుదనమును కోల్పోక ప్రభువుల శాసనాలలో తొలుతగ తావు కల్పించుకొన్నవి. గుణగవిజయాదిత్యుని నాటి (848 - 892) అద్దంకి, కందుకూరు శాసనములును, మొదటి చాళుక్య భీముని కాలపు ధర్మవరం శాసనమును, రెండవ యుద్ధ మల్లుని బెజవాడ శాసనములును తెలుగు పద్యములలో రూపొందింపబడినవి. వీనిలో మొదటి వానియందు తరువోజ, నడుమనున్న రెండింటి యందు సీసములును, కడపటిదాని యందు మధ్యాక్కర లును కలవు. దరిదాపుగ ఆ కాలముననే కందపద్యము కూడ కొంత స్థిరరూపమును ఆర్జించినదనడం పశ్చిమాంధ్రమున కరీంనగరు జిల్లాలలో గంగాధరమున లభ్యమైన శిలాశాసనమువలన రూఢమగుచున్నది. ఇది క్రీ. శ. 945 నాటిది. కర్ణాటక కవిరత్న త్రయమున ఆద్యుడైన పంపని తమ్ముడగు జనవల్లభుని ప్రశస్తి ఇందు కలదు. శాసనమున ముఖ్యభాగమంతయు కన్నడముననే ఉన్నను కడపటి భాగమున మూడు కందపద్యములు తెలుగున కలవు. కందము తెలుగున పరిపుష్టతను ఆర్జించినదనుట ఈ పద్యములు రుజువు చేయుచున్నవి. ఉదాహరణకు అందొకటి :

జిన భవనము లెత్తించుట
జిన పూజల్సేయుచున్కి జినమునులకు ద
త్తిన యన్న దాన మీవుట
జినవల్లభు బోలగలరె జనధర్మ పరులే.

ఈ విధముగ 10 వ శతాబ్దినాటికే తెలుగు ఛందోరీతి పరిపుష్టతను ఆర్జించి ఆ భాషలో కావ్యస్థాయిని అందుకొనగలిగిన పద్యములు రచింపబడినటుల స్పష్టమగుచున్నది. కాని ఆనాడు యేవైన కావ్యములు రచింపబడియుండెనా

యనుట మనకు తెలియని విషయము. రచింపబడియుండినను అవి తగిన ప్రచార భాగ్యమును పొందియుండవు. కడకు క్రీ. శ. 11 వ శతాబ్ది మధ్య భాగమున తూర్పు చాళుక్య ప్రభువగు రాజరాజనరేంద్రుని ఆదరణ ప్రోత్సాహమువలన నన్నయభట్టు ఆంధ్రమహాభారతమున తొలుతటి పర్వములను ప్రసన్న కధాకలితార్థ యుక్తితో రచించుటవలన తెలుగున ఒక మహాకావ్యము రూపొందినది. నన్నయ ఆదికవిగ పరిగణనకు రాగలిగినాడు.

2

నన్నయ తరువాతి రెండు శతాబ్దములందును తెలుగు సాహిత్యమున ఎన్నియో ప్రక్రియలను అనుసరించిన ప్రయోగములు జరిగినవి. ఈ ప్రయోగము లందు ఎక్కువ కృషిచేసినవారు శైవకవులు. సాహిత్యమును సామాన్య ప్రజానీకపు దరికి తీసుకొనిపోయి తద్వారా మత ప్రచారమును కొనసాగించుట వారి సంకల్పము. ఇక ప్రాచీన విజ్ఞానాన్ని ప్రజలకు అందించుటకు సంస్కృతభాష తప్పనిసరియగుట వారు గుర్తించిరి. అందువలన సంస్కృత పదములను తెలుగున మేళవింపు చేయుటలో వారు పలు ప్రయోగాలను నిర్వహింపవలసి వచ్చినది. అయితే ఛందో రీతులలో గానమునకు అనువుగా నుండు ద్విపదాది రీతులను అనుసరించియు వారు కొన్ని ప్రయోగములను కొనసాగించిరి. బహుశః మణి ప్రవాళరీతిలో అనగా సంస్కృత విభక్తులతో సంస్కృత పదములను తెలుగు విభక్తులతో తెలుగు పదములను కలగాపులగముగ చేరి రూపొందిన వాక్యములుకల రచనారీతిలో కూడ పద్యములు రచింపబడెననుట వృషాధిప శతకమునందలి ఒక పద్యమువలన తెలియవచ్చుచున్నది. ఈ వివిధ సమస్యలకు తగు పరిష్కార మార్గమును చూపినవారు 13 వ శతాబ్దినాటి తిక్కన సోమయాజి.

తిక్కన కవితను ఒక శిల్పముగ పరిగణించి అందు పారంగతత్వమును ఆర్జించినవారు. ఆయన ద్రష్ట—అంతియేకాదు. ధార్మికనిష్ఠ కలవాడు లౌకిక వృత్తియందు ఆరితేరినవాడు. ఆనాటి ఆంధ్రదేశపు పరిస్థితిని చక్కగ గుర్తింప గలిగినవాడు. ఆంధ్రావళి మోదం బొరయునట్లుగ చేయుట ఆయన సంకల్పము. ఆ కాలమున తమిళనాడునుండి వచ్చిన వైష్ణవము, కర్ణాటమునుండి వచ్చిన శైవము ఆంధ్రులందు ధార్మికముగ చీలికలను కలిగించి కల్లోలమునకు కారణములైనవి. ఈ పరిస్థితులనుండి దేశమును వెలికితీయు తన కృషిని ఆయన హరిహరమూర్తికి

అంకితముచేసి ధార్మికముగ ఒక వెలుగు బాటను చూపింపగలిగినారు. ఇక సాహిత్యరంగమున నన్నయ విరమించిన చోటున నుండియే తాను మొదలిడుట సముచితమని ఆయన భావించినాడు. మధ్యకాలపు కవుల ప్రయోగాలను ఆయన అర్థముచేసుకో గలిగెను. సాహిత్యమును ప్రజలకడకు కొనిపోవుటకై వీరు చేసిన కృషియందలి ఔచిత్యమును ఆయన ఆదరించెను. అందువలననే నన్నయ చేసినటుల సంస్కృతమునకు తెనుగును జతపరచక, తెనుగునకు సంస్కృతమును అనుసంధింప జేయుట తన కవిత్వమున ముఖ్య లక్షణముగ ఆయన గ్రహించెను. అనగా సాహిత్యమునకు తెలుగు దనమును నిండార కల్పించెననుట. ఇంక సంస్కృత పదములను తెలుగున వాడునపుడును జాత్యముకానివాటిని వాడుటకు నిరాకరించెను. ఇటుల సంస్కృత భాషాపదములనే కాదు, ఇతర భాషా పదములను వేనినైనను తెలుగుభాష గ్రహించుటకు అనువగు చక్కని మార్గమును ఆయన రూపొందించెను.

ఇక తెలుగు క్రియారూపములను నన్నయ వాడినవానివే ఆయన అనుసరించెను. ఆయన కాలమునాటికే, వస్తాడు, చేస్తాడు ఇట్టి క్రియారూపాలు తీరాంధ్రమున గ్రామీణులందు వ్యాప్తిలో ఉండినటుల తిక్కనగారి శిష్యుడగు కేతన రచించిన 'ఆంధ్రభాషాభూషణము' వలన తెలియుచున్నది. కాని తిక్కన ఇట్టి వానిని పరిత్యజించి నన్నయ నాటి క్రియారూపములనే గ్రహించుటలో ఒక మహోద్దేశము కలదు. మాండలిక రూపాలకు అతీతముగా సాహిత్య భాష ఉండి నపుడే అది ఆంధ్రదేశపు వివిధ ప్రాంతముల మధ్య సాంస్కృతికమగు ఐక్యమును నెలకొల్పగలుగునని ఆ మహాకవి అభిప్రాయము. రాకపోకల సదుపాయములు చాల తక్కువ ఉండిన ఆ కాలమున అట్టి ప్రామాణిక భాషయే ఆంధ్రుల సాంస్కృతిక ఐక్యమును కాపాడిన దనుటలో ఆవంతయును సందియము లేదు. 14 వ శతాబ్దము తరువాత ఆంధ్రభూమి బహుధాశకలితమై వేర్వేరు రాచరికములలో చీలియున్నపుడును, తమిళనాడు మొదలగు పర భాషా ప్రాంతములకు తెలుగువారు వలసపోయి, ఇతర భాషలవారి మధ్య తమ సంస్కృతిని కాపాడుకొని పరిపోషించు కోవలసి ఉన్నప్పుడును ఈ ప్రామాణిక భాషయే నాలుగు చెరగుల తెలుగువారి సంస్కృతిలోని ఏకతను పరిపోషించినది. ఆ విధముగ అది ఆ వర్గాలకు ఆంధ్రుల చారిత్రకావసరములకు సరికుదిరినది. కాని ఈనాడది అటులనే ఉండవలయునను నియమము లేదు. నేటి చారిత్రకావసరములను అనుసరించి అది మార్పొందితీరవలెను.

తిక్కన కృషివలన భారతమున కడపటి 15 పర్వములు రచింప బడగా, మధ్యగతశేషమును యెఱ్ఱన పూరించుటవలన 14 వ శతాబ్ది పూర్వార్థమున ఆంధ్రమహాభారతము సంపూర్ణ రూపమును పొందినది. ఆంధ్రసాహిత్య వికసనము నకు అది మార్గదర్శియైనది. ఆ తరువాత 19 వ శతాబ్ది చరమ పాదమువరకు ఆంధ్రసాహిత్య సాగరమున పయనించిన నావికులందరు ఆ దీపగృహపు పరిధిలోనే తమ అభిరుచులకు అనువుగ విహరించిరి.

3

క్రీ. శ. 1400 తర్వాత తెలుగు సాహిత్యము పలు ప్రక్రియలలో పలు రీతులలో కవిత్రయపు వారి వరవడిని దాదాపుగా అనుసరించుచునే వికసనము పొందినది.

ఆనాటి తక్కిన భారతీయ సాహిత్యముల ప్రగతితో పోల్చిచూచినపుడు తెలుగు సాహిత్యపు ప్రగతి ఎవరికైనను అబ్బురము కల్పింపక మానదు. ఇంతే కాక; ఆనాడు తెలుగు జాతి ఎదుర్కొనిన పలు రాజకీయ విపర్యయముల దృష్టిలో ఈ ప్రగతి మరింతగ విభ్రాంతి కలిగించును. 14 వ శతాబ్దిలో కృష్ణకు ఎగువ నున్న దక్షిణాపథమంతయు ముస్లిముల హస్తగతమైనది. ఆంధ్రుల సామ్రాజ్య వైభవము తెలుగు దేశపు నడిగర్భమునుండి పైదొలగినది. ఇక తెలుగు దేశపు పొలిమేరలో ఏర్పడిన విజయనగర సామ్రాజ్యములో తెలుగువారికే మేలి భాగ మున్నను, ఆ రాజ్యమున ఆంధ్రదేశమంతయు ఏనాడును చేరియుండదు: కృష్ణ రాయని కాలమున తీరాంధ్రమును, రాయలసీమయు, ఆ సామ్రాజ్యమున అంతర్భాగములైనను పశ్చిమాంధ్రము, ఆంధ్రేతర పాలనలోనే ఉండినది. ఇక తళ్ళికోట యుద్ధానంతరమున నామమాత్రముగ దక్షిణాంధ్రమున అత్యల్పభాగము మాత్రమే చంద్రగిరి పాలకుల ఆధీనమున మిగిలినది. 18 వ శతాబ్దమున ఆంధ్ర దేశమంతయు పరాక్రాంతమైనది. ఇక తెలుగు దేశపు నాయకులతో పాటుగ తెలుగు కళాకారులలో అత్యంత భాగము తమిళ దేశమును తమ కార్యరంగముగ చేసికొనిరి. పై రాజకీయ భూమికలో కృష్ణరాయని దిగ్విజయకాలము మొదలుగ రాక్షసితంగడి యుద్ధకాలమువరకు (1520-1585) మాత్రమే ఆంధ్రదేశమున అత్యధిక భాగము తెలుగు రాజుల ఏలుబడిలో ఉండినది. తక్కిన కాలమున తెలుగు కవులు తెలుగుసీమ పొలిమేరలందును, తమిళనాడునను నివసించియు

తెలుగు సాహిత్యమునకు ప్రశస్తిని కల్పించిరి. ఇట్టిది అనగా స్వకీయ భూమిని వదలి అతి దీర్ఘకాలమున ఇతర ప్రాంతములందు తరతరములు వసించియు, స్వీయభాషకు ప్రశస్తి కల్పించిన ఉదంతము ప్రపంచమున ఏ ఇతర సాహిత్య చరిత్రలోను కన్పించలేదు. ఇది తెలుగువారు గర్వింపదగిన విషయము.

ఇట్టి ప్రశస్తిని అట్టి విషమ కాలమున తెలుగు సాహిత్యము ఆర్జించుటకు కారణభూతములైన విశిష్ట లక్షణములు ఎట్టివి అనుట విచారణీయము. విజయనగర సమ్రాట్టులు ఆ భాషా సాహిత్యములకు కల్పించిన తొలుతటి రాజకీయ ప్రతిపత్తియే అందులకు కారణ భూతమైనదని కొందరనవచ్చును. కాని యిది అర్థ సత్యము మాత్రమే. తెలుగు నాయకుల రాజ్యమంతరించిన పిదప తంజావూరును ఏలిన మహారాష్ట్రులు తమ మాతృ భాషయగు మరాఠీని, దేశ ప్రజల భాషయగు తమిళమును కాదని, తెలుగు సాహిత్యమునే పోషించి అంతటితో ఊరకొనలేక తెలుగున యక్షగానాదులను కూడ రచించుట చూడగా రాజకీయములను కారణముల కన్న ఇతరములే అందుకలవని స్పష్టమగుచున్నది. ఆ తక్కిన కారణములలో బలవత్తరమైనది, తెలుగు భాషయందలి మధురిమ. కృష్ణరాయని అనంతరమున ప్రబంధ నిర్మాణ చాతుర్యమున పస సన్నగిల్లి కొంత జడత అలముకొనినను భాషయందలి మధురిమ దానిని కప్పిపుచ్చగలిగినది. అందువలననే, రాజకీయ విపర్యయములతో నిమిత్తము లేకుండ కటకము మొదలుగ కన్యాకుమారి వరకు వివిధ మాతృభాషలు కలవారికి అందరికిని తెలుగు సాహిత్యం ఆదరణీయమైనది. తెలుగున పరిచయము విద్యావంతుల ముఖ్యలక్షణమైనది. గోల్కొండ యందలి ముస్లిం పాలకులును, ఆమధురిమకు వశులై తెలుగు కవులను పోషించిరి. ఈ విధముగా తెలుగు భాష ఆనాడు దక్షిణదేశమున ఒక సామాన్య భాషగా పరిణమించినది. యూరప్ ఖండమున ఈ 11 వ శతాబ్దము మొదలుగా 19 వ శతాబ్ది వరకు ఫ్రెంచిభాషకు సాహిత్యమునకు ఉండిన స్థానము 16 వ శతాబ్ది మొదలుగ 19 వ శతాబ్దివరకు తెలుగు భాషా సాహిత్యములకు దక్షిణభారతమున మహేంద్రగిరి మొదలు మన్నారు జలసంధివరకు ఉన్నటుల చెప్పవచ్చును. ఇట్టి పరిస్థితులలో భారతదేశమున వర్తక వ్యాపారముకొరకు చేరిన పాశ్చాత్యులలో తొలుతటి వారగు పోర్చుగీసువారికి, కళ్ళికోట మొదలుగ కోరంగివరకు గల దక్షిణ భారతపు రేవులందును, ప్రముఖ వర్తక కేంద్రములందును, రాజాస్థానములందును తెలుగుననే వ్యవహారములు జరుగుట అనుభవవేద్యమైనది. అంతట వారు దానికి 'జెంటూ'

అని పేరిడి వ్యవహరించిరి. జెంటు అనగా దేశీయులభాష అని అర్థము. ఆ తర్వాత వచ్చిన ఆంగ్లేయులలో ఒకరు తెలుగు సాహిత్యపు బలిమిని అర్థముచేసుకొని అది గ్రీసు భాషవలె పలుకుబడి కలదని అనెను. వేరొకరు ఇటాలియన్ భాషవలె మధురమనెను. అంతయేల, తమిళులును సంస్కృత భాషా పారంగతులును అగు అప్పయ్య దీక్షితుడు ఆంధ్రత్వమును ఆంధ్రభాషయు బహుకృతతపః ఫలములని ఆ కాలమున నుడివినాడు.

తెలుగు భాషయందలి మధురిమయే కర్ణాటక సంగీతమున సాహిత్య రచన యందు ఆ భాషకు అగ్రస్థానమును కల్పించినది. కాల గతియందలి పై అవరోధములను ఎదుర్కొని ఆ యగ్రస్థానము ఈనాడును ఆ భాష నిలబెట్టుకొని యున్నది.

4

1775 మొదలుగ 1875 వరకు నడచిన నూరేండ్లను తెలుగు సాహిత్య చరిత్రలో క్షీణయుగముగ కొందరు పేర్కొనిరి. కాని దానిని సుషుప్తియుగమని అనుట సమంజసమనిపించును. ఆధునికయుగమునకు అనుగుణ మగు నూత్నరీతిని సంతరించుకొనుట కనువుగా తనకు తెలియకుండగనే సమర్థతను తెలుగు సాహిత్యము ఆ సుషుప్తికాలమున ఆర్జించుకొనినది. తెలుగువారికి ఆ కాలమున పాశ్చాత్య వాఙ్మయముతో గాఢ పరిచయము కలిగినది. పాశ్చాత్య సహాయకులు కొందరు తెలుగును పఠించి తెలుగున నూతన రీతిలో నిఘంటువుల రచనకు ప్రోత్సాహమిచ్చుటయే కాక భాషా చరిత్రాదులలో పరిశోధనలో ఉత్సాహమును కల్పించి తెలుగువారి దృష్టిని క్రొంగ్రొత్త దృశ్యముల వైపుకు మరలించిరి. వీని అన్నింటి ఫలితముగ 1875 మొదలులో తెలుగుజాతియందు ఒక నూతన చైతన్యము పనిచేయసాగినది. తెలుగు సాహిత్యమున నూతన ప్రక్రియలను ఎన్నింటినో తెలుగు రచయితలు సమకూర్చిరి, సమకూర్చుచున్నారు. భాష యందును వారు నూత్నరీతులలో ప్రయోగాలను పెక్కింటిని చేయుచున్నారు. క్రొంగ్రొత్తరూపముల సంతరించుకొని, ఆధునిక యుగమున తక్కిన ప్రపంచపు ప్రముఖ భాషలతోపాటుగా సమానస్థాయిలో తెలుగు భాష నిలువవలెనను ఉదాత్త సంకల్పముతో ఈ ప్రయోగములతో నాడు నిర్వహింపబడుచున్నది. భాషయందొక కుదురుబాటు, సాహిత్యమున నొక నూత్న స్ఫూర్తి కలుగుటకు పూర్వరంగముగా ఈ ప్రయోగములు ఉపకరించగలవు. ఈనాడు జరుగుచున్న ఈ కృషి

ఫలితముగ ఒక నూత్న ప్రామాణిక భాషయు, వినూత్న సాహిత్య ప్రక్రియలును రూపొందగలవని ఆశించుటకు అవకాశము గలదు.

చారిత్రకముగ సహితము తెలుగు భాష సాహిత్యములు కొంగ్రొత్త రూపములను ధరించవలసిన ఆవశ్యకత యేర్పడినది. భాషా ప్రయుక్తముగ ఆంధ్ర ప్రదేశ్ రూపొందిన తర్వాత తెలుగును క్రమరీతిలో అన్ని శాఖలందును, పరిపాలనా వ్యవహారభాషగా చేయుటకు ప్రభుత్వము నిర్ణయించి, అందులకై ప్రాతిపదిక చర్యలను కొన్నింటిని తీసికొనినది. ఇందులకు తోడుగా అన్ని దశలలో విద్యాబోధనకు తెలుగును మాధ్యమముగా చేయుటకును నిర్ణయము జరిగి అమలు జరుపబడుచున్నది. ఈ కార్యక్రమములను సమర్ధతతో నిర్వహించుటకు తగు మార్పులు తెలుగుభాషలో రావలసియున్నవి. ఇతర భాషా పదములకు తెలుగుదనము కలుగచేసి తనలో ఇముడ్చుకొనుటలో తెలుగు భాషకు గల సమర్ధత అద్వితీయము. ఈ శక్తిని చక్కగా వినియోగించుకొని శాస్త్ర విషయకములు పరిపాలనా వ్యవహార సంబంధములు నగు పదములను విరివిగ సృజించుకొనుటయేగాక సంక్లిష్ట భావములను తగుపారిభాషికరీతిలో వివరించు సమర్ధతను పెంపొందించుకొనుచు 'దేశ భాషలందు తెలుగు లెస్స' అను ప్రఖ్యాతిని ఈ ఆధునిక యుగమున సహితము సార్థకము చేయగలరని ఆశించవచ్చును.

(తెలుగు సంస్కృతి—నల ఉగాది సాంస్కృతిక ఉత్సవాల ప్రత్యేక సంచిక)

తెలుగు భాష - పారసీ, ఉర్దూల ప్రభావము

ప్రపంచములో అనేక భాషలున్నవి. వానిలో వినడానికి సొంపైనవిగా కొన్ని ప్రసిద్ధి చెందినవి. ఆసియా ఖండములో పార్సీ, ఐరోపా ఖండములో ఇటాలియన్ శ్రావ్యమైన భాషలు. ఈ శ్రేణికి చెందినది మన దేశములోని తెలుగు భాష. ప్రాచ్యఖండపు ఇటాలియన్ అనీ పారసికన్న శ్రావ్యమైనదనీ తెలుగు కీర్తిగాంచినది.

కొందరికి పరభాషలంటే గిట్టదు. కాని తమ భాషా మాధుర్యమును ఇతరులు కీర్తించినప్పటికినీ, ఇతర ప్రాంతాలలో తమ భాషకు ప్రశస్తి కలిగినప్పటికినీ. తెలుగువాడు 'నన్ను ముట్టుకోకు నామాల కాకి' అని పరభాషా సంస్కృతులకు దూరంగా ఉండలేదు. సంస్కృతానికి, తెలుగుకు ఉన్న సంబంధము గాఢమైనది; పురాతనమైనది. అదే విధంగా తమిళ, కన్నడములతో తెలుగుకు దగ్గరి చుట్టరికము. తమిళ, కన్నడ, తెలుగు భాషల పరస్పర ప్రభావము అందరికీ తెలిసినదే. ఇదేవిధంగా పారసీ, ఉర్దూ భాషల ప్రభావాన్ని కూడా తెలుగు మీద ప్రస్ఫుటంగా చూడవచ్చును. సాంస్కృతిక ప్రభావాలు పరస్పరమైనవి. ఇతర భాషలను తెలుగు ప్రభావితము చేసిన నిదర్శనాలు కూడ కన్పిస్తున్నవి. ప్రస్తుతము మనము పరిశీలించవలసిన విషయము పారసీ, ఉర్దూ భాషల వలన తెలుగు పైన పడిన ప్రభావము.

ముస్లిం దండయాత్రలతో భారతదేశమున అరబ్బీ, ఉర్దూ భాషల ప్రవేశించినవన్న సత్యము, చరిత్ర తెలిసిన వారందరికీ విదితమే. కాని క్రీస్తుశక ప్రారంభమునుండియే తెలుగు దేశానికి విదేశాలతో వర్తక వ్యాపారాలు ఉండేవి. సూర్ల మైళ్ల పొడవుగల తీరముతెలుగు దేశానికి ప్రకృతి ప్రసాదించిన పెన్నిధులలో ముఖ్యమైనది. ఇతర దేశాలతో తెలుగువారు క్రీస్తుశకము ఆదినుండి నౌకల ద్వారా సముద్ర వ్యాపారం చేస్తుండేవారు. ఈ విధంగా విదేశాలతో విదేశాల సంస్కృతులతో తెలుగు వారికి చిరకాల సంబంధం. ఈ సంబంధం పరస్పర ప్రభావానికి దోహదము చేసినది. ఇటువంటి విదేశాలలో అరేబియా దేశము కూడా పేర్కొనదగినది. పరభాషా సంస్కృతులను చూచి ఉలికిపడక పోవటం తెలుగు

వాని విశిష్టత అని ముందే చెప్పినాను. సుప్రసిద్ధ పండితుడూ రసగంగాధర కర్తా, షాజహాను కుమారుడైన దారాకు ప్రియమిత్రుడూ అయిన జగన్నాథుడు పారసీ భాషలో ప్రవీణుడని అందరికి తెలిసినయథార్థము. పదునాలుగవ శతాబ్దమునుండి ఖిల్జీ రాజులు, తుగ్లక్ రాజులు దండయాత్రల ద్వారా దక్షిణ దేశములో అడుగు పెట్టి క్రమక్రమంగా అధికారాన్ని విస్తృతం చేసుకొని స్థిరపరచుకున్నారు. తత్ఫలితంగా పారసీ భాష మన దేశములో ప్రచారంలోనికి వచ్చి భారతీయ విద్వాంసులు ఆ భాషలో ప్రావీణ్యం సంపాదించుకోవడం జరిగింది. తెలంగాణాలోని తెలుగు విద్వాంసులు యిటీవల వరకు పారసీ భాషలో ప్రావీణ్యాన్ని సంపాదించే వారు. బహమనీ రాజ్యం, గోలకొండ రాజ్యం తెలుగు దేశాన్ని కొంత కాలము పరిపాలించినవి. ఆ సందర్భములో పారసీ భాష రాజభాషగా విశేష ప్రచారము పొందినది. ఆ తరువాత ఆసఫ్‌జాహీనిజాం రాజులు తెలుగు దేశాన్ని పరిపాలించి పారసీ భాషా ప్రచారానికి తోడ్పడినారు. నిజానికి పారసీ ఈ పరిపాలకుల అధికార భాషగా ఉండినది. హిందూ ముస్లింల సంస్కృతుల సమ్మేళన ఫలితంగా రూపొందింది ఉర్దూ భాష. ఉర్దూ కూడ పారసీవలె మధురమైన భాష. పారసీ, సంస్కృతాలు ఏక కుటుంబానికి చెందిన భాషలైతే పారసీ, అరబ్బీ, సంస్కృతంతోపాటు ఇతర భారతీయ భాషల ప్రభావంతో రూపొందినది ఉర్దూ భాష. ఉత్తర భారతంలో రేఖ్తాగా ప్రారంభమై క్రమక్రమంగా హిందుస్థానిగా నామాంతరము పొంది ఉర్దూగా పరిణమించినది. ఉర్దూకు జన్మస్థానం దక్కను అని కూడ ఒక బలమైన అభిప్రాయము కలదు. మొత్తం మీద సకల భారత స్థాయిలో ఉర్దూ భాష సాహిత్యాలు వికాసము పొందినవి. ప్రత్యేకంగా తెలుగు దేశంలో ఈ భాష బాగా వ్యాప్తి చెందినది. రాజాదరణఫలితంగా పారసీ ఉర్దూలు విద్వాంసులకు ఆదరపాత్రమై తెలుగు భాషను ప్రభావితము చేసినవి. ఈ విధంగా గడచిన నాలుగు ఐదు నూర్ల సంవత్సరాలలో పారసీ ఉర్దూ భాషలు మన దేశంలో అభివృద్ధి చెంది దేశభాషలపైన ఒక ముద్ర వేసినవి.

పారసీ ఉర్దూ భాషల ప్రభావాన్ని మనము రెండు విధాలుగా చూడ వచ్చును. మొదటిది భాషపైన ప్రభావము, రెండవది సాహిత్యముపైన ప్రభావము. భాషపైన ప్రభావము ఎక్కువగా శబ్దజాలానికి సంబంధించినది. సాహిత్యముపైన ప్రభావము అనువాదాలు, అనుసరణలకు సంబంధించినది. ఈ ప్రసంగములో ఈ రెండు ప్రభావాలను గురించి కాలపరిమితిని అనుసరించి ప్రస్తావించవలసి ఉంటుంది.

తెలుగుపైన అన్యభాషా ప్రభావమునకు అనేక శతాబ్దాల చరిత్ర కలదు. నన్నయ, నన్నెచోడుడు, తిక్కన మొదలైన పూర్వకవుల రచనలలో కూడ ఈ ప్రభావము గోచరిస్తున్నది. కొందరు భాషా పరిశోధకులు వీరి రచనలలో ఫారసీ శబ్దాలను పసికట్టినారు. అయితే మనకు ప్రస్ఫుటంగా ఈ ప్రభావం కనుపించేది కాకతీయుల కాలంనుండియే అని చెప్పవచ్చును. ఒక్కమారు మన తెలుగు సాహిత్య చరిత్రను అవలోకించితే ఈ సత్యము వెల్లడికాగలదు. శ్రీనాధుడు తన భీమఖండాన్ని బెండపూడి అన్నయ మంత్రికి అంకితమిస్తూ ఆయనను తురుష్క భాషలో ప్రవీణునిగా వర్ణించినాడు. హిందువులు ఫారసీ మొదలైన భాషలలో ప్రవీణులుగా ఉండిరని జక్కన తన విక్రమార్క చరిత్రలో చెప్పినాడు. ఈ కవుల రచనలలో ఫారసీ, ఉర్దూ శబ్దాలు కనిపిస్తున్నవి. శ్రీనాధుని గ్రంధాలలో ఇటువంటి శబ్దాలు పుష్కలంగా ఉన్నవి. అసలు, ఖర్చు, దస్త్రాలు, (దఫ్తర్), కుల్లా (కుల్హా) ఖలందాను పాపోసుఖరోసా కాగితము (కాగజ్) బిబ్బి (బీబి) సన్నాయి (షహనాయి) మసీదు బరాబరి (బరాబర్) రోజు, దుకాణము, శాలువ (షాల్), మఖమల్, రుమాలు గస్తీతిరుగు (గష్త్) మొదలైన శబ్దాలు శ్రీనాధ జక్కనాది కవులు ఉపయోగించినారు.

'పూజారి వారి కోడలు
తాజారగ బిందె జారి దబ్బున బడియెన్
మైజారు కొంగు దడిసిన
బాజారే తిరిగి చూచి పక్కున నవ్వెన్.,

అనే పద్యము అందరికీ తెలిసినదే. బాజారు అన్న శబ్దము కూడా అందరెరిగినదే. ఒకచోట ఖుసిమీరన్ అని శ్రీనాధుడు వాడినాడు. ఖుసి అనగా 'ఖుషి' అంటే సంతోషం. శ్రీకృష్ణరాయలు, అల్లసాని పెద్దన మొదలైన కవులు ఫారసీ శబ్దాలను తమ రచనలలో ప్రయోగించిన నిదర్శనాలు అనేకము కనిపిస్తున్నవి. ఈనాటి కవులు కూడా ఫారసీ, ఉర్దూ శబ్దాలను తమ రచనలలో విశేషంగా ప్రయోగించినారు. మన శాసనాలలోను, కైఫీయత్‌లలోను జానపద సాహిత్యములోను ఉర్దూ, ఫారసీ శబ్దాలు పుష్కలంగా కనిపిస్తున్నవి. గోగులపాటి కూర్మనాధకవి తన శతకములో ఉర్దూ, ఫారసీ పదాలు ప్రయోగించి తన ప్రత్యేకతను చూపించినాడు. ఈయన రచించిన కొన్ని పద్యాలు ఫార్సీ ఉర్దూ శబ్దాలతో నిండి ఉన్నవి. చలువదువ్వలువ కుచ్చెలఅంచు ముత్తెముల్ పదనఖప్రభకు

సలాముసేయ అన్నాడు శుకస ప్తతికవి. ఇక మనఆధునిక కవుల రచనలను ఒక మారు పరిశీలించండి.

బేగి ఆరే అరబీ పదోరే యంచు
బోడి సన్యాసుల పొడుచువారు
మత్రఖో మూపర్ మాటీయనుచు
వైష్ణవుల బొట్టు దుడువగ బోవువారు

అని వ్రాసిన గోగులపాటి కవి పద్యాలవంటివి ఇతర శతకాలలో అనేకాలు చూడండి.

౧. నాకలోకము నీకు దివాన్‌ఖాన
నిగమ పదార్థము నీ ఖజాన
చిత్రమా, మంజూరు చేయు నా దరఖాస్తు
నాదరింపుము నాయాదు దాస్త

౨. నీదు దర్బారుపై నిండే బందోబస్తు
పూనియున్నది లక్ష్మినిషస్తు

౩. చేతు నీతో నేను చిన్నని తక్రీరు
సలహా పసందు చేయరా జరూరు

శిష్టు కృష్ణమూర్తి కవి ఉత్పలమాలిక, సురవరము ప్రతాపరెడ్డి దండకము పారసీ, ఉర్దూ పద భరితమైన తెలుగు కవిత్వానికి మంచి తార్కాణాలు. సంస్కృతముతో తెలుగు యెంత సుందరముగా మిశితమైనదో, ఉర్దూ, పారసీ పదాలతో కూడ అంతే సుందరముగా మిశితమైనదని యీ పద్యాలు తెలుపుతున్నవి తెలుగు భాషా విశిష్టతకు మరొక మంచి ఉదాహరణలుపై పంక్తులు.

'చూపుల విముగ్ధమైన నాజూకు కలదో'

అన్నారు రాయప్రోలు సుబ్బారావుగారొకచోట. నాజూకు అనేమాట సొగసుగా ప్రయోగింపబడినది.

'హుక్కా ఖర్చులకు సాటిరాదు గదా

మక్కా మసీదు తోడ'ని అన్నారు జాషువాగారు తమ ఫిర్దౌసి కావ్యంలో. ఈ విధంగా నేటి తెలుగు సాహిత్యంలో ఉర్దూ పదాలను అందంగా పోషించిన నిదర్శనాలను పేర్కొనవచ్చును.

గోలకొండ కుతుబ్‌షాహిల నుండి అసఫ్‌జాహిలవరకు జరిగిన పరిపాలనలో ఉరుదూ, ఫారసీ పదాలు అనేకము ప్రజల వాడుకలోనికి వచ్చి తెలుగు పదాలుగా చలామణియౌతున్నవి. ఒక కృష్ణా జిల్లాలో మాత్రమే లెక్క పెట్టితే ఆరు నూర్లకు పైగా ఉర్దూ పార్సీ పదాలు రెవిన్యూ పరిపాలన మొదలైన ప్రభుత్వ వ్యవహారాలలో కనిపిస్తున్నవని ఒకసారి స్వర్గీయ డాక్టర్. పట్టాభి సీతారామయ్యగారు చెప్పినారు. దస్తావేజు, గస్తీ, తహసిల్, రసీదు, జమ, ఖర్చు ఖజాన, అర్జీ, వజీరు, కొత్వాలు, నజర్, ఇనాం మొదలైన పదాలను ఎన్నింటినో పేర్కొనవచ్చును. తెలంగాణాలో పటేలు, పట్వారి పత్ర వ్యవహారాలలో ఫారసీ, ఉర్దూ పదాలు కొల్లలుగా కనిపిస్తున్నవి. ఈ విధంగా తెలుగు భాషపైన ఉర్దూ శబ్దాల ప్రభావాన్ని మనము చూడవచ్చును. నామవాచకాలేకాదు, అనేక క్రియా పదాలు కూడా తెలుగులో ప్రవేశించినవి. దబాయించు, ఉడాయించు, బనాయించు, జమాయించు, బదలాయించు, ఖరీదుకట్టు, జమకట్టు, గప్పాలుకొట్టు మొదలైన వానిని ఎన్నింటినైనను మనము పేర్కొనవచ్చును. ఈ పదజాలాన్ని వ్యాకరణ దృష్టితో వర్గీకరించి చూడడం ఒక మంచి భాషా పరిశ్రమ కాగలదు. చాడీఖోర్, దగల్‌బాజ్, రిక్షావాలా, పాన్‌దాన్, పట్టేదార్, కిరాయదార్‌వంటి సమాసాలను మనము ఎన్నింటినో చూపవచ్చును. ఈ శబ్దాలతో సమాసాలు అందంగా జోడించడం జరిగింది.

సాహిత్య దృష్ట్యా కూడా ఉర్దూ, ఫారసీ భాషల ప్రభావము తెలుగుపైన మనకు కనిపిస్తున్నది. గజల్ ఉర్దూ భాషకు ప్రత్యేకమైన ఛందోరీతి. ఈ రీతిని తెనుగులో ప్రచారమునకు తెచ్చిన శ్రీ దాశరథిని ప్రత్యేకముగా పేర్కొనవలసి ఉంటుంది. భావము, భాష, రచనా పద్ధతి దృష్ట్యా డాక్టర్ దాశరథి. డాక్టర్ నారాయణరెడ్డిగార్ల సినిమా గేయాలలో మనము గజల్ స్వరూపాన్ని సౌందర్యాన్ని చూడవచ్చును.

తెలుగు రచయితలు ఫారసీ, ఉర్దూ భాషలు నేర్చుకొని అందులోని ఉత్తమ వాఙ్మయమును అనువాదము చేసిన నిదర్శనాలు కూడా మనముందు ఉన్నవి. ముఖ్యంగా ఉమర్‌ఖయాం తెలుగు వారిని బాగుగా ఆకర్షించినాడు. స్వర్గీయ దువ్వూరి రామిరెడ్డి, స్వర్గీయ బూర్గుల రామకృష్ణారావు, స్వర్గీయ అదిభట్ల

నారాయణదాసు ప్రభృతులు ఉమర్ ఖయాం రుబాయీలను మాతృకనుండి తెనిగించినారు. ఈ తెనిగింపులలోని సొగసు ప్రత్యేకంగా పరిశీలించదగినది. సర్మద్, షేఖ్‌సాదీ ప్రభృతుల రచనలు కూడ కొన్ని తెలుగులోనికి వచ్చినవి. ఉర్దూ కవులలో సర్వవిధాల ప్రథమగణ్యుడైన గాలిబ్ గీతాలను డాక్టర్ దాశరథి తెనిగించినారు. డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారు ఎక్బాల్ రచనలను కొన్నింటిని తెనిగించినారు. మీర్ జఫర్ ప్రభృతుల రచనలు కూడా కొన్ని తెలుగులోనికి వచ్చినవి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి పక్షాన ఉర్దూ, ఫారసీ సాహిత్యాలను పరిచయము చేసే ఉద్దేశంతో కొన్ని గ్రంథాలు ప్రకటితమైనవి. వీనిలో అమ్జద్ రుబాయీలు, ఉర్దూ కథానికలు, ఉర్దూ సాహిత్య చరిత్ర, మౌలానా రూమీ మస్నవీ, మిర్జాగాలిబ్, ఉర్దూ కవుల కవితాసామగ్రి, ఫారసీ కవుల ప్రసక్తివంటి ఉత్తమ గ్రంథాలు ప్రచురితమైనవి.

ఉర్దూ భాషనుండి కథానికా వాఙ్మయము కొంత తెలుగులోనికి వచ్చినది, యవన యామినీ వినోద కథలు, చార్‌దర్వేష్ కథలు, తోతీనామా కథలు ఈ శతాబ్దానికి పూర్వమే మన భాషలోనికి వచ్చినవి. ఈ శతాబ్దములో ప్రేమచంద్ కథలు బహుళంగా తెలుగులోనికి వచ్చినవి. ఇందుకు మార్గదర్శకులు స్వర్గీయ మాడపాటి హనుమంతారావుగారు. వారు కొన్ని ప్రేమ్‌చంద్ కథలను చక్కగా తెనుగులోనికి అనువదించి దారి చూపించినారు. తరువాత వారిని అనుసరించి, ప్రేంచంద్ కథలను మరి కొందరు తెనిగించినారు. ప్రేమ్‌చంద్ కథలు, నవలలతో పాటు కిషన్‌చందర్ మొదలైనవారి కథలు, నవలలు కూడా తెలుగులోనికి వచ్చినవి. కేంద్ర సాహిత్య అకాడమి పక్షాన ఉర్దూ నవలలను కొన్నింటిని తెలుగులోనికి అనువాదం చేయించటం జరిగింది. ఈ విధంగా నాలుగైదు నూర్ల సంవత్సరాల నుండి యీ ప్రభావాన్ని మనము గమనించవచ్చును. తెలుగు-ఉర్దూ, ఉర్దూ-తెలుగు నిఘంటువులు స్వర్గీయ కొండల్‌రావుగారు కూర్చి ప్రకటించినారు. తరువాత హైదరాబాదు అంజుమన్ తరఖ్ఖీ ఉర్దూ మరి రెండు సంగ్రహ నిఘంటువులను ప్రకటించినది. ఒక బృహత్ నిఘంటువు వ్రాతప్రతి సిద్ధమౌతున్నది ఈ కృషి సర్వవిధాల ప్రశంసనీయమైనది. ప్రోత్సహించదగినది. ఈ ఆదాన ప్రదానం సాంస్కృతికంగా,సాహిత్యపరంగా తెలుగువారి విశాల దృక్పథాన్ని తెలుగుదనం విశిష్టతను చాటుతున్నది. ఈ విశిష్టతను కాపాడి ఇంకా కొనసాగించవలసి ఉంటుంది. ప్రస్తుత వాతావరణం ఇందుకు అనుకూలంగా ఉన్నది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఇందుకు అవసరమైన పునాదులను నిర్మించినది. ఇటీవలనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ఉర్దూ అకాడమీని స్థాపించి ఇటువంటి కృషిపట్ల ఆదరాన్ని ప్రకటించినది. ఆ సంస్థ తన కార్యక్రమాన్ని రూపొందించుకొని, పురోగమించడానికి కావలసిన యేర్పాట్లను చేసుకుంటున్నది.

(రేడియో ప్రసంగం 8-6-76)

ఉర్దూపై సంస్కృత భాషా ప్రభావము

భారత దేశములో అనేక భాషలు వ్యవహారములో ఉన్నవి. ఆర్థిక, రాజకీయ, సామాజిక కారణాల ఫలితముగా ఈ భాషలపైన విదేశ భాషల ప్రభావము గోచరిస్తున్నది. విదేశాల నుండి జరిగిన దండయాత్రల మూలంగా పరదేశాలతో చేసిన వాణిజ్య వ్యాపారాల కారణంగా భారతీయ భాషలకు ఇతర భాషలతో సంపర్కము కలిగినది. ఇటువంటి భాషలలో అరబ్బీ, పారసీ భాషలు ప్రత్యేకంగా పేర్కొనదగినవి. ముస్లింలు భారత దేశాన్ని పరిపాలించిన కాలములో ఈ ప్రభావము మరింత ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. మధ్య యుగము నుండి గడచిన శతాబ్దము వరకు పారసీ భాష రాజ భాషగా కూడా ఉండిన సత్యము చరిత్రజ్ఞులకు తెలిసినదే. తెలుగు మొదలైన ప్రాంతీయ భాషలపైన ఉర్దూ, పారసీల ప్రభావము కొన్ని శతాబ్దాలనుండి మనకు కనిపిస్తున్నది. ఈ ప్రభావాన్ని వివరించే గ్రంథాలు కూడ మన భాషలలో వెలువడినవి. కావున ఈ సందర్భములో ఉర్దూ భాషపైన సంస్కృత ప్రభావము కూడ ఎంతవరకు ఉన్నదను ప్రశ్న సహజంగా ఉత్పన్నమవుతున్నది. ఈ ప్రశ్నకు సమాధానము ఆలోచించినపుడు ఉర్దూ పుట్టు పూర్వోత్తరాలను గురించి కొంత తెలిసికోవడం ఆవశ్యము.

ఉర్దూ విజాతీయమైన భాష అని ఒక అభిప్రాయము కొందరిలో ఉన్నది. కాని ఆ అభిప్రాయము సహేతుకము కాదని చెప్పవచ్చును. ఎందుకనగా ఈ భాష భారతదేశంలోనే జన్మించి వ్యాప్తి నొందినది. అరబ్ దేశాలలోను, ఇరాన్ దేశములోను, అఫ్ఘనిస్తాన్ మొదలైన ప్రాంతములందును ఉర్దూ భాష ప్రచారములో లేదు. దాని జన్మస్థానము భారత దేశమే. ఉర్దూనది భారతదేశంలో రెండు పాయలుగా ప్రవహించినది. ఒకటి ఉత్తర భారతమున, రెండవది దక్షిణ భారతమున. ఇంచుమించు 11 వ శతాబ్దములోనే ఢిల్లీ పరిసరాలలో మాట్లాడే భాషలలో అరబ్బీ, పారసీ శబ్దములు దొరలి ఖడీబోలి అనే భాష అవతరించినది. మొట్టమొదలు పంజాబీ భాషా ప్రభావము అధికంగాపొంది నప్పటికిని క్రమక్రమంగా ఈ భాష ఉర్దూగా అభివృద్ధిచెందినది. జబానె హింద్, జబానె హిందుస్థాని, దక్కని అని కూడ యీ భాషను ప్రాచీన చరిత్రలో ఉల్లేఖించడం జరిగినది. రేఖ్తా లేక హిందీ అనికూడ యీ భాషను పేర్కొనడం జరిగింది. 19 వ

శతాబ్దములో ఉర్దూ శబ్దము భాషా పరంగా ఉపయోగములోనికి వచ్చినది. 14 వ శతాబ్దము నుండి దక్షిణ దేశములో ఉర్దూ గోలకొండ, బీజపూర్ రాజుల ఆదరణలో అభివృద్ధి చెందినది. 15 వ శతాబ్దము నుండి 18 వ శతాబ్దము వరకు దక్షిణ దేశములో ఉర్దూ ఉత్తర భారతపు ఉర్దూకన్న విశిష్టత కలిగియుండెను. భారతీయ జీవితమును, సమాజస్థితిని వర్ణించిన రచనలు దక్కని ఉర్దూలో కొదువలేకుండెను. అంతేగాదు భారతీయ ప్రాచీన గాథలను గూర్చి కొన్ని రచనలు కూడ ఇందులో వెలువడినవి. మనోహర్ మధుమాలతి, పద్మావతి, చంద్రబదన్-ఔర్- మహెయార్, తోతీనామ ఇందులో పేర్కొనదగినవి. సాహిత్యపరంగా ఈ గ్రంథాలు విలువగలవి. ఈ విధంగా ఉత్తర, దక్షిణ భారతాలలో విశిష్టంగా అభివృద్ధి చెందిన ఉర్దూ భాషకు కొన్ని శతాబ్దాల వయస్సు ఉన్నది.

ఉర్దూ శౌరసేని భాషకు అపభ్రంశముగా ఉద్భవించి క్రమక్రమముగా అరబ్బీ, ఫారసీ భాషల ప్రాబల్యముతో పరివర్తన పొందినది. నిజానికి హిందీ, ఉర్దూ భాషలు రెండింటికిని ప్రారంభ దశ ఒక్కటే. అరబ్బీ, ఫారసీ పదాల ఆధిక్యత కలిగి ఫారసీ లిపిలో వ్రాసినది ఉర్దూ. సంస్కృత శబ్దాల ప్రాబ్యలము కలిగి దేవనాగరి లిపిలో వ్రాసినది హిందీ. ఈనాటికిని ప్రేమ్‌చంద్ వంటి రచయితలు వ్రాసిన వాఙ్మయము ఉర్దూ, హిందీ రెండు భాషలలోను ఫారసీ హిందీ రెండు లిపులలోను ప్రచురితమవుతున్నది. ఈనాడు ఉర్దూ సాహిత్యము నాగర లిపిలో ప్రకటితమై విశేష ప్రచారము పొందుట గమనించవలసిన సత్యము. గడచిన శతాబ్దములో ఢిల్లీ సైన్యములో అన్ని ప్రాంతాలవారు, మతాలవారు ఉండిరి. అప్పటి రాజభాషయైన ఫారసీగాని, విద్వాంసుల భాషయైన సంస్కృతము గాని ఈ సైనికులకు తెలియనందువలన వీరిమధ్య వ్యవహార భాషగా ఉర్దూ రూపొందిన దనే సత్యము కూడా మనము గుర్తించ వలెను. అందుచేతనే దీనికి లష్కరి అనే పేరు కూడా కలిగినది.

ఈ విధంగా ఉర్దూభాష భారతదేశ భాషగా ఆవిర్భవించి అభివృద్ధి చెందినట్లు మనకు స్పష్టమవుతున్నది. సాధారణంగా ఉర్దూ భాషపైన కనిపించే ప్రభావాలలో అరబ్బీ, ఫారసీ ప్రభావాలు ముఖ్యమైనవన్న అభిప్రాయము వ్యాపించి ఉన్నది. ఈ అభిప్రాయము చాలామట్టుకు సత్యమే. అయినప్పటికిని తెలుగు వంటి కొన్ని ప్రాంతీయ భాషల పదాలు ఉర్దూలో ప్రవేశించినవి. ఈ పదాలతో పాటు సంస్కృత భాషా శబ్దాలు కూడ ఉర్దూలో మనకు పుష్కలంగా

కనిపిస్తున్నవి. అరబ్బీ, ఫారసీ భాషలు భిన్నమైన భాషా కుటుంబాలకు చెందినవి. ఫారసీ ఆర్య భాషలలో చేరియున్నది. సంస్కృతానికి ఫారసీకి దగ్గరి చుట్టరికము. ఏ మాత్రము స్థూల దృష్టితో పరిశీలించినప్పటికిని సంస్కృత, ఫారసీకాల సన్నిహితత్వము స్పష్టము కాగలదు. ఉర్దూభాష పైన గల ఫారసీ ప్రభావము కూడ సంస్కృత భాషతో ఉర్దూకు గల సంబంధానికి కారణభూతము కావచ్చును.

భారత దేశ చరిత్రలో అనేక దండ యాత్రలు జరిగినవి. ఈ విధంగా దండ యాత్రలు చేసిన వారిలో మహమ్మద్ గజనీ ఒకరు. మహమ్మద్ గజనీలో ఉన్న లోపాలు చరిత్ర మనకు తెలుపుతున్నది. ఆ లోపాలతో పాటు ఒక యోగ్యత కూడ మనకు గోచరిస్తున్నది. భారత దేశముతో తన స్నేహాన్ని ప్రకటించడానికి కాబోలు ఆయన తన రాజముద్రలో సంస్కృత అక్షరాలకు స్థానమిచ్చినట్లు చరిత్ర మనకు తెలుపుతున్నది. ఆయన సమకాలిక విద్వాంసుడైన బెరూని భారత దేశాన్ని గూర్చి ఒక గ్రంథము వ్రాసి భారతీయ గణితశాస్త్రాన్ని, ధర్మ శాస్త్రాన్ని ప్రశంసించి అనేక సంస్కృత గ్రంథాలు ఫారసీలోను, అరబ్బీలోను అనువాదము చేసినట్లు తెలియజేసినాడు. ఇది సంస్కృత భాషా ప్రభావానికి తార్కాణము. ఆ కాలపు పారసీకవుల రచనలో భారతీయశబ్దములు కూడా కొన్ని ఉపయోగించినట్లు మనకు తెలుస్తున్నది. తరువాత మొగలు చక్రవర్తి అయిన అక్బరు కాలములో ఆయన ఆస్థాన విద్వాంసుడు అబుల్ ఫైజీ రామాయణాన్ని భగవద్గీతను ఫారసీలోనికి పరివర్తన చేసినాడు. అక్బరు చక్రవర్తి ప్రోత్సాహమే ఇందుకు తార్కాణము. ఈ దృష్టితో ఉర్దూపైన సంస్కృత భాషా ప్రభావాన్ని కొంత అర్థము చేసుకోవలసి ఉండును.

ఒక్కమారు ఉర్దూ శబ్దజాలాన్ని జాగ్రత్తగా పరిశీలించండి. ఎన్ని శబ్దాలు సంస్కృతము నుండి చేరినవో మనకు స్పష్టమవుతుంది. కొన్ని క్రియలను మొదలు పేర్కొన వచ్చును. సంస్కృతములో ఖేలన నుండి ఖేల్నా అయినది. చలతి చల్నా అయినది. ధుందతి ధూండ్నా, కరణ కర్నా అయినది. శ్యాలక అనే సంస్కృత పదము ఉర్దూలో సాలా అని ఉపయోగిస్తున్నాం. అగ్నిని ఆగ్ అని అంటున్నాం. మాతృ అనే సంస్కృత పదాన్ని మాదర్ అని (మా), భ్రాతృ అనే సంస్కృత పదాన్ని బిరాదర్ (భాయి), పితృ అనే సంస్కృత పదాన్ని పిదర్ (బాపు) అని ఒకే అర్థములో వాడుతున్నాం. పండు అనే పదార్థానికి సంస్కృతములో ఫల, ఉర్దూలో ఫల్. జల్ అనగా నీరు. సంస్కృతములో కూడా

నీరు. ఉర్దూలో కూడ అదే అర్థములో వాడుతున్నాం. సుపుత్ర అనే సంస్కృత శబ్దానికి సుపూత్ అని ఉర్దూలో అంటున్నాం. దేవర అనే సంస్కృత పదానికి (భర్త సోదరుడు) ఉరూలో కూడ దేవర్ అని అంటున్నాం. శ్వశుర అనే మాటకు (పిల్లనిచ్చిన మామ) సుసర్ అనే మాటను ఉర్దూలో ఉపయోగిస్తున్నాం. సంస్కృతంలో సదా అనే మాటకు ఉర్దూలో అదే మాటను ఉపయోగిస్తున్నాం. ఈ మాటలన్నీ ఉదాహరణలు మాత్రమే. ఇటువంటివి. మరెన్నింటినో పేర్కొన వచ్చును. ఉర్దూ భాషపైన సంస్కృత ప్రభావానికి ఉదాహరణలే సమానార్థకాలైన ఈ శబ్దజాలము.

ఫారసీ భాషలో జరిగిన సంస్కృతానువాదాలను గూర్చి కొంత ప్రస్తావించినాను. భారతదేశ భాషలలో ఒకటై వికాసము పొందిన ఉర్దూ భాషలో కూడ సంస్కృత భాషనుండి కొన్ని గ్రంథాలు అనువాదము పొందినవి. కాళిదాసు కృతియైన విక్రమోర్వశీయనాటకము ఉర్దూ అనువాదము 1907 వ సంవత్సరములో ఆగ్రాలో ప్రకటితమైనది. అనువాదకర్త మహమ్మద్ అజీజ్ మీర్జా అనే విద్వాంసుడు. ఈనాటకానికి ఆయన ఒక విలువైన పీఠికను వ్రాసి అందులో సంస్కృత నాటక పరిణామాన్ని సమీక్షించినాడు. ఇప్పుడు ఈ గ్రంథము ప్రతులు దొరకడం లేదు. ఇటీవలనే హైదరాబాదులో అబుల్ కలామ్ రిసెర్చి ఇన్స్టిట్యూట్ వారు ఈ పీఠికను మాత్రము ప్రకటించినారు. యోగవాశిష్టాన్ని సంస్కృతము నుండి ఉర్దూలోనికి సాధురాం ప్రసాద్ అనువాదము చేసినారు. యజుర్వేదము నవీంద్రగుప్త జహంగీర్ పూరి అనే విద్వాంసుడు ఉర్దూలో అనువాదము చేసినాడు. మున్షీరాం అనే మహాశయుడు ఋగ్వేదమును ఉర్దూలో అనువదించెను. దోమకొండ సంస్థానాధీశ్వరులైన రాజారాజేశ్వరరావు రామాయణ, మహాభారతములను ఉర్దూలోనికి అనువదించిరి. హైదరాబాదు వాస్తవ్యులైన వైద్రాయ్ వహిమి అనే కవీశ్వరుడు భగవద్గీతను ఉర్దూలో పద్యరూపముగా అనువాదము చేసినాడు. రాజ తరంగిణి కావ్యాన్ని ఠాకూర్ అచల్‌చంద్ అనే పండితుడు సమగ్రంగా ఉర్దూ భాషలో వ్రాసినాడు. దయానంద సరస్వతి అనేక వైదిక గ్రంథాలను హిందీలోనికి అనువాదము చేయగా, రామచందర్ ప్రభృతులైన ఆర్య సమాజ పండితు లెందరో సంస్కృతభాషలోని ఉత్తమ మత గ్రంథాలు ఉర్దూలోనికి పరివర్తనము చేసినారు. ఈ విధంగా ఉర్దూలోనికి వచ్చిన సంస్కృత గ్రంథాలను గూర్చి సమగ్రమైన సమీక్ష జరుగవలసి ఉంటుంది.

ఒక ప్రత్యేక మతము వారు ఉర్దూను మాత్ర భాషగా ఎన్నుకొని మాట్లాడినప్పటికిని ఆ మతానికి సంబంధించని వారెందరో ఉర్దూ భాషా వికాసానికి తోడ్పడి అనేక గ్రంథాలు రచించినారు. వీరిలో కొందరిని మనము పేర్కొన వచ్చును. ప్రేమ్‌చంద్, బ్రిజ్‌నారాయణ్ చక్‌బస్త్, కిషన్‌చంద్, ఉపేంద్రనాథ్, దేవేంద్ర సత్యార్థి, రాజేంద్రసింగ్, ఫిరాఖ్ గోరఖ్‌పూరి మొదలైనవారు వీరిలో ముఖ్యులు. వీరందరి రచనలలోను సంస్కృత భాషా ప్రభావము గోచరిస్తున్నది. ఫిరాఖ్ గోరఖ్‌పూరీ గారు జ్ఞానపీఠ్ బహుమతి గ్రహీతలు కూడా.

ఇప్పటి వరకు మనము ఉర్దూభాషలో వచ్చిన సంస్కృత శబ్దజాలాన్ని గూర్చి, ఉర్దూ భాషలో అనువాదాన్ని పొందిన సంస్కృత గ్రంథ సముదాయాన్ని గూర్చి కొంత మాట్లాడుకున్నాం. అయితే ఈ సమీక్ష స్థాలీపులాకన్యాయము వంటిదే. ఈ విషయమై ఇంకను ఎక్కువ పరిశీలన జరుగవలసి ఉన్నది. ముగింపుగా ఒక మాట కూడా చెప్పవలసి ఉన్నది. భాషాపరంగా సంస్కృత శబ్దజాలం ఉర్దూ వాఙ్మయములో మనకు పుష్కలంగా కనుపించినప్పటికిని సాహిత్య పరంగా తగినంత కృషి జరుగ లేదేమో అనిపిస్తున్నది. సంస్కృత సాహిత్య గ్రంథాలు తగినన్ని ఉర్దూభాషలోరాలేదు దేశభాష సాహిత్యాలపైన ఉర్దూ ఫారసీ సాహిత్యాల ప్రభావము ఎంతపడినదో సంస్కృత సాహిత్య ప్రభావము ఉర్దూ సాహిత్యము పైన అంతగా పడలేదని కూడా ఈ సందర్భంలో చెప్పితే అంత అతిశయోక్తి కాజాలదు.

(రేడియో ప్రసంగం 13-5-77)

ఉర్దూ భాషకు సేవచేసిన తెలుగువారు

భారతదేశములోని అనేక భాషలలో హిందీ, ఉర్దూ భాషలు అక్కచెల్లెండ్ల వంటివి. ఉర్దూ అనగా సైన్యము అని అర్థము. పంజాబు, సింధు, ఢిల్లీ మొదలైన ప్రాంతాలలో మన దేశములోని వివిధ భాషలు మాట్లాడే సైనికులు కలుసుకున్నప్పుడు వారు పరస్పరం అవగాహన చేసుకొనడానికి అనువుగా రూపొందిన భాషకు మొదట "లష్కర్" అని పేరు కలిగినది. లష్కర్ అనగా సైన్యము. తుర్కీ, అరబ్బీ, ఫారసీ భాషలతోపాటు పంజాబు, సింధు, ఢిల్లీ ప్రాంతాలలో వ్యవహరించే ప్రాకృత భాషలనుండి ఉద్భవించిన శబ్దజాలము సమ్మిళితమై రూపొందిన భాషకు లష్కరి అని పేరు కలిగినది. ఇది క్రమక్రమంగా రెండు పాయలుగా చీలిపోయి హిందీ, ఉర్దూ అనే భాషలు ప్రచారములోనికి వచ్చినవి. హిందీపైన సంస్కృత ప్రాకృతాల ప్రభావము హెచ్చుగా ఉంటే; ఉర్దూ పైన అరబ్బీ, ఫారసీల ప్రభావము హెచ్చుగా కనిపిస్తున్నది. ఫారసీ సంస్కృతములు మిక్కిలి సన్నిహితమైన భాషలని వీని శబ్దజాలము నిరూపిస్తున్నది. అందుచేత ఉర్దూమీద కనిపించే ఫారసీ ప్రభావం వెనక సంస్కృతాన్ని కూడా మనము పోల్చుకోవచ్చును.

హిందీ, ఉర్దూ భాషలు భారతదేశంలోని అన్ని ప్రాంతాలలో అత్యధిక సంఖ్యాకులైన ప్రజలు కొద్దిగనో, గొప్పగనో అర్థం చేసుకునే భాషలు. మన తెలుగు సీమను మొదలు బహమనీ, తరువాత గోలకొండ ఆ పిమ్మట ఆసఫ్‌జాహీ వంశీయులు పరిపాలించినారని చరిత్ర మనకు తెలుపుతున్నది. ఈ మూడు వంశాల పరిపాలకులు ఫారసీ భాషను రాజభాషగా ఆదరించి నందువలనా, వీరిలో ఆసఫ్‌జాహీ వంశీయుల కాలంలో ఉర్దూను రాజ భాషగా ప్రవేశపెట్టి నందువలనా, తెలుగు దేశానికి ఉర్దూ ఫారసీలతో కొన్ని నూర్ల సంవత్సరాల పరిచయ మేర్పడినది. తత్ఫలితంగా ఉర్దూ భాషా వికాసానికి తెలుగు వారు చాలా మంది - వారి మాతృ భాష ఉర్దూ కాక పోయినప్పటికిని - కృషి చేయడం జరిగినది.

ఉత్తర భారత దేశంలో ఉర్దూ మాతృ భాష కాని వారు చాలా మంది ఉర్దూలో వ్రాసినారు. హిందీ, ఉర్దూ భాషల మధ్య దగ్గరి చుట్టరికం ఇందుకు

తోడ్పడినది. మున్షీ ప్రేమ్‌చంద్ హిందీ సాహిత్యానికి, ఉర్దూ సాహిత్యానికి సమానంగా ఆదరణీయుడు. ఆయన కథలు పారసీ లిపిలో వ్రాస్తే ఉర్దూ; నాగర లిపిలో వ్రాస్తే హిందే - ఇదే విధంగా ఉర్దూ కవుల రచనలు నాగరలిపిలో ప్రకటితమై జనాదరణ పొందుతున్నవి. ఇది ప్రత్యేకంగా గమనించదగిన విషయము. సుప్రసిద్ధ కథానికా రచయిత కిషన్‌చంద్, సుప్రసిద్ధ కవీశ్వరుడు బ్రిజ్‌నారాయణ్ చెక్‌బస్త్ ఉర్దూ భాషా వికాసానికి కృషి చేసిన సాహితీ పరులు. ఫిరాఖ్ గోఖ్‌పూరి ఉర్దూలో అనేక రచనలు కావించి కేంద్ర సాహిత్య అకాడమి, జ్ఞాన పీఠాల బహుమతులను పొంది ఉర్దూ కవులలో అగ్రస్థానాన్ని అలంకరించినారు. స్వర్గీయ తేజ్ బహదూర్ స్రపు పారసీ, ఉర్దూ భాషలలో పండితులై ఉర్దూలో మంచి రచయితగా పేరు సంపాదించిరి. ఇటువంటి ఉదాహరణలెన్నో ఈయ వచ్చును.

దక్షిణ దేశంలో ఉర్దూ భాషతో అందరికన్న ఎక్కువ సంబంధము కలవారు తెలుగు వారని ఇంతకు ముందు చెప్పి అందుకుగల కారణాలను కూడా వివరించినాను. రాజకీయ కారణాలవలన పారసీ, ఉర్దూ భాషలు తెలుగు సీమలో బాగా ప్రచారం పొంది కొన్ని పదాలు శ్రీనాథుని కాలం నుండియే తెలుగు కావ్యాలలో కనిపిస్తున్నవి. ఉర్దూ, పారసీ భాషలలో నిష్ణాతులైన తెలుగు వారు చాలా మంది కొన్ని ఉర్దూ గ్రంథాలను తెనిగించి, కొన్ని కవితలను ఆంధ్రీకరించి వానిలోని విశిష్టతను తెలుగు పాఠకులకు పరిచయం చేసినారు. అదే విధంగా ఉర్దూలో కూడా వ్యాసాలు, గ్రంథాలు వ్రాసి ఉర్దూ భాషా వికాసానికి తోడ్పడిన వారు, తెలుగు దేశంలో తగినంత మంది మనకు కనిపిస్తున్నారు. ఈ విధంగా తెలుగు వారు సృష్టించిన ఉర్దూ వాఙ్మయంలో నిఘంటువులు, శాస్త్రీయ విజ్ఞానం, సారస్వత విమర్శలు, కవితలు, పత్రికలు, కథానికలు మొదలైన ప్రక్రియలు చేరి ఉన్నవి. అయితే ఈ వాఙ్మయము చాలామట్టుకు అముద్రితము. ప్రకటితమైన గ్రంథాల సంఖ్య కొంత తక్కువ అనియే చెప్పవచ్చును.

తెలంగాణా ప్రాంతములో నిజాం ప్రభువుకు సామంతులుగా ఉండి పరిమితమైన అధికారాలతో కొన్ని ప్రాంతాలను పరిపాలించిన సంస్థానాధీశ్వరులు మనకు కనిపిస్తున్నారు. ఈ సంస్థానాధీశ్వరులు కొందరు తెలుగు సంస్కృత భాషలతో పాటు అరబ్బీ, పారసీ, ఉర్దూ భాషలను కూడా ఆదరించినారు. ఈ సంస్థానాధీశ్వరులలో కొందరు ఉర్దూ భాషలో రచనలను కూడా కావించినారు.

వీరిలో దోమకొండ సంస్థానాధిపతులైన స్వర్గీయ రాజారాజేశ్వరరావుగారిని ప్రత్యేకంగా పేర్కొనవలసి యున్నది. వీరు సుమారు నలుబది గ్రంథాలను ఉర్దూకో వ్రాసినట్లు తెలుస్తున్నది. వీరికి నిఘంటు రచనతో ఆసక్తి మెండుగా ఉన్నట్లు కూడా తెలుస్తున్నది. 1. ఉర్దూ ఫారసీ నిఘంటువు 2. ఫారసీ, ఉర్దూ నిఘంటువు 3. ఉర్దూ, అరబ్బీ, ఫారసీ నిఘంటువు 4. అరబ్బీ, ఉర్దూ నిఘంటువు 5. హిందీ, ఉర్దూ నిఘంటువు మొదలైన అనేక నిఘంటువులను ఆయన సిద్ధము చేసినారు. ఈ నిఘంటువులు 1895 - 1935 ల మధ్య ప్రకటితమైనవి. ఇవిగాక బహు భాషా నిఘంటువునొక దానిని వీరు ప్రారంభించి అందులో కొన్ని లక్షల పదాలను చేర్చినారు. కాని వీరి జీవితకాలంలో ఈ నిఘంటువు పూర్తి కాలేక పోయినది. ఉర్దూ, అరబ్బీ, ఫారసీ, సంస్కృతాంగ్ల భాషలలోని సమానార్థక పదాలను చేర్చిన నిఘంటువొక దానిని 1887 లో గద్వాల మహారాణిగారు ప్రకటింపగా మరొక నిఘంటువును 1889 లో విజయనగర సంస్థానాధిపతులైన ఆనందగజపతిగారు అచ్చు వేయించినారు. నిఘంటువులేకాక కొన్ని సంకలన గ్రంథాలను కూడా ప్రకటించిన దోమకొండ సంస్థానాధిపతులు రాజేశ్వరరావుగారు రామాయణ, భారతాలను కూడా ఉర్దూలో పరివర్తించి తమ జీవిత కాలంలోనే ప్రకటించినారు. వీనితో పాటు మరికొన్ని శాస్త్ర గ్రంథాలను కూడ వారు ప్రకటించి ఉండిరి. ఉర్దూలో రాజేశ్వరరావుగారి రచనా వ్యాసంగానికి మహారాజా కిషన్ ప్రసాద్ గారి ప్రోత్సాహము లభించినట్టు తెలుస్తున్నది. ఉర్దూ కావ్యములలో చివరన వీరు "అస్గర్" అను కావ్యనామమును వ్రాసికొనిరి.

ఇదే సందర్భంలో మరికొన్ని నిఘంటువులను గూర్చి ప్రసంగించవలసి ఉన్నది. తాటికొండ తిమ్మారెడ్డి అనే విద్వాంసుడు 1910 లో ఉర్దూ - తెనుగు నిఘంటువు నొక దానిని సిద్ధం చేసి ప్రకటించినారు. ఆ రోజులలో ఉర్దూ రాజ భాషగా ఉండినందువలన ఇటువంటి నిఘంటువులు అవసరం ఎక్కువగా ఉండెను. ఐతమురాజు కొండలరావుగారు సంస్కృతము, తెలుగు, పారసీ, అరబ్బీ, ఉర్దూ ఇంగ్లీషులలో ప్రవీణులు. 1920-40 ల మధ్య వారు వరంగల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయునిగా పని చేసినారు. వీరు రెండు ఉత్తమమైన నిఘంటువులను సిద్ధము చేసి ప్రకటించినారు. ఇందులో ఒకటి ఉర్దూ - తెలుగు, రెండవది తెలుగు - ఉర్దూ నిఘంటువు. 1962 లో హైదరాబాదులోని అంజుమన్ తరక్కీ ఉర్దూ సంస్థ ఉర్దూ - తెలుగు, తెలుగు - ఉర్దూలకు సంబంధించిన రెండు నిఘంటువులను

ప్రకటించినది. ఈ రెండు నిఘంటువులకు డా॥ బి. రామరాజుగారు, డా॥ గోపాల కృష్ణారావుగారు సంపాదకులుగా పనిచేసినారు.

సృజనాత్మకమైన రచనలను ఉర్దూ భాషలో చేసిన తెలుగు వారు తగినంత మంది మనకు కనిపిస్తున్నారు. హైదరాబాదు నగరములోనే గాక అనేక ప్రాంతాలలో జరిగిన అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనాలలో (ముషాయరాలలో) పాల్గొని ప్రథమశ్రేణి ఉర్దూ కవులుగా ప్రఖ్యాతి గాంచిన వారు స్వర్గీయ రాఘవేందర్ రావు "జజ్బ్" వీరు వ్రాసిన రుబాయీలను స్వతంత్ర రచనలను స్వర్గీయ "అమ్జద్" వంటి విద్వాంసులు, రచయితలు హర్షించినారు. వీరు భర్తృహరి సుభాషితాలను మిక్కిలి రసవంతంగా ఉర్దూలోనికి అనువదింపగా ఆ గ్రంథాన్ని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రకటించినది. ఈ విధంగా పేర్కొనదగిన కవులలో స్వర్గీయ ఎ. నారాయణరావు ముఖ్యులు. వీరి కావ్యనామము "ఫాష్", స్వర్గీయ శ్రీ యం. శ్రీనివాసా చార్యులు "నిజామి" అనే కావ్యనామముతో అనేక కవితలు వ్రాసి సభలలో చదివి మెప్పు పొందినారు. ఈ శ్రేణిలో చెందిన వారే స్వర్గీయ సురపురం వేంకటరంగాచార్యులు ఇంకను ఉర్దూలో పద్యాలు, గేయాలను వ్రాసినవారు చాలా మంది మనకు కనిపిస్తున్నారు. వీరిలో కాళోజి రామేశ్వరరావు గారిని ప్రత్యేకంగా పేర్కొనవలసి ఉన్నది. వీరు ఉత్తమ శ్రేణికి చెందిన ఉర్దూ కవులు.

ఉర్దూలో తెలుగు వారు చాలా మంది వ్యాసాలను వ్రాసి, పత్రికలను నిర్వహించి గణనీయమైన కృషి గావించినారు. స్వర్గీయ ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావుగారు తెలుగు దేశానికి, తెలుగు సంస్కృతికి చేసిన సేవ అందరికి తెలిసినదే. కాని వారు ఉర్దూలో మంచి రచయితలన్న సత్యం అందరికి తెలియక పోవచ్చును. ముషీరె దక్కన్ అనే దిన పత్రికకు అనేక సంవత్సరాలు వారు సంపాదకీయాలను వ్రాసినారు. ఉర్దూలో వారి రచన నిర్దుష్టమైనది. ప్రేమ్‌చంద్ కథలను తెనిగించిన వారిలో మాడపాటి హనుమంతరావుగారు అగ్రగణ్యులు. అనేక సంవత్సరాలు రయ్యత్ అనే ఉర్దూ పత్రికను కొంత కాలం వార పత్రికగను, మరికొంత కాలం దిన పత్రికగను నిర్వహించినవారు స్వర్గీయ మందుముల నరసింగరావుగారు. ఆనాటి తెలంగాణ నాయకులలో ఒకరైనవారు; ఉర్దూలో ఉత్తమశ్రేణికి చెందిన రచయితలు. ఉర్దూలో వీరిశైలి మిక్కిలి శక్తి వంతమైనది. వారు వ్రాసిన సంపాదకీయాలు జాతీయ భావ ప్రబోధకాలు,

ఆనాటి కృష్ణా పత్రిక తెలుగు సంపాదకీయాల వంటివే ఉర్దూలో నరసింగరావు గారి రయ్యత్ సంపాదకీయాలు. నరసింగరావు గారితో కలిసి కొంత కాలం పని చేసిన శ్రీబడాల శ్రీనివాసరావు గారు. ఉర్దూలో మంచిరచయితలు. కొన్ని సంవత్సరాలు "రహ్నుమా" అనే ఒక వార పత్రికను కూడా వీరు నడిపినారు.

ఆరోజులలో ఉర్దూ పరిపాలనా భాషగాను, న్యాయ స్థానాల భాషగాను ఉన్నందువలన తెలుగు న్యాయవాదులనేకులు ఉర్దూలో న్యాయశాస్త్రానికి సంబంధించిన విషయాలను గూర్చి వ్యాసాలను, గ్రంథాలను వ్రాసినారు. వీరిలో మాడపాటి హనుమంతరావు గారితో పాటు కొండా వెంకటరంగారెడ్డి గారిని కూడా పేర్కొనవలెను.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి పక్షాన సుమతి - వేమన శతకాలకు, భాస్కర శతకానికి ఉర్దూ అనువాదాలు ప్రకటితమైనవి. ఈ అనువాదాలు మంచి శైలిలో చేసిన వారు శ్రీ యం. రామప్ప గారు, శ్రీ గోపాల కృష్ణారావుగారు. తెలుగు కథానికలను కొన్నింటిని డా॥ దాశరథిగారి చేత అనువాదం చేయించి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రకటించినది. డా॥ నారాయణరెడ్డి గారు తమ గేయాలలో కొన్నింటిని ఉర్దూలో స్వయంగా పరివర్తన చేసి ఉర్దూ భాషా ప్రియుల చేత ప్రశంసల పొందినారు. అంజుమనే తరక్కీ ఉర్దూ పక్షాన తెలుగు సాహిత్య చరిత్ర ఉర్దూలో ప్రకటితమైనది. డా॥ జీనత్ సాజిదాతో పాటు యీ ప్రసంగకర్త ఆ గ్రంధాన్ని అంజుమనె తరక్కీ ఉర్దూ కోరికపైన రచించడం జరిగినది.

ఇంకను తెలుగు భాషకు, సాహిత్యానికి సంబంధించిన అనేక విషయాలపై ఉర్దూ పత్రికలలో తెలుగు వారు వ్రాసిన వ్యాసాలు ప్రకటితమైనవి. నేషనల్ బుక్ట్రస్ట్ వారు తెలుగు కథలను కొన్నింటిని డా॥ గోపాల కృష్ణారావు గారి చేత అనువాదము చేయించినారు.

ఈ విధంగా ఉర్దూ, ఫారసీ భాషలలో ప్రవీణులైన తెలుగు వారు చాలా మంది ఉర్దూ సాహిత్య వికాసానికి కృషి చేసినారు. ఈ కృషి అన్ని సాహిత్య ప్రక్రియలలో కనిపిస్తున్నది. ప్రత్యేక మతానికి ఉర్దూ భాషపైన గుత్తా అధికారం లేదని ఇందువలన స్పష్టమవుతున్నది. ఈ ప్రసంగములో స్థాలీపులాకన్యాయంగా మాత్రమే రచయితలను పేర్కొనడం జరిగింది. సమగ్ర పరిశీలన యీ మార్గములో జరుగవలసి ఉంటుంది. అట్లు జరిగినప్పుడు ఉర్దూ భాషాభివృద్ధికై తోడ్పడిన వారెందరినో రచయితలను మనము గుర్తించవచ్చును.

(రేడియో ప్రసంగం 14-10-77)

తెలుగు సాహిత్యానికి మహమ్మదీయుల సేవ

భిన్న మతాలు మానవునికి మానవునికీ మధ్య అడ్డు గోడలు కావచ్చును. భిన్న రాజకీయాలు విచ్ఛిన్నకర శక్తులను ప్రోత్సహించే ప్రమాదము ఉన్నది. కాని సాహిత్యము మానవునికి మానవునికీ మధ్య సుహృద్భావాన్ని పెంపొందించే మహత్తరమైన సాధనమని చెప్పితే అతిశయోక్తి కాదు. ఏ భాషలో వ్రాసినా ఏ లిపిలో వ్రాసినా నిజమైన సాహిత్యం విశ్వశ్రేయస్కరమని చెప్పవలెను. ప్రపంచములోని అనేక సాహిత్య చరిత్రలవలె తెలుగు సాహిత్య చరిత్ర కూడ యీ సత్యాన్ని ప్రతి పాదిస్తున్నది.

భారతీయ భాషలలో తెలుగుకు రెండవ స్థానము. తెలుగు భాష తీయనిది, తెలుగు లిపి అందమైనది. తెలుగు వర్ణమాల సమగ్రమైనది. తెలుగు భాషకు ఇటాలియన్ ఆఫ్ ది యీస్ట్ (ప్రాచ్య ఖండపు ఇటలీ భాష) అని ప్రఖ్యాతి ఉన్నది. ఇదంతా తెలుగు సాహిత్యం మతానికి, ప్రాంతానికి అతీతంగా అభివృద్ధి చెందినదనే సత్యాన్ని నిరూపిస్తున్నది. ఆంధ్రేతర ప్రాంతములోని తంజావూరు, మధుర ప్రాంతాలు తెలుగు సరస్వతికి ఆట పట్లుగా ఉండేవి. ఈ రాజ్యాలను పాలించిన వారు కూడ మహారాష్ట్రము మాట్లాడే ఆంధ్రేతరులని మనము గమనించవలసి యున్నది. ఆధునిక కాలంలో బ్రౌన్ ప్రభృతులైన ప్రాచ్య విద్వాంసులు తెలుగు భాషాభివృద్ధికి, సాహిత్య వికాసానికి తోడ్పడి చరిత్రాత్మకమైన కృషిచేసినారు. జె.బి.ఎస్. హాల్డేన్ వంటి మేధావి తెలుగు భాషను గొప్పదిగా పేర్కొన్నారు. క్రైస్తవులెందరో తెలుగు సాహిత్యం యొక్క పెంపు సొంపులకు కారణ భూతులైనారు. మతపరంగా, సాహిత్య పరంగా తెలుగులో క్రైస్తవ మతాను యాయులు అనేక గ్రంథాలను వ్రాసి గణనీయమైన వాఙ్మయాన్ని సృజించినారు. ఈ వాఙ్మయాన్ని సమీక్షించడానికి ప్రయత్నిస్తే అది ఒక పెద్ద గ్రంథమే కాగలదు.

తెలుగు భాషతో కొన్ని నూర్ల సంవత్సరముల నుండి ఇస్లాంమతాను యాయులకు దగ్గరి సంబంధాలు ఉండినవి. తెలుగు కవులను పోషించి, ఆదరించి

తెలుగులో రచనలను గావించిన మహమ్మదీయులసంఖ్య తగినంతగా ఉన్నదని మనముందు సాహిత్యపరమైన ఆధారాలు ఉన్నవి. ఈ కృషిని ఒకసారి సింహావలోకనం చేయడం మిక్కిలి అవసరమని చెప్పక తప్పదు.

తెలుగు దేశాన్ని పరిపాలించిన రాజ వంశాలలో గోలకొండ కుతుబ్‌షాహీ వంశం ప్రసిద్ధమైనది. కాకతీయుల తరువాత సకలాంధ్ర దేశాన్ని పరిపాలించిన గౌరవము కుతుబ్‌షాహీలకు దక్కుతున్నది. కుతుబ్‌షాహీ రాజులు ఇస్లాం మతానుయాయులు అయినప్పటికిని అత్యధిక సంఖ్యాకులైన ప్రజలు హిందూ మతావలంబకులైనందున వారు మతసహనంతో రాజ్యాన్ని నడిపి ప్రజల ఆదరాభిమానాలకు పాత్రులైనారు. ఈ విధంగా జాతీయ సమైక్యతకు కుతుబ్‌షాహీలు మార్గదర్శకులైనారు. అ రోజులలో రాజ-భాష ఫారసీ. వారు జారీచేసిన సనదులన్నీ ఫారసీలోనే వ్రాయించినప్పటికినీ వాని అనువాదాలను తెలుగులో కూడ విడుదల చేసేవారు, ఈ విధంగా ప్రజల భాషయైన తెలుగుకు రాజ్య పరిపాలనలో కుతుబ్‌షాహీలు ప్రాధాన్యము యిచ్చినారు. స్వర్గీయ సురవరం ప్రతాపరెడ్డిగారు కుతుబ్‌షాహీల ఆంధ్ర భాషాపోషణం అనే వ్యాసంలో యీ సత్యాన్ని సోదాహరణంగా నిరూపించినారు.

కుతుబ్‌షాహీ వంశీయులలో ఇబ్రహీం కుతుబ్‌షా ఆంధ్ర సారస్వతములో సుస్థిరమైన కీర్తిని సంపాదించుకున్న రసికుడు. ఆయన తండియైన కులీ కుతుబ్‌షా మరణానంతరం ఇబ్రహీం కుతుబ్‌షా విజయనగరంలో కొంత కాలం అజ్ఞాత వాసం చేయవలసిన పరిస్థితులు తటస్థించినవి. ఆ కాలంలో ఆయనకు తెలుగు సాహిత్యంతోను, తెలుగు కవులతోను గాఢమైన సంబంధము యేర్పడినది. ఈ అజ్ఞాతవాసం పూర్తికాగనే ఆయన గోలకొండ సింహాసనాన్ని అధిష్ఠించి తెలుగురాజుగా కవి పండితులను ఆదరించినాడు. తెలుగు కవుల నాలుకలమీద ఇబ్రహీం ఇభరాముడై, ఆంధ్రావళికి అభిరాముడైనాడు. అద్దంకి గంగాధర కవి వ్రాసిన తపతీ సంవరణోపాఖ్యానాన్ని ఇబ్రహీం కుతుబ్‌షాకు అంకితమిచ్చినాడు. ఇబ్రహీం కొలువులో సమస్త వేద, శాస్త్ర పారంగతులైన విద్వాంసులు, బహు భాషలలో ప్రవీణులైన కవి,పండితులుండేవారు. ఈయన కొలువులో అనేక ముషాయిరాలు జరిగేవట. ఈయనను గూర్చిన చాటువులు ఎన్నో ఉన్నవి. ఈయన కొలువులో ఉన్నతాధికారియైన అమీన్‌ఖాన్ తెలుగు భాషా పోషకుడు- మొట్టమొదటిసారి అచ్చతెనుగులో వ్రాసిన యయాతి చరిత్రము

అనే కావ్యాన్ని కృతికర్త పొన్నగంటి తెలగన్న ఈ అమీన్ ఖాన్‌కు అంకితం చేసినాడు. ఒక కవి ఇబ్రహీంను గూర్చి

ఏడు కులాద్రులెక్కి వెసనేడు పయోధులు దాటి లీలమై
నేడవు దీవులందిరిగి యేడుగడన్ విహరించి కీర్తి యీ
రేడు జగంబులన్ వెలయ నేలిన మల్కిభరామ చంద్రుడే
యేడవ చక్రవర్తి పదునేడవరాజు ధరాతలమ్మునన్.

అని చెప్పిన పద్యము సుప్రసిద్ధము. ఇంకా తెలుగు కవులెందరో గోలకొండ రాజుల ఆదరాభిమానాలను పుష్కలంగా అనుభవించినారు. వైజయంతీ విలాసం వ్రాసిన సారంగు తమ్మయ్య, సుగ్రీవ విజయం, నిరంకుశోపాఖ్యానం వ్రాసిన కందుకూరి రుద్రకవి, దశరథరాజనందన చరిత్రను రచించిన మరింగంటి సింగరాచార్యులు, రాజనీతి రత్నాకరము అనే పేరుతో పంచ తంత్రాన్ని వ్రాసిన కృష్ణయామాత్యుడు, గోలకొండ రాజుల చేత గౌరవాలు, సన్మానాలు పొందిన కవి పండితులలో పేర్కొనదగినవారు. 1580 వ సంవత్సరంలో ఇబ్రహీం కుతుబ్‌షా మరణించిన తరువాత ఒక కవి పద్యరూపంలో తన శోకాన్ని వెల్లడించినాడు.

రార! విధాత! యోరి వినరా! తగురా! తలకొట్టమారి ని
స్సారపులోభి రాజులను చంపక మల్కిభరామ భూవరున్
చాదు యశోధరున్ సుగుణి చంపితి వర్థుల కేమి దిక్కురా?
చేరినయింత రాజును సృజింపగ నీతరమా వసుంధరన్!

ఆయన తరువాత ఆయన కుమారుడు కులీకుతుబ్‌షా కూడ తన తండ్రి అడుగుజాడలలో నడిచి తెలుగు కవులను ఆదరించినాడు. సారంగు తమ్మయ్య ఈయనకు ఆశ్రితుడు. పద్మపురాణము శివధర్మోత్తరము వంటి గ్రంథాలు రచించిన రాజమల్లారెడ్డి ఈయనకు ఆశ్రితుడు.

ఈవిధంగా తెలుగుకవులతో సన్నిహిత సంబంధాలు కలిగిన గోలకొండ రాజులు స్వయంగా తెలుగులో పద్యాలు వ్రాస్తే వ్రాసి ఉండవచ్చును. మహమ్మద్ కులీ కుతుబ్‌షా తెలుగులో కవిత్వ మల్లినట్లు వాడుక ఉన్నది. అయితే ఆయన రచనలు మనకు లభ్యం కాలేదు. ఉర్దూ, ఫారసీలలో యీయన కవిత్వాన్ని వ్రాసినాడు. "దివాన్" అనే పేరుతో తన కవిత్వాన్ని సంకలనాలుగా

సిద్ధం చేయించినాడు. వీనిలో తన ప్రియురాలైన భాగ్యమతి మీద వ్రాసిన కవిత్వం కూడ చేరియున్నది. ఈయన కవిత్వంలో తెలుగు పదాలు దొరలినట్లు స్వర్గీయ ఆదిరాజు వీరభద్రరావు గారు "కుతుబ్‌షాహీసుల్తానులు-ఆంధ్ర సంస్కృతి" అనే వ్యాసంలో తెలియజేసినారు. ఈ కాలంలో తెలుగు కావ్యాలలో ఉర్దూపదాలు ఎక్కువగా ప్రవేశించినవని వారు తెలిపినారు. గోలకొండ రాజ్యం తరువాత ఆధునిక కాలం వరకు అనేకులు తెలుగులో ప్రావీణ్యం కలిగి రచనలను చేసియుండ వచ్చును. కాని ఏ కారణం వల్లనో మనకు అవి లభ్యం కాలేదు.

ఆధునిక కాలంలో తెలుగులో వ్రాసిన మహమ్మదీయులు తగినంత మంది ఉన్నారు. వీరిలో శ్రీ ఉమర్ అలీషా గారు అగ్రగణ్యులు. 1885 వ సంవత్సరములో జన్మించిన వీరు 1945 జనవరి నెలలో పరలోకగతులైరి. వీరు అరబ్బీ, ఫారసీ, ఇంగ్లీషు, తెలుగు, సంస్కృత భాషలలో ప్రవీణులై తెలుగులో అనేక గ్రంథాలను వ్రాసినారు. రసవంతమైన కవిత్వము చెప్పినారు. కొంతకాలం పార్లమెంటు సభ్యులుగా కూడ వీరుండిరి. వీరు తమ 18వ యేటనే "మణిమాల" అనే పేరుతో ఒక నాటకాన్ని వ్రాయగా సకలాంధ్ర దేశం ఆ నాటకాన్ని ప్రశంసించింది. "ఇరువది యేండ్లు లేని ఉమర్ అలీషా కవియెట్లులయ్యె॥" అని తనను గూర్చి తానే ఒక పర్యాయము చెప్పుకున్నారు. వీరు ఒక సూఫీవేదాంత గ్రంధాన్ని కూడ వ్రాసినారు. ఉమర్‌ఖయామ్‌ను తెలుగులో అనువదించినారు. వీరి తెలుగు శైలి సరళం - సుందరం. ఉమర్ అలీషా గారి తరువాత పేర్కొనదగిన వారు మహమ్మద్ ఖాసీం ఖాన్‌గారు. ఉమర్ అలీషా గారి వలె ఖాసీంఖాన్‌గారు కూడ గోదావరి ప్రాంతంవారే. అయితే ఉమర్ అలీషాగారి వలె గాక వీరికి ఫారసీ, అరబ్బీ భాషలలో పరిచయం తక్కువ. సంస్కృతాంధ్రములలో గొప్ప పాండిత్యము వీరి కుండినది. తెలుగు ఎం. ఏ పట్టభద్రులైన ఖాసీం ఖాన్‌గారు తెలుగులో అనేక విధాలైన ప్రక్రియలలో రచనలను గావించిరి. కథానికలు, కవిత్వము, సాహిత్య విమర్శనము, వీరు సాధించిన వాఙ్మయ ప్రక్రియలు. ఖురానును కూడ వీరు తెనిగించిరి. ఈనాడు కర్నూలు ఉస్మానియా కాలేజీలో తెలుగు అధ్యాపకులుగా నున్న శ్రీ షేఖ్ దావూద్ గారు సంస్కృతాంధ్రములలో మంచి పండితులు, ఉత్తమ రచయితలు, చక్కని వక్తలు. వీరి రచనలలో "పన్నాదాసీ" సూఫీ మత తత్వము'' సుప్రసిద్ధమైనవి. వీరి కవిత్వము నిర్దుష్టము, రసవంతము, శ్రీమతి దౌలత్ బేగం, తెలుగులో మంచి పాండిత్యం కలిగిన

విదుషీమణి. దేవరకొండ వాస్తవ్యులు శ్రీఆజ్మతుల్లా తెలుగులో అనేక కావ్యాలు వ్రాసిన పండితుడు; ప్రాచీన సంప్రదాయానికి చెందినకవి.

షేఖ్ బుడన్ గారు కడపలో న్యాయవాదిగా ఉన్నారు. వీరు తెలుగులో చక్కని కావ్యాలు వ్రాసి ప్రచురించినారు. "ఖుతుబ్‌నామా'' పేరుతో గోలకొండ రాజుల చరిత్రను, ''జలాల్‌నామా'' పేరుతో అక్బరు చరిత్రను వీరు రెండు కావ్యాలుగా వ్రాసినారు. వీరి కవిత్వం స్వర్గీయ విశ్వనాథ సత్యనారాయణ గారి వంటి మహాకవుల ప్రశంసకు పాత్రమైనది. చారిత్రక విషయాలను తీసుకొని రసవంతమైన కావ్యాలను వ్రాయుటలో వీరు సిద్ధహస్తులు. వీరి కవిత్వం ప్రాచీన కవుల ధోరణిని అనుసరించి మిక్కిలి రమణీయంగా ఉంటుంది. ఈ ధోరణిలో కవిత్వం వ్రాసే మరొక కవి శ్రీమహమ్మదలీ గారు. "మమత'', ''హృదయ మాధురి'' అనే రెండు కావ్యాలను వ్రాసి ప్రచురించినారు. అర్థ శాస్త్రంలో ఎం. ఏ పట్టభద్రులైన వీరు ఉన్నతోద్యోగం నిర్వహిస్తూ నిరంతరం తెలుగు సాహిత్యరసాస్వాదనలో నిమగ్నులై ఉంటారు. వీరి శైలి నిర్దుష్టమైనది, గంభీరమైనది.

నూతన కవితారీతులలో ప్రవీణులైన కవులు కూడ కొందరున్నారు. వీరిలో శ్రీ ఇస్మాయిల్ గారిని ప్రత్యేకంగా పేర్కొనవలెను. "చెట్టు నా ఆదర్శం" అనే వీరి ఖండకావ్య సంపుటి తెలుగు భాషలో నూతన రీతులను సంతరించుకొని ప్రముఖాంధ్రకవుల ప్రశంసలను పొందినది. యువకులైన గులాం యాసీన్, మహబూబ్ మొదలైన కవులు తెలుగుభాషలో అత్యంత ఆధునిక పద్ధతులలో మనోహరమైన రచనలను చేస్తున్నారు.

హైదరాబాదులోని అబుల్ కలాం ఆజాద్ ఓరియంటల్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ మహమ్మదీయ విద్వాంసులు వ్రాసిన కొన్ని మత గ్రంథాలను ప్రకటించినది. వీనిలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఖురాన్ వ్యాఖ్యానానికి తెలుగు అనువాదము, సులేమాన్ నద్వీ గారు ప్రవక్తలను గూర్చి చేసిన ఉపన్యాసాల ఆంధ్రానువాదం ముఖ్యమైనవి. ఈ రెండు అనువాదాలు అదీబెఫాజిల్ టి. హెచ్. పీరాన్ నిజామి గారు చేసినారు. శ్రీపీరాన్ నిజామి గారు ఉర్దూ, అరబ్బీ ఫారసీ భాషలలో మంచి పండితులు, ఇంగ్లీషు తెలుగు భాషలలో తగినంత పరిచయం కలిగినవారు. వీరి తెలుగు శైలి సుబోధకమై గహనమైన విషయాలను అందరికీ అర్థమయ్యే పద్ధతిలో వివరించునదిగా ఉన్నది. ఈ శ్రేణికి చెందిన

గ్రంథమే షేక్ మీరాజాన్ గారు వ్రాసిన "సర్వమత సార సంగ్రహం", వేదములు, భగవద్గీత, ఖురాన్, బైబిల్, ధర్మ సూత్రాల నాధారంగా చేసుకొని వ్రాసినదీ గ్రంథము. ఈ గ్రంథకర్తగారు దీనిని సులభమైన శైలిలో వ్రాసినారు. మహమ్మద్ జైనుల్‌అబిదీన్ గారు తెలుగులో మంచి పాండిత్యము కలిగిన రచయిత. వీరు రేడియోలో అనేక ప్రసంగాలు గావించినారు. ఇస్లాం మత సంస్కృతులకు సంబంధించిన అనేక గ్రంథాలు సుబోధకమైన వచన శైలిలో వ్రాసి ప్రకటించినారు.

ఈ విధంగా ఇస్లాం మతానుయాయులు గోలకొండ రాజుల కాలం నుండి యీనాటి వరకు తెలుగులో వివిధ వాఙ్మయ ప్రక్రియలలో సాధన చేసినారు. కవిత్వము, కథానిక, సాహిత్య విమర్శ, మతము మొదలైన ప్రక్రియలకు సంబంధించిన యీ గ్రంథాలు తెలుగు వాఙ్మయములో విశిష్టమైనవని చెప్పవచ్చును. రాశిలో ఎక్కువగ లేక పోయినప్పటికిని గుణములో యీ రచనలు ఉత్తమశ్రేణికి చెందినవి. ఈ ప్రసంగములో నేను పేర్కొనిన వారు కొద్ది మంది, అనగా నాకు తెలిసిన వారు, నాకు తెలియని వారు ఇంకను ఎందరో ఉండవచ్చును. తెలుగు భాషను భిన్న మతాల వారు. భిన్న ప్రాంతాల వారు ఆదరించి అభిమానించిన సత్యానికి యీ రచనలు తార్కాణము.

కులము, పొలిమేర, మతమను గోలబడక
బోయవలె తల్లి పల్లకీ మోయు మాంధ్ర

అని ఆధునిక కవివరేణ్యులు చేసిన ఉద్బోధ మన చెవులలో యీ సందర్భమున ప్రతిధ్వనిస్తుంది.

(రేడియో ప్రసంగం 14-4-78)

నల్లగొండ జిల్లా రచయితల సభలు ప్రారంభోపన్యాసము

సుమారు ఆరు సంవత్సరాలు పై బడ్డవి; నల్లగొండ జిల్లా రచయితల మహాసభలకు అధ్యక్షుడిగా మిమ్ములనందరినీ కలుసుకొని - మళ్లీ ఈ రోజు ఈ సభలను ప్రారంభించే అవకాశం ఇచ్చి నాపైన మీ అవ్యాజానురాగాన్ని చూపించినారు. నల్లగొండ జిల్లా రచయితలతో, కవులతో సాంఘిక, సాంస్కృతిక రంగాలలోని కార్యకర్తలతో నాకుగల అనుబంధమే ఈ బాధ్యత నిర్వహించడానికి నన్ను అంగీకరింపజేసింది. సుమారు ముప్పై సంవత్సరాలుగా నాకు ఈ జిల్లాతోగల స్నేహ సంబంధాలను మరింత బలపరచుకొనడానికి నాకు ఈ అవకాశం ఇచ్చిన మిత్రులకు, కార్యకర్తలకు నా కృతజ్ఞతాభివందనలు.

అన్ని రంగాలలోవలెనే సాహిత్య రంగంలో కూడా ఇంతవరకు జరిగిన ప్రగతిని సమీక్షించుకొని, వస్తున్న పరిణామాలను గుర్తించి, భవిష్యత్కార్యక్రమాన్ని నిర్ణయించుకొనడానికి తాలూకాస్థాయి మొదలుకొని రాష్ట్ర, దేశ స్థాయి వరకు అన్ని స్థాయిలలోను ఇటువంటి సమావేశాలు జరపటం అవసరం. ఇటువంటి కార్యక్రమాలలో భాగమే ఈ జిల్లా స్థాయి రచయితల సభలు. ప్రాంతీయతకు, జాతీయతకు విరోధము వైరుధ్యము ఏమీలేవు. జిల్లా స్థాయి సమావేశాలు కూడా దేశంలో భాగమే గదా! ప్రతి ప్రాంతం సమానంగా అభివృద్ధి చెందినప్పుడే, ప్రతి ప్రాంతీయులు తమ కర్తవ్యాన్ని, బాధ్యతలను గుర్తించి పనిచేసినప్పుడే సమగ్రమైన జాతీయాభివృద్ధి సాధ్యమౌతుంది. ప్రాంతీయత సంకుచిత తత్వంగా మారనంతవరకు, ప్రాంతీయ సభలు ఆ ప్రాంతీయుల వికాసాన్ని జాతీయ వికాసంలోని భాగంగా సింహావలోకనం చేసుకొనడానికే ఉద్దేశించినప్పుడు, వాటి అవసరం ఎంతైనా ఉన్నది. ఈ రోజునుంచి ప్రారంభంకాబోతున్న ఈ సమావేశాలలో, చర్చా గోష్ఠులలో నల్లగొండ జిల్లా రచయితలు ఆధునిక సాహిత్యానికి సంబంధించిన వివిధ విషయాలను చర్చించబోతున్నారు. ప్రస్తుతం సాహితీ రంగంలో మీరు, మీతోటి జిల్లాల రచయితలు ఎదుర్కొంటున్న సమస్యలను కూలంకషంగా చర్చించి రాష్ట్ర రచయితలందరికీ ప్రయోజనకరాలైన సూచనలను అందించగలరని ఆశిస్తున్నాను.

రాష్ట్ర రాజకీయ చరిత్రలోనేకాదు, దేశరాజకీయ చరిత్రలో కూడా నల్లగొండ జిల్లాకు ప్రత్యేకస్థానం ఉన్నది. ఇక్కడ జరిగిన ఉద్యమాలకు ప్రతిస్పందించి, ప్రేరణను పొంది మహాకవులు, రచయితలు అయినవారు తెలుగు దేశంలోనే కాదు యావద్భారత దేశంలోను ఉన్నారు. ముఖ్యంగా ప్రగతి భావాలు గల కవులకు ఈ జిల్లాలో జరిగిన సంఘటనలు ప్రధానవస్తువులైనవి. తెలుగు వారికి చైతన్య స్ఫూర్తినిచ్చిన ప్రాంతమిది. ఇది తెలంగాణాంధ్రోద్యమానికి పట్టుగొమ్మ. ఇక్కడి జనసామన్యం రాచరికపు వ్యవస్థను ఎదిరించి నిలచినారు. శ్రామికులు, కర్షకులు మొదటిసారిగా తలెత్తి నిలుచుకొని కవితలల్లి వీరగానం చేసిన సీమ ఇది. ఇక్కడ పుట్టిన చిగురుగొమ్మైన చేవ.

నల్లగొండజిల్లా ప్రాచీనచరిత్ర తక్కువైనదేమీ కాదు. ముఖ్యంగా సాహిత్య, కళారంగాలలో ఈ జిల్లాకు ప్రాచీనమైన చరిత్ర ఉన్నది. ఇక్కడి పరిపాలకులు స్వయంగా పండితులు, కవి పండిత పోషకులు. 'రసార్ణవ సుధాకరం' మొదలైన లక్షణ గ్రంథాలను రచించి సాహిత్యంతోపాటు అనేక కళలను పోషించినవాడు, సర్వజ్ఞ సింగ భూపాలుడు. రాచకొండ నేలిన మాధవ రావు 'రాఘవీయం' అనే పేరుతో రామాయణానికి స్వయంగా వ్యాఖ్యరచించినాడు.

పరిపాలనావసరాలను బట్టి జిల్లాలఎల్లలు మారుతున్నవి. కాబట్టి కేవలం నేటి పరిపాలనా విభాగాలను యథాతథంగా మనం గ్రహించ నవసరంలేదు. జాను తెనుగును, దేశి సాహిత్యాన్ని తెలుగు దేశంలో నిలిపి సాహిత్యాన్ని జన సామాన్యం దగ్గరకు తీసికొనివెళ్ళడానికి తెలుగు సాహిత్య చరిత్రలో మొదటి సారిగా ప్రయత్నం చేసిన పాల్కురికి సోమన ప్రస్తుతము ఓరుగల్లు జిల్లావాడైనా నిన్నమొన్నటివరకు మీ మండలం వాడు. తన కవిత్వాన్ని రాజుల కివ్వనని చరిత్రలో మొదటిసారిగా రాచరికపు వ్యవస్థను ఎదిరించి నిలచి సామాన్య జీవితాన్ని గడపిన పోతన జన్మస్థలం నిన్నమొన్నటి వరకు ఈ జిల్లాలోనే ఉన్నది. తెలుగు సాహిత్య చరిత్ర ప్రారంభదశనుంచే నల్లగొండ జిల్లా పరిసర ప్రాంత కవులు స్వేచ్ఛా దృక్పథం, సామాజిక చైతన్యం కలవారని చెప్పడానికే వీరిని పేర్కొన్నాను. దేశి ప్రక్రియ అయిన ద్విపద రచనలో మేటి అయిన గౌరన రాచకొండ, దేవరకొండలలో గౌరవాలను పొందినాడు. వీరుకాక చిత్తూరు గంగాధరయ్య, నాగేంద్రకవి, మరింగంటి కవులు తెలుగు సాహిత్య చరిత్రకు కానుకలందించినవారే.

ఆయితే గతాన్ని కీర్తించడం మాత్రమే ప్రస్తుతం నేను చేయ పోవడం లేదు. 'గతకాలము మేలు వచ్చు కాలము కంటెన్' అని నమ్మిన నిరాశావాదిని కాను నేను. కాలం ఒక అవిచ్ఛిన్న ధార. వర్తమానానికి పూర్వ రంగమైన గతాన్ని పరిణామక్రమంలో భాగంగా గుర్తింపజేయడానికే పై విషయాలను ఇక్కడ పేర్కొనడం జరిగింది. వర్తమానం గతం నుంచి పూర్తిగా తెంచుకొని రాలేదు. గతం కొనసాగింపే వర్తమానం. మనిషి ఆధునికుడు కావడం అంటే గతాన్ని పూర్తిగా సమీక్షించుకొని, వర్తమానంలో జరుగుతున్న పరిణామాలను గుర్తిస్తూ సుందర భవిష్యత్తును నిర్మించుకొనడానికి కార్యోన్ముఖుడు కావడమేనని నా ఉద్దేశ్యం.

అత్యంత వేగంతో పరిణామం చెందుతున్న సమాజంలో మనం ఉన్నాం. విజ్ఞానశాస్త్ర ఫలితాలు, పారిశ్రామికీకరణ ఈ వేగాన్ని మరింత పెంచుతున్నవి. ముఖ్యంగా మానవ సంబంధాలను నిలబెట్టే విలువలలో మార్పులు చాలా వచ్చినవి. విజ్ఞాన శాస్త్రం, దూరభారాలను తగ్గించి ప్రపంచాన్ని సంకుచితం చేసింది. ప్రతి వ్యక్తిలో స్వాతంత్ర కాంక్షను పెంచింది. ఒకప్పుడు వెనుకబడ్డారని భావింపబడిన మనుష్యులు, దేశాలు, అన్ని దేశాలవారితో సంబంధాలు ఏర్పడడంవలన వ్యక్తిత్వాన్ని నిలుపుకొని తలెత్తుకొని నిలబడే ప్రయత్నంలో కృతకృత్యతను సాధిస్తున్నారు.స్థానికావసరాలు, ఆర్థికావసరాలు ప్రతిమనిషిని తన గురించి, తన ప్రాంతం గురించి, తన జాతిని గురించి ఎక్కువగా ఆలోచించేటట్లు చేస్తున్నాయి. సాధారణంగా దీన్ని సంకుచిత దృక్పథం క్రింద చిత్రించడం జరుగుతున్నది. కాని నిజానికిది మానవజాతిలో జరుగుతున్న గొప్ప అభివృద్ధి అని చెప్పవలసి ఉన్నది. అయినా ఈ రోజు ప్రతివ్యక్తి సమస్య మరొక వ్యక్తితో, ప్రతి దేశం సమస్య మరొక దేశం సమస్యతో ముడిపడే ఉన్నవి. ప్రతిమనిషీ, ప్రతిసమాజం, ప్రతిజాతి తనకు తాను అభివృద్ధిచెందే ప్రయత్నం చేస్తూనే విశ్వ సౌభ్రాతృత్వానికి భంగం కలగకుండా ప్రవర్తించవచ్చుననే సత్యాన్ని చాటవలసిన అవసరం నేటి ప్రతి రచయితకూ ఉన్నది.

ఇది రచయితల మహాసభ. వేగంగా మారుతున్న సమాజంలో రచయితల కర్తవ్యాన్ని, పాత్రను గురించి పరస్పర అభిప్రాయాలను తెలుసుకొని తగిన నిర్ణయాలు తీసుకొనడానికి రచయితలు సమావేశమైనారు. విజ్ఞాన శాస్త్రం మానవ జీవితాన్ని ఎంత సరళం చేసిందో, అంత సంక్లిష్టం కూడా చేసింది. ఒక

ప్రముఖ రచయిత పేర్కొన్నట్లు మనకంటే మన పూర్వ రచయితలకు వ్రాయడం చాలా సులభం. ఎందుకంటే చాలా నెమ్మదిగా మారుతున్న సమాజాన్ని వారు వర్ణించినారు. కాని ఆధునిక రచయిత బాధ్యతలు, వస్తుపరిధి చాలా గురుతరమైనవి, విస్తృతమైనవి. నిరంతరం మారుతున్న సమాజాన్ని ఆమార్పుని మరింత వేగవంతం చేసేవిధంగా వ్రాయవలసిన బాధ్యత నేటి రచయితపై ఉన్నది. నిన్నటివరకు సంస్కరణలుగా భావింపబడిన విషయాలు నేడు మానవజీవితంలో సాధారణ విషయాలుగా మారినవి. నిన్నటి దురాచారం కన్యాశుల్కం నేడులేదు. కొత్తగా వరకట్నం అనే సమస్య బయలుదేరింది. నేటి రచయిత దీనిని ఎదుర్కొనవలసి ఉన్నది. అట్లే మారుతున్న సమాజంలో ఉత్పన్నం అవుతున్న అనేక సమస్యలు. స్వాతంత్ర్యం వచ్చేవరకు జాతీయత, గతకాలపు వైభవాన్ని చాటడం ద్వారా జనాన్ని ఉద్దీప్తం చెయ్యడం రచనా వస్తువుగా ఉండేది. స్వాతంత్ర్యానంతరం ఇంతవరకూ ప్రస్తుతం నెలకొని ఉన్న సమాజ చిత్రాన్ని బట్టబయలు చేయడం లేకపోతే దాన్ని యథాతథంగా వర్ణించడం జరుగుతున్నది. కాని నేటి రచయిత బాధ్యత అంతకంటే గొప్పది. భిన్నమైనది. చరిత్రలో ఇదివరకెన్నడూ లేని, నిర్మాణావస్థలో ఉన్న, తానుకూడా భాగస్వామి అయిన సమాజాన్ని చిత్రించవలసి ఉన్నది. జరిగిన దానికన్న జరుగవలసిన దాన్ని గురించి చాటి చెప్పవలసి ఉన్నది.

రచయితలు, కవులు భవిష్యత్కార్యక్రమాన్ని నిర్ణయించుకొనేముందు తెలుగు సాహిత్యరంగంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్ని వివిధ సాహిత్య ప్రక్రియలలో తెలుగు రచయితలు సాధించిన అభివృద్ధిని సమీక్షించుకొనవలసి ఉన్నది. తెలుగు కవిత నేడు చాలా ముందంజవేసి ఉన్నది. వివిధ ఉద్యమాల ప్రభావం కవితారంగం పైన ఎక్కువగా కనిపిస్తుంది. అంతేకాదు తెలుగు కవితా రంగంలో వచ్చినన్ని ఉద్యమాలు మరే ఇతర భారతీయ భాషలలోను రాలేదనటం అతిశయోక్తి కాదు. యువకవులెందరో ఈ ఉద్యమాల ప్రభావంవలన ఉత్తమ కవితలను రచించినారు. ముఖ్యంగా తెలంగాణా అత్యాధునిక కవిత్వంలో ముందంజ వేసిందని చెప్పవలసి ఉన్నది. పరిమాణాత్మకంగానే కాదు గుణాత్మకంగా కూడా కవితా రచనలో అభివృద్ధి కనిపిస్తున్నది. అందుకే గత శతాబ్దంలో వచ్చిన తెలుగు కవితా ఖండికలెన్నో సకల భారతీయ భాషలలోనికి రూపాంతరాన్ని పొందగలిగినవి.

కథానికా రంగంలో కూడా తెలుగు దేశం వెనుకబడిలేదు. ఆధునిక కవితకు తెలంగాణం పట్టుకొమ్మైతే, ఆధునిక కథానికకు విశాఖ మండలం పుట్టినిల్లు. శిల్పంలో, పాత్రచిత్రణలో, వాస్తవికతలో తెలుగు కథలు చాలా భారతీయ భాషలలోని కథలతో సమానంగా నిలువగలిగి ఉన్నవి. కొన్ని భాషలలోని కథల కంటే ఉన్నతస్థాయిలో ఉన్నవనికూడా చెప్పవచ్చు. ఉద్దీప్తిని కలిగించడానికి ఆధునిక కవిత సాధనమైతే మనోవికాసాన్ని, స్ఫూర్తిని కలిగించటానికి కథానిక ప్రధాన సాధనం. ప్రచురింపబడుతున్న అన్ని కథానికలు కాకపోయినా (అది సాహిత్యంలోని, ఏ ప్రక్రియలోనూ, సాధ్యంకాదు). స్ఫూర్తినీ, వికాసాన్ని కలిగించే కథానికలు అధిక సంఖ్యలోనే తెలుగులో వస్తున్నవని చెప్పవచ్చును.

ఈ రోజు సాధారణ పాఠకులకు అందుబాటులో ఉండి ఎక్కువ ప్రచారంలో ఉన్న ప్రక్రియ నవల. సమకాలీన సమాజాన్ని అద్దం పట్టి చూపటానికి సామాజిక స్పృహను, వివేచనా శక్తిని పెంచడానికి నవల ప్రధాన సాధనంగా ఉన్నది. మంచి కవిత వ్రాయడంకంటే చెప్పుకోదగ్గ కథానిక వ్రాయడంకంటే ఉత్తమమైన నవల వ్రాయడం కష్టమని నా అభిప్రాయం. కొన్ని తెలుగు నవలలస్థాయి అంత సంతృప్తికరంగా లేదని చెప్పడానికి విచారిస్తున్నాను. ప్రస్తుతం, వార, మాస పత్రికలు సీరియల్‌గా, అనుబంధాలుగా అనేకమైన నవలలను ప్రచురిస్తున్నవి. సత్య దూరమైన సన్నివేశాలు, సంఘటనలు, పాత్రలు, అసహజమైన సంభాషణలు, వాస్తవ జీవితాన్ని కాక ఊహా జీవితాన్ని చిత్రించే ప్రయత్నం కనబడుతున్నది వీటిలో. ఈనాటి కొన్ని తెలుగు నవలలు పాఠకులను జీవితాన్ని అర్థం చేసుకొనే శక్తినిచ్చేవి కాకుండా భ్రమలను కల్పించేవిగా ఉంటున్నవని, ముఖ్యంగా చలనచిత్రాలనో, మరొక ప్రయోజనాన్నో దృష్టిలో పెట్టుకొని కొందరు రచయితలు నవలలను వ్రాస్తున్నారని భావించటంలో అసత్యం ఏమాత్రం లేదని అనిపిస్తున్నది. దీనికి ముఖ్య కారణాలు యీ రచయితలకు ప్రేరణ జీవితానుభవం నుండి కాకపోవడం; కావలసిన క్రాంతదర్శిత్వం లేకపోవడం; ఆలోచనా పరిధి సంకుచితం కావడం అనిపిస్తుంది. మరొక రకం నవలా రచయితలున్నారు. వీరు సమాజంలో మేధావులం అనుకొనే వారు. పాశ్చాత్య సాహిత్యాన్ని అధ్యయనం చేయడం వీరియోగ్యత. వీరి ప్రేరణ సాధారణ భారతీయ జీవితం నుంచికాదు. వీరికి ప్రేరణ నిచ్చేది తాము చదివిన గ్రంథాల నుంచి; భారతీయ ఆర్థిక, సామాజిక పరిస్థితులతో ఏమాత్రం సంబంధంలేని

పాశ్చాత్య జీవితాన్ని చిత్రించే రచనల నుంచి, జేమ్స్ జాయిస్ నుంచి; జీన్‌పాల్ సార్త్రే ఎప్పుడో వదిలేసిన అస్తిత్వ వాదంనుంచి. గ్రామీణ జీవితాన్ని చిత్రించే నవలలు ఈ మధ్య తగినన్ని రావడం లేదు. కృత్రిమ నగర జీవితం ఆధారంగా జానపద కథలకు ప్రతికృతులైన నవలలు కుప్పతెప్పలుగా వచ్చి పడుతున్నని. కాని ఉత్తమమైన నవలలు తగినన్ని రాకపోవడానికి కారణమేమిటో రచయితలు ఆత్మ పరిశీలన చేసుకొనవలసి ఉన్నది. నాటకాల విషయంలో కూడా పరిస్థితి అంత తృప్తికరంగా లేదు. ఈ విషయాలను సమగ్రంగా చర్చించి తమ రచనలు ఏ ప్రక్రియకు సంబంధించినవైనా మరింత ప్రయోజనవంతంగా తీర్చిదిద్దుకొనవలసిన అవసరం రచయితలకున్నది.

రచయితకు సలహా ఇవ్వడం, ఉపదేశం ఇవ్వడం నా ఉద్దేశ్యం కాదు. ఒక అభిప్రాయాన్ని రుద్దటం కూడా నా అభిమతం కాదు. అయినా రచయితలను గురించి చాలామందిలో వినవస్తున్న అభిప్రాయాలను మీముందుంచడం అసమంజసమూ, అప్రస్తుతమూ కాదనుకుంటాను. సమకాలీన వ్యక్తుల ఆలోచనలలో, చిత్తవృత్తులలో వస్తున్న మార్పువేగాన్ని అందుకొనడానికి రచయితలకు సాధ్యం కావడం లేదు. అతనికి పరిశీలనా శక్తి లేదు. దానికి కావలసిన ఓపిక, ఓర్పు అతనికి లేదు. సామాజిక స్పృహతో సరియైన సంబంధం లేదు. వారి రచనలకూ, వారు నివసిస్తున్న జీవితానికి మధ్య పెద్ద అఖాతం ఉన్నది. రచయిత తాను సామాన్య జనానికి అతీతుణ్ణని భావిస్తున్నట్లు, తనకు సమాజంలో ప్రత్యేకమైన స్థానం ఇవ్వాలని ఆశిస్తున్నట్లు కనిపిస్తుంది. రచయిత ఉపదేష్ట మాత్రమేకాదు ఆదర్శమూర్తి కావలె-చేతలకూ, మాటలకూగల అఖాతాన్నీ ఎంతగా తగ్గించే ప్రయత్నం చేస్తే అంతగా రచయిత జనానికి సన్నిహితం అయ్యే అవకాశం ఉంది. రచయిత తాను కట్టుకున్న గూడునుంచి బయట పడాలె. తాను గీసుకొన్న పరిధిని దాటి వచ్చి జనం జీవనాడిని పట్టగలగాలె. రచయితలు పరస్పర మాత్సర్యాన్ని వదలి పెట్టాలె. అప్పుడే జనము అతణ్ణి గుర్తిస్తారు.

రచయితలు చాల మంది స్వేచ్ఛను గురించి మాట్లాడుతుంటారు. ఈ రోజు చాలా మంది రచయితలు తమకు తామే బానిసలు. అవకాశాలకు బానిసలు. కొందరు రాచరికపువ్యవస్థలోని వందిమాగధులకు ఏ మాత్రం తీసిపోరనే అభిప్రాయం కూడా ఉన్నది. సమాజం బాధ్యతను స్వయంసేవకుడిగా స్వీకరించవలసిన రచయిత తన అవకాశాలకు తన వ్యక్తిత్వాన్నే పణం పెట్టినప్పుడు తనకే

కాదు, తను భాగస్వామి అయిన సమాజానికే అన్యాయం చేసుకున్న వాడౌతాడు, రచయిత స్వేచ్ఛకు తానే శత్రువుకాగలడు.

సాధారణంగా సాంఘిక, సాంస్కృతిక రాజకీయ ఉద్యమాలు పరస్పర ప్రభావంతో కలిసికట్టుగా వస్తవి. సాహిత్యం ఇతర ఉద్యమాల నుండి ప్రేరణ పొంది దానికి ప్రతిఫలంగా ఆ ఉద్యమ వేగానికి, సాఫల్యానికి తోడ్పడుతుంది. సమాజానికి సాహిత్యానికి ఉండే సంబంధం పరస్పర ఆదాన ప్రదాన సంబంధం. సమాజం సాహిత్యానికి ప్రేరణనిస్తుంది. దానికి ప్రతిగా సాహిత్యం సమాజం పైన తన ప్రభావాన్ని కలిగిస్తుంది. అందుకే ఆధునిక సమాజంలో రచయిత బాధ్యత చాలా గురుతరమైనది, క్లిష్టమైనది. ప్రస్తుత పరిస్థితులలో సమాజాన్ని ప్రకోపింప జేయటం కాదు రచయిత చేయవలసిన పని; ఉద్దీప్తం చేయటం, చైతన్యాన్ని రేకెత్తించడం సామాజికమైన అవగాహనను కలిగించడం, వివేచనా శక్తిని పెంచడం-ఇవి రచనల ద్వారా సమాజానికి కలిగే ప్రయోజనాలు. ఉద్యమాలతో సంబంధం లేని పరిస్థితులలో కూడా రచయిత పై బాధ్యతలను స్వీకరించటం ద్వారా తన పాత్రను నిర్వహించవచ్చు. చిత్తశుద్ధిలేని ఉద్యమాలకు కవులు స్పందించినట్లు కనిపించదు. దానికి ఇటీవల మన దేశంలో వచ్చిన తాత్కాలికమైన ఉద్యమాల కాలంలో ఉత్తమ సాహిత్యం ఏదీ రాకపోవడమే తార్కాణం.

ఇక్కడే మరొక విషయాన్ని ప్రస్తావించ దలచినాను. విశ్వ జనీనత, సార్వకాలికత అనే నినాదాలను మనం సాధారణంగా సాహిత్య రంగంలో వింటూ ఉంటాము. సామాజిక సమస్యల్ని చిత్రించే సాహిత్యం తాత్కాలిక, ప్రాంతీయ స్వభావం కలిగి ఉంటుందని ఆ సమస్యలు పరిష్కరింపబడిన తరువాత ఆ సాహిత్యానికి స్థానం ఉండదనీ వారు భావిస్తూ ఉంటారు. ఒక రచన సాహిత్యం అవునా కాదా అని నిర్ణయించటానికి సాహిత్య ప్రమాణాలే సమర్థవంతాలు. కాని కళాత్మకంగా చెప్పటం మాత్రమే సాహిత్యం కాదు. సామాజిక చేతనను ప్రతిబింబించి నప్పుడే అది గొప్ప సాహిత్యం అవుతుంది. విభిన్న ఆర్థిక రాజకీయ వ్యవస్థలుగల ప్రపంచంలో సార్వజనీనమైన వస్తువు, పరిణామ శీలమైన సమాజంలో సార్వకాలికమైన వస్తువు ఎప్పుడూ సాధ్యం కాదు. ప్రతిపాదించిన సమస్యలు, ప్రతిబింబించిన సమాజం తాత్కాలికమైనవే అయినా అందులో ఉండే సాహిత్య గుణం, కళాత్మకత దానికి సార్వజనీనతను, సార్వకాలికతను కలిగిస్తుంది. "కన్యాశుల్కం'' నాటక రచనా కాలం నాటి పరిస్థితులు ఈనాడు లేవు. అయినా

అది ఇంకా ప్రజల అభిమానాన్ని చూరగొనడానికి, వాస్తవికతే, కారణం. ఆదికావ్యమై, నేటికీ భారతీయ జీవనంలో భాగమైన రామాయణం రచనాకాలపు సమాజాన్ని, నాగరికతను, ఆచారాలను ప్రతిబింబించడం లేదా ?

ఈ రోజు రచయితలపైన మరొక ముఖ్యమైన బాధ్యత కూడా ఉన్నది. శాస్త్రీయం కాకుండా కేవలం మానసిక ఉద్రేకాలను ప్రకోపింపజేసి, మానసిక రుగ్మతలను పెంచి జాతిని నిర్వీర్యం చేస్తూ కుప్పతెప్పలుగా వచ్చిపడుతున్న సెక్స్ సాహిత్యాన్ని, ఆత్మపీడను, మానసిక పీడను పెంచే డిటెక్టివ్ సాహిత్యాన్ని బాధ్యత నెరిగిన రచయితలే ఎదుర్కొనవలసి ఉన్నది.

నల్లగొండ జిల్లా రచయితలారా ! నా ప్రసంగాన్ని ముగించేముందు ఆరు సంవత్సరాల క్రితం నల్లగొండ జిల్లా రచయితలతో చెప్పిన మాటలనే మళ్ళీ చెప్పవలసి వస్తున్నది. "ప్రగతి శక్తులకు పెట్టనికోట నల్లగొండ". ఒకప్పుడు తెలుగు జాతికి చైతన్యాన్ని ప్రసాదించినారు నల్లగొండ ప్రజలు అంతేకాదు. కవితా వస్తువులను అందించినారు. తెలంగాణ ప్రాంత ప్రజలలో జాగృతి కలిగించిన మొదటి పత్రిక "నీలగిరి" నల్లగొండ నుంచే వెలువడింది. కాని ఇటీవల ఏ కారణం వల్లనో నల్లగొండ ప్రజల గొంతుక వినిపించడం లేదు. ఏ ప్రక్రియలోనూ రాష్ట్రస్థాయి రచయితలుగా పేరుపొందిన వారు నల్లగొండ జిల్లాలో కనిపించడం లేదు. ఇదివరకే చెప్పినట్లు ఈ మూగదనము తాత్కాలికమేనని మళ్ళీ తమ గళాన్ని తెలుగు జాతికి, దేశ ప్రజలకు వినిపించి మార్గదర్శకులౌతారని ఆశిస్తున్నాను.

(మే 1976)

-:o:-

కడప జిల్లా రచయితల సంఘం

నాల్గవ మహాసభ — ప్రారంభోపన్యాసము

కడప జిల్లా రచయితల సంఘం నాల్గవ మహాసభలను ప్రారంభించమని మిత్రులు కోరినపుడు నాకు ఒకవైపు సంతోషం మరొకవైపు సంకోచము కలిగినవి. ఈ నెపముతో యీ ప్రాంత రచయితలను కలుసుకొని, పరిచయం చేసుకొని రెండు రోజులు వారితో కాలక్షేపం చేయకలిగే సదవకాశం నాకు సిద్ధిస్తున్నదని సంతోషం. అయితే యీ కార్యక్రమాన్ని పరిశీలించినపుడు సకలాంధ్ర సాహిత్య వేదికగా శోభిస్తున్న యీ వేదికమీద రచయితలకు నేను చెప్పవలసినదేమి అని ప్రశ్న కలిగినందు వలన సంకోచం. ఈ మానసిక పరిస్థితిలో నేను మీముందు నిలిచినాను.

కడప జిల్లా సాహితీ రంగంలో కొన్ని సంవత్సరాల నుండి నవజీవనం నూతన చైతన్యం గోచరిస్తున్నవి. విశేషించి యీ రచయితల సంఘం ఆవిర్భవించిన తరువాత సమర్థులైన అధ్యక్ష, కార్యదర్శుల కృషి ఫలితంగా జరుగుతున్న సాహితీ వికాసం ఇతర జిల్లాలకు మార్గదర్శకంగా ఉన్నది. ఈనాడేకాదు; ఏనాటి నుండియో కడపజిల్లా సారస్వత రంగములో అగ్రగణ్యత కలిగియున్నది. క్రీ. శ. 6 వ శతాబ్ది నాటి తొలి తెలుగు శాసనాలు ఈ జిల్లాలోనే లభించినవి. ఒకసారి వెనుకకు మరలి చూస్తే విద్యా, సాహితీ కళారంగంగా వెలసిన విజయ నగరం మన కళ్ళముందు నిలుస్తుంది. ప్రౌఢ దేవరాయల, బుక్కరాయల, ఆదరణకు పాత్రుడై కవిత్రయముతో సమానుడని పేరు పొందిన ఉత్తర హరివంశ గ్రంథకర్త నాచనసోమ నాథుడు ఈ మండలం వాడే. అన్నమాచార్య ప్రభృతులైన తాళ్ళపాక కవులు. రాజంపేట తాలుకాలోని తాళ్ళపాక గ్రామస్థులు. ఆంధ్ర కవితా పితామహ అల్లసాని పెద్దన ఇక్కడి వాడే. "కోకట గ్రామాద్యనేకాగ్ర హారములడిగిన సీమల యందునిచ్చె" — అన్నాడు పెద్దన. సంగీత సాహిత్య ములలో ప్రవీణుడైన కవిచక్రవర్తి రామరాజ భూషణుడు; అతని నామాంకితమైనది ఈ సాహిత్య వేదిక.

ఆధునిక యుగంలో మహా పండితులైన వావిలికొలను సుబ్బారావు, జనమంచి శేషాద్రిశర్మ ప్రభృతులు యీ ప్రాంతం వారే. రాణాప్రతాప చరిత్ర

రచించిన రాజశేఖర శతావధానిగారిక్కడివారే. శివభారత గ్రంథకర్తలు గడియారం వేంకటశేషశాస్త్రిగారు ఇచ్చటివారే. మహాకవి సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులవారు ఈయూరి వారే. అభ్యుదయ కవి శ్రీ గజ్జల మల్లారెడ్డి యీ ప్రాంతంవారే. శ్రీ సి. వి. సుబ్బన్న శతావధాని, శ్రీ ఎస్. రాజన్న కవి, శ్రీ నరాల రామిరెడ్డి, శ్రీ వి. వి. శేషాచార్యులు, శ్రీ మీగడ నరసింహారెడ్డి, శ్రీ అవధానము చంద్రశేఖర శర్మ, శ్రీ మైనంపాటి సుబ్రహ్మణ్యం మొదలైన వారందరు ఇక్కడివారే. ప్రఖ్యాత విమర్శకుడు శ్రీ రాచమల్లు రామచంద్రారెడ్డి ఈ గడ్డపై నుండే "సంవేదన" అనే సాహిత్య మాస పత్రికను నడిపినాడు. నాకు తెలియని వారు ఇంకెందరో ఉన్నారు. ఉర్దూ కవులకు కూడా ఈ జిల్లా ఆటపట్టు కావడం గమనించదగిన విశేషం. ఇంతటి ఉత్తమ సాహిత్య సంప్రదాయము కలిగినది యీ మహాసభ. దీనిని ప్రారంభించడం నిజంగా నాకు గర్వకారణం.

ఈ సభలు రచయితల సభలు. అందుచేత రచయితలు, వారి సమస్యలు ప్రత్యేక ప్రాధాన్యము వహిస్తున్నవి. సమాజంలో రచయిత స్థానం ఉన్నతమైనది. ఈ విషయంలో ఎటువంటి అభిప్రాయభేదము లేదు. అయితే ఇతరుల కున్నట్లుగా రచయితలకు కూడ ప్రత్యేక సమస్యలున్నవి. ఆ సమస్యలు యావద్భారతము లోని అన్ని ప్రాంతములలో ఒకేవిధంగా ఉన్నవి. కుల, మత, వర్ణ, వర్గ విభేదాలు లేక రచయితలందరికి యీ సమస్యలు సమానంగా ఉన్నవి. ఇతర దేశాలలో అనగా నూటికి నూరుపాళ్ళు అక్షరాస్యులైన దేశాలలో – ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి పొందిన దేశాలలో – రచయిత రచయితగా తన జీవితాన్ని గడుపు కుంటున్నాడు. మన దేశంలో ఇటువంటి పరిస్థితి రాలేదు. రచనా వ్యాసాంగం మన దేశంలో లాభదాయకమైన వృత్తి కాదు. ఇంగ్లండులో జార్జిబెర్నార్ షా, గాల్స్‌వర్దీ, థామస్ హార్డీ ప్రభృతులు రచనల ద్వారా కావలసినంత డబ్బు సంపాదించినారు. మన దేశంలో ఏ విశ్వనాథ సత్యనారాయణవంటి ఒకరిద్దరు తప్ప పుస్తకాల మీద డబ్బు గడించిన వారు మిక్కిలి కొద్దిమంది. స్వర్గీయ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు తమ పుస్తకాలను కొన్నింటిమీద అన్ని హక్కులు పాతిక రూపాయలకు మాత్రమే అమ్మినట్లు తెలుస్తున్నది. ఈనాడు వ్యాపించి యున్న పరిస్థితి కూడ ఇంచుమించు ఇదేవిధంగా ఉన్నదని చెప్పవచ్చును.

రచయితకు పుస్తకము వ్రాయడానికన్న అచ్చువేసుకోవడం కష్టదాయక మని, అచ్చువేసుకోవడం కన్న అమ్ముకోవటం మరింత కిష్టదాయకమని చాలా

మందికి తెలిసిన సత్యమే. ఒక్క పుస్తకం వేయి ప్రతులు అమ్ముకోవడానికి కొన్ని సంవత్సరములు పట్టుసన్న వాస్తవం. చాలా మందికి అనుభవ విషయం. ఇందుకు కారణాలు అనేకములుండవచ్చును. ఈ పరిస్థితిని నివారించినపుడే రచనా వ్యాసంగం వికాసం పొందగలదు. రచయిత తన సాహిత్య కృషిని సాగిస్తూ జీవనోపాధికి మరోపని యేదైన చేసుకోవలసిన అవసరం యీనాడు మన దేశంలో ఉన్నది.

సాధారణంగా ఇటువంటి సభలు జరిగే సందర్భంలో ప్రత్యేకంగా ఆహ్వానించిన మంత్రివర్యులు, అధికారులు మొదలైనవారు రచయితలకు కొన్ని ఉపదేశాలివ్వడం జరుగుతుంది. వారి వారి మనస్త్వత్వాలను బట్టి ఆ ఉపదేశాలు కొనసాగుతుంటవి. రచయితల బాధ్యత ఇది, రచయితల కర్తవ్యం ఇది-అని నిర్దేశించడం జరుగుతుంది. కాని రచయిత అయిన ప్రతివాడు తన బాధ్యత తానే నిర్ణయించుకొనవలెనని భావించే వారిలో నే నొకడిని. సమాజానికి మార్గదర్శి కావలసిన, రచయిత తన కర్తవ్యాన్ని తాను నిర్ణయించుకోలేడా? Poets are the unrecognized legislators of the country ఏ రాజకీయ నాయకుడో రచయిత లక్ష్యాలను నిర్దేశించవలసిన అవసరం ఉన్నదా? అనే ప్రశ్న సహజంగా ఉత్పన్నమవుతున్నది. ఫలానా రాజకీయ పక్షపు ఆదర్శాలను సంపూర్ణంగా పాటించినవాడే రచయిత నిజమయిన రచయిత అనే భావం కూడా కొందరిలో కనిపిస్తున్నది. రచయితకు సమాజం పట్ల బాధ్యతలున్న మాట సత్యమే. రచయితలకు ఆదర్శాలు, లక్ష్యాలు ఉండవలసిన మాట కూడా సత్యమే. కాని ఆ లక్ష్యాలు, ఆదర్శాలు ప్రత్యేక రాజకీయ పక్షాలకు, ఆశయాలకు అనుబంధంగా ఉండవలసిన అవసరంలేదు. సామాజిక ప్రగతి, దేశాభ్యుదయం, లోకకల్యాణం రచయిత ఆదర్శాలుగా ఉండవలెననడంలో అభిప్రాయ భేదంలేదు. కాని రాజకీయవాదుల అడుగులకు మడుగు లొత్తి, వారి కటాక్ష వీక్షణాలకు పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో రచనలు చేయవలెననే అభిప్రాయం నామట్టుకు నాకు లేదు. జమిందారు గారి ప్రేయసిని నఖశిఖపర్యంతరం వర్ణించే కవిత్వం సమాజానికి చేయగల మేలేమి? జమిందారుగారు అభిమానిస్తే ఆయన ప్రేయసి మీద "చంద్రరేఖావిలాసం" ఆయన కంటగించితే ఆమె మీద "చంద్రరేఖావిలాపం"! వ్రాసే మనస్తత్వం గల రచయిత సమాజానికి ఎంతవరకు గౌరవపాత్రుడు? దేశం చిన్న చిన్న రాజ్యాలుగా చీలి నూరు గ్రామాలకు, రెండు నూర్ల గ్రామాలకు ఒక రాజ్యం యేర్పడి అజ్ఞానం, దారిద్ర్యం

ఆవరించిన పరిస్థితులలో యే విధమైన రచనలు వచ్చినప్పటికిని ఆ రోజులలో రచయితలు తమ అవసరాల కొరకు యే విధమైన ఒత్తిడులకు ప్రభావాలకు లొంగినప్పటికిని ప్రపంచమంతా ఏకఖండంగా ఆలోచించే ప్రస్తుత సమాజంలో, రచయితల దృక్పథంలో అవసరమైన మార్పురాక తప్పదు.

ప్రాథమిక స్వత్వాలు ప్రజాస్వామ్యం, సాంఘిక న్యాయం. కులమత వర్గ రహితమైన సాంఘిక వ్యవస్థ యీనాడు అందరు కాంక్షించే ప్రయోజనాలు. ఈ ప్రయోజనాల సాధనకొరకై కృషి జరుగుతున్నది. ఈ కృషికి అనుగుణంగా రచయితల చిత్తవృత్తి రూపొందవలసి ఉంటుంది. నేటి పరిస్థితుల దృష్ట్యా దేశ శ్రేయస్సును లోక కల్యాణాన్ని కాంక్షించు రచయితలు స్వతంత్రంగా ఆలోచించవలసి ఉంటుంది. అందుకు అనుగుణంగా తమ రచనా వ్యాసంగాన్ని సాగించవలసి ఉంటుంది.

ఇటీవల మనదేశంలో రచయితల సంఖ్య ఎక్కువ అవుతున్నది, ప్రచురణల సంఖ్య పెరుగుతున్నది. ఇది సంతోషకరమైన సంగతి. అయితే యీ రచనలు ఎంతవరకు దేశాభ్యుదయానికి, లోక కల్యాణానికి ఉపకరిస్తున్నవనే ప్రశ్న కూడా సహజంగా కలుగుతున్నది.

ఈనాడు రచయితలలో కొందరు తాము సమాజానికి అతీతులమని భావిస్తున్నట్లు కనిపిస్తున్నది. తమ చుట్టూ గీత గీసుకొని, తమ పరిధిలో తాము ఆలోచిస్తూ, సమాజానికి సంబంధం లేకుండా బ్రతుకుతూ సమాజం తనను గుర్తించవలెనని, గౌరవించవలెనని కొందరు రచయితలు తాపత్రయ పడుతున్నారనే అభిప్రాయం సాధారణ జనంలో ప్రబలి ఉన్నది. ఆ కారణంగానే లోకానుభవం రచయితలలో తగ్గుతున్నది. అస్పష్ట, అయోమయ భావాలతో కవితలు వాస్తవ జీవితంతో సంబంధం లేని నవలలు, కథానికలు మన ముందువచ్చి పడుతున్నవి. ఈ విధంగా కొందరు రచయితలు నేల విడిచిన సాము చేస్తున్నారనిపిస్తున్నది. రచయిత తాను సమాజంలో భాగమనే సత్యాన్ని గుర్తించాలె. స్వచ్ఛందంగా సామాజిక బాధ్యతలను స్వీకరించిన నాడే, రచయిత సమాజంలోని వ్యక్తిగా జీవిస్తూ, సామాజిక సమస్యలను అవగాహన చేసుకొని రచనలు చేసినప్పుడే, రచయిత సమాజంపైన సరియైన ప్రభావాన్ని వేయగలుగుతాడు. సమాజాన్ని ముందుకు నడిపించగలుగుతాడు. అప్పుడే సమాజం అతన్ని గుర్తిస్తుంది. ఉభయ సాంప్రదాయిక కవులతో పాటు అభ్యుదయ భావాలు గల రచయితలకు పుట్టినిల్లు కడప జిల్లా. ఈ జిల్లా రచయితలు తమ బాధ్యతా నిర్వహణలో ఇతర ప్రాంతాల కవులకు ఆదర్శప్రాయం కాగలరని ఆశిస్తూ యీ నాలుగు మాటలతో యీ సభలను ప్రారంభిస్తున్నాను.

18–11–77

గాంధీజి సారస్వత మూర్తి

కృష్ణవేణి జలాలచే సస్యశ్యామలమైన దివిసీమలో అవనిగడ్డ ఆంధ్ర సంస్కృతికి ఆటపట్టు; దివిసీమ సాహిత్యానికి, లలిత కళలకు, సంస్కృతికి ముఖ్యకేంద్రమై చరిత్రలో ప్రసిద్ధికెక్కినది. ఈనాడు కూడా పూర్వచరిత్ర కనుగుణంగా పురోగమిస్తున్నది దివిసీమ; విశేషించి అవనిగడ్డ ప్రాంతము. అవనిగడ్డలో దేశాభ్యుదయానికి కావలసిన నిర్మాణాత్మక కార్యక్రమాలను నిర్వహించే సంస్థలు స్థాపితమై ప్రశంసనీయంగా పనిచేస్తున్నవి. ఎక్కడైనా ఏ సంస్థ అయినా మంచిపని చేస్తున్నదంటే దానివెనుక దేశాభ్యుదయం కొరకు నిరంతరం ఆలోచించే ఒక ముఖ్యవ్యక్తి ఉన్నాడన్నమాట. అవనిగడ్డలో ఇన్ని సంస్థలు సుమారు ఒక దశాబ్దమునుండి ఎనలేని కృషిచేస్తూ ముందడుగు వేస్తున్నవంటే అందుకు కారణభూతులు, కార్యశూరులు, కర్మవీరులైన శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు. గట్టిపట్టుదల, ఎన్ని కష్టాలకయినా ఓర్చి పనిని సాధించగల నేర్పూ, ఓర్పూ మండలి వెంకట కృష్ణారావుగారి ప్రత్యేకతలు – అందుచేత ఈ సంస్థలు దినదినాభివృద్ధి చెంది ఆదర్శసంస్థలుగా రూపొందగలవని నిస్సందేహముగా ఆశించవచ్చును.

ఈ సంస్థలు ప్రవర్థమాన మౌతున్న ప్రదేశానికి నామకరణం సమంజసంగా జరిగింది. 1929 సంవత్సరములో మహాత్మాగాంధీగారు యీ ప్రాంతానికి వచ్చినప్పుడు అవనిగడ్డకు గూడా విచ్చేసినట్లు తెలుస్తున్నది. చరిత్రాత్మకమైన ఆ సంఘటనకు సంస్మరణీయంగా కాబోలు దానికి గాంధీక్షేత్ర మని నామకరణం చేసినారు. గాంధీగారు దేశసౌభాగ్యానికై నిర్దేశించిన నిర్మాణాత్మక ప్రణాళికకు ఇక్కడ పనిచేస్తున్న సంస్థలు అనుగుణంగా ఉన్నవి. ఇటువంటి క్షేత్రాలు అన్నిజిల్లాలలో అవతరించి పనిచేస్తే దేశసౌభాగ్యాన్ని సత్వరంగా సాధించవచ్చును.

నేడు మనం గాంధీ జయంతి ఉత్సవాలు జరుపుకుంటున్నాము. గాంధీగారు వెళ్ళిపోయి ఇప్పటికి 30 సంవత్సరాలు కావస్తున్నవి. అనగా 40 సంవత్సరాల వయస్సులోపుగా ఉన్న దేశీయులు గాంధీగారిని చూచి ఉండక పోవచ్చును. వారిలో చాలా మందికి ఆయన వ్యక్తిత్వం సరిగా అవగాహన కాకపోవచ్చును.

గాంధీగారు మనదేశానికి స్వాతంత్ర్యం సాధించిన జాతిపిత అని మాత్రము అందరికి తెలుసును. కాని ఆయన వ్యక్తిత్వం అంత మాత్రానికే పరిమితంకాదు. గాంధీ గారిది మహోన్నతమైన బహుముఖమైన వ్యక్తిత్వం. భారతజాతి సర్వతోముఖాభ్యుదయానికిని, సమస్త మానవజాతి కల్యాణానికిని కృషిచేసిన ఉత్తమ పురుషుడు మహాత్మాగాంధీ. లక్ష్యసిద్ధి ఎంతప్రధానమైనదో సాధనశుద్ధి కూడా అంతే ప్రధానమైనదని ఆయన వక్కాణించినాడు - జీవితములో నైతిక విలువలను తాను పాటించి ఇతరులందరిని పాటించవలెనని ప్రబోధించిన ఉదారచరిత్రుడు ఆయన. సత్యానికి, అహింసకు ప్రతినిధిగా నిలిచిన మహనీయ మూర్తి ఆయన. పీడిత ప్రజల సముద్ధరణకు ఆయన ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినారు. ప్రతి నేత్రయుగం నుండి జారే ప్రతి బాష్పకణాన్ని తుడువడమే తన జీవిత ధ్యేయమని ఆయన ఉద్ఘాటించినాడు. భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించి, భారతప్రజల సముద్ధరణకు మార్గదర్శకుడైన ఆ ఉత్తమపురుషుడు సమస్తమానవజాతి సర్వతోముఖ వికాసాన్ని కోరి కృషిచేసిన విమలచరిత్రుడు; ప్రపంచమునంతా తన కుటుంబముగా భావించిన మహానుభావుడు.

గాంధీ మహాత్ముని సంస్మరించే యీ వారంలో సారస్వత వేదిక మీద కవి సమ్మేళనాన్ని ఏర్పాటు చేయడంలో సందర్భశుద్ధి గోచరిస్తున్నది. గాంధీ మహాత్ముని బహుముఖ వ్యక్తిత్వంలో రచనా వ్యాసంగం ముఖ్యమైనది. అందుచేతనే యీ సందర్భములో మనము ఆయన సారస్వతమూర్తిని సందర్శించడం సముచితం కాగలదు. గాంధీజీ తల్లిదండ్రులు పవిత్రమూర్తులు. తల్లిగారు కఠోర వ్రతాలను, నియమాలను పాటించిన సాధ్వీమణి. తండ్రిగారు అనేక శాస్త్రచర్చలలో నిరంతరము పాల్గొన్న మనీషి. వారి ఇంటికి చిన్నప్పుడు జైన, వైష్ణవ విద్వాంసులు చాలా మంది వచ్చేవారు. ఈ విధంగా చిన్ననాడే ఆయనపైన జైన, వైష్ణవ మతాల ప్రభావం పడింది. సత్యహరిశ్చంద్ర నాటకం ఆయన హృదయంపై చెరగని ముద్ర వేసినది. శ్రవణుని పితృభక్తి బాలకుడగు ఆయనను ఆకర్షించినది. తరువాత విద్యార్థిగా గౌతమబుద్ధుని చరిత్రను చదివి సత్యము అహింసలు ప్రాతిపదికలైన ప్రగాఢ విశ్వాశాలను ఆయన ఏర్పరచు కొన్నాడు. అంతేకాదు క్రైస్తవ మత గ్రంథమయిన బైబిల్‌ను ఇంగ్లండులో విద్యార్థిగా ఉన్నప్పుడు శ్రద్ధగా పఠించినాడు. మొదటినుండి భగవద్గీత ఆయనకు అభిమాన గ్రంథము. ఫలాపేక్ష లేని కర్మ అనే గీతాబోధన జీవితాంతం ఆయన పాటించినాడు. తులసిదాసు 'రామచరిత మానస్' ఆయన పదేపదే పఠించినాడు. రామనామాన్ని తారక

మంత్రంగా భావించుకున్నాడు. టాల్‌స్టాయ్ రచనలు ఆయన్ను ప్రభావితుణ్ణి చేసినవి. ఆయన వ్రాసిన 'స్వర్గం నీలోనే ఉన్నది' అన్న పుస్తకం చదివి, తాను చెప్పినది తాను ఆచరించే వ్యక్తి, సత్యాన్ని అనుసరించడంలో ఎటువంటి త్యాగానికి కూడా వెనుదీయని వ్యక్తి టాల్‌స్టాయ్ అని గుర్తించినాడు. విద్యార్థి అయిన గాంధీ తరువాత రస్కిన్ వ్రాసిన "Unto the last" అను గ్రంథాన్ని చదివి 'సర్వోదయం' అనే పేరుతో దానిని గుజరాతీ లోనికి అనువదించినాడు. ఈ విధంగా అన్ని మతాల సారాన్ని గ్రహించి, ఉత్తమ సాహిత్యాన్ని పఠించి, సర్వోదయ సిద్ధాంతాన్ని రూపొందించి, తన జీవితాన్ని ఆవిధంగా మలచుకొని ఆయన విశ్వమానవుడుగా రూపొందినాడు. ఆయన పాటించిన నియమాలకు, నిర్ణయించిన కార్యక్రమాలకు, బోధించిన ఆశయాలకు వెనకనున్న సంక్షిప్త కథ ఇది.

ఆయన సారస్వత మూర్తిని తీర్చిదిద్దిన సంఘటనల కథ కూడ ఇదే.

మహాత్మాగాంధీగారి వ్యాసాంగాలలో రచన ముఖ్యమైనది. ఆయనకు మాతృభాష మీద మక్కువ ఎక్కువ. బనారస్ హిందూ విశ్వవిద్యాలయం ప్రారంభోత్సవ సందర్భంలో మాట్లాడుతూ "నా మాతృభాషకాని విదేశ భాషలో మాట్లాడడం నాకు సిగ్గుగా ఉన్నది" అని ఆయన చెప్పినాడు. తరువాత సర్వదా ఆయన మాతృభాష ప్రాధాన్యాన్ని వక్కాణిస్తుండేవాడు. గాంధీగారు గుజరాతీ భాషలో అనేక రచనలు చేసినారు. ఆ రచనలు సమగ్రజాతీయ జీవనానికి, అంతర్జాతీయ జీవనానికి మార్గదర్శకాలు. గాంధీగారి రచనలు అనేక మార్గాలలో సాగినవి. 'Young India', 'హరిజన్', 'నవజీవన్' మొదలగు పత్రికలకు సంపాదకుడుగా మానవ ప్రపంచానికి సంబంధించిన సమస్త విషయాల మీద తన అభిప్రాయాలను వెల్లడిచేసినాడు. ఆయన తన ఆత్మకథను ఒక గ్రంథంగా వ్రాసినాడు. సామాజిక, రాజకీయ, ఆర్థిక, తాత్త్విక విషయాల మీద ఆయన అనేక వ్యాసాలు వ్రాసినాడు. ఆయన రచనలు అనేక సంపుటాలుగా వెలువడినవి. ప్రపంచ మేధావులు అనేకులతో ఆయన జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు చాలావరకు ప్రకటితమయినవి. ఈ విధంగా గాంధీమహాత్ముడు సమస్త విషయాలమీద వ్రాసిన పుటలు వేనవేలు కలవు. ఈ రచనలన్నియు ఆయనకు ప్రపంచ మహా రచయితలలో ఉన్నతస్థానాన్ని కల్పిస్తున్నవి.

తాను రచయిత కావాలననే ఉద్దేశంతో గాంధీగారు వ్రాయలేదు. లోకానికి ఆయన అభిప్రాయాలను విప్పిచెప్పవలెనని ఆయన వ్రాసినాడు. సారస్వత

విషయాలకు మాత్రమే ఆయన రచనలు పరిమితం కాలేదు. మానవజాతికి సంబంధించిన అన్ని సమస్యలను గూర్చి ఆయన వ్రాసినాడు. ఆయన వ్రాతలన్నీ గొప్పరచనలు. ఆయన శైలి నిరాడంబరమై, శక్తివంతమైనది. గంభీరమైనది. ఎంతటి గొప్ప అభిప్రాయాన్నయినా కొద్దిమాటలలో హృదయానికి హత్తుకుని పోయేటట్టు ఆయన చెప్పగలిగే వాడు.

ఆయన ఉపయోగించే ఉపమానాలు కూడా విశిష్టమైనవిగా ఉండేవి. గోవు ఆయనకు పవిత్రమైనది. గోవును గూర్చి వ్రాస్తూ ఆయన "It is a Poem of Pity" అన్నారు. ఒక విదేశీయ వనిత భారతదేశాన్ని అపనిందలపాలు చేయడానికి ఉద్దేశించి ఒక గ్రంథం వ్రాయగా దానిపై ఆయన "It is the drain inspectiors' report" అని ఒక మాటలో వ్యాఖ్యానించినాడు. ఆయన ప్రజాహిత జీవనంలో ప్రవేశించిన తొలి రోజులలో బొంబాయిలో ముగ్గురు మహా వ్యక్తులుండేవారు. ఒకరు ఫిరోజ్ షామెహతా, రెండవ వారు లోకమాన్య బాల గంగాధర్ తిలక్. మూడవ వారు గోపాలకృష్ణ గోఖలే. ఈ ముగ్గురిని ఆయన అభిమానించినప్పటికిని గోఖలే గారిని తన గురువుగా భావించుకున్నాడు. వీరి విశిష్ట వ్యక్తిత్వాలను వివరిస్తూ "ఫిరోజ్ షా మెహతా హిమాలయ పర్వతాల వంటి వాడు. ఆ యెత్తును చేరుకోవడం సాధ్యంకాదు. లోకమాన్యుడు సముద్రం వంటి వాడు. ఆ లోతును చేరడం కూడా సాధ్యంకాదు. గోఖలే చల్లగా ప్రవహించే నదివంటి వాడు. నది ఒడ్డున ఆడుకోవచ్చును గదా" అని రమ్యంగా చెప్పినాడు.

మహాకవి రవీంద్రునికి మహాత్మునిపట్ల విశేష గౌరవాభిమానాలుండేవి. రవీంద్రుడు ఆయనను "ఇతడు ఉపనిషత్తులలోని పూర్ణపురుషుడు" (He is the Poorna Purusha of the Upanishaths) అని సంభావింపగా, గాంధీజి రవీంద్రుని గురుదేవుడని పేర్కొనేవాడు. కవయిత్రి సరోజినీదేవికి మహాత్ముని పైన అపరిమిత మైన భక్తి. జవహర్‌లాల్ నెహ్రూ మహాత్ముని అడుగు జాడలలో పెంపొందినాడు. రవీంద్రునికి, మహాత్మునికి ఒకేసారి తీవ్ర అభిప్రాయభేదాలు పొడసూపినవి. విదేశవస్తు బహిష్కారము చేయవలెనని గాంధీ మహాత్ముడు కోరగా రవీంద్రుడు దానిని వ్యతిరేకించినాడు. కవియైన రవీంద్రుడు తన వ్యతిరేకతను లేఖారూపంలో తెలిపినాడు. ఆ లేఖ ఒక సాహిత్య శకలము. మహాత్ముడు దానికి సమాధానంగా మరొక లేఖ వ్రాసి రవీంద్రుని నిరుత్తరునిగా చేసినాడు. మహాత్ముని లేఖ భావ గాంభీర్యంలోనూ, భాషాపటిమలోనూ రవీంద్రుని లేఖకన్న ఉత్కృష్టమై

ప్రపంచ లేఖా సాహిత్యములో మహోజ్వలంగా ప్రకాశిస్తున్నది. సాహిత్యానికి నోబుల్ బహుమతి పొంది, మహాత్ముని జీవిత చరిత్రను వ్రాసిన ఫ్రెంచి రచయిత రోమారోలో ఈ ఘట్టాన్ని రసవంతంగా చిత్రించి మహాత్ముని మహారచయితగా ప్రశంసించినాడు.

ఉత్తమ శ్రేణికి చెందిన మహాత్ముని జీవితములో రసవంతమైన మహా వాక్యాలకెన్నింటికో కావలసిన ఇతి వృత్తాలు ఎన్నో ఉన్నవి. భారతదేశానికి స్వరాజ్య మీయవలెనని నిర్ణయించిన తరువాత దేశంలోని కొన్ని ప్రాంతాలలో సంఘర్షణలు, దోపిడీలు చెలరేగి రక్తము ప్రవహించినది. బెంగాలులో ఈ హింసాకాండ మరింత చెలరేగినది. అప్పుడు బెంగాలులోని నౌఖాలీ ప్రాంతములో రక్త ప్రవాహముల మధ్య మహాత్ముడు పాదచారియై ఒకరిద్దరు అనుచరులతో పర్యటన చేసి శాంతిని స్థాపించినాడు. పంజాబులో 50 వేల సైనికులు చేయలేని పని నౌఖాలీలో మహాత్ముడు సాధించినాడు. "నా 50 వేల సైన్యానికన్నా మహాత్ముడు ఎక్కువ శక్తివంతుడు" అని అప్పటి గవర్నరు జనరల్ లార్డ్ మౌంట్ బేటన్ ఉద్ఘాటించినాడు. కవీంద్రుడు రవీంద్రుడు, కవయిత్రి సరోజినీదేవి ఈ శాంతి యాత్రలో మహాత్ముని ప్రోత్సాహించి భక్త్యంజలి సమర్పించినారు. ప్రసిద్ధ విజ్ఞానవేత్త ఐన్‌స్టైన్ "ఇటువంటి మహనీయులొకరు ప్రపంచము మీద అడుగు పెట్టి మానవాళికి వెలుగుబాట చూపించినాడని భావితరాల వారు విశ్వసించడం కష్టసాధ్యము కాగలదు" అని వక్కాణించినాడు. ఈ విధంగా ఆయన జీవితములో కరుణాలవాలమైన ఘట్టాలు మన కవుల రచనలకు ఇతివృత్తము కాగలిగిన ఘట్టాలు ఎన్నో ఉన్నవి. మన కవులెంతమంది వీనిని స్వీకరించినారు ?

గాంధీజీ జీవితాన్ని ఆయన కృషిని గూర్చి దేశభాషలలో వాఙ్మయము పుష్కలంగా వచ్చినది. తెలుగులో కూడా ఆయనను గూర్చి అనేక గ్రంథాలు ప్రకటితమైనవి. బసవరాజు అప్పారావుగారు ఆయనను వర్ణిస్తూ "వెన్నపూసా మనసు కన్నతల్లి ప్రేమ, పండంటి మోముపై బ్రహ్మతేజస్సు" అని చెప్పిన మాటలు అందరికి తెలిసినవే. వేలూరి శివరామ శాస్త్రిగారు ఆయన ఆత్మకథను చక్కని వచనములో తెనిగించినారు. తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు ఆయన ఆత్మకథను మహాకావ్యంగా వ్రాసినారు. ఇంకనూ రచయితలు, కవులు ఆయనను కీర్తించినారు. స్థాలీపులాక న్యాయముగా మహాత్ముని సారస్వతమూర్తి చిత్రణ ఇది.

(3–10–77 నాడు గాంధీజయంతి సందర్భంలో అవనిగడ్డలో జరిగిన కవి సమ్మేళన అధ్యక్షోపన్యాసము).

నే నెరిగిన అనంతకృష్ణ శర్మ గారు

శ్రీమాన్ రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మగారిని కన్నడ సీమలో సన్మానించే పూనిక సముచితమైనది; ప్రశంసనీయమైనది. శర్మగారు మైసూరులోనే తమ ఉద్యోగ జీవనము పూర్తిగా గడపినారు. ఆ పిమ్మట తిరుపతిలో వారు కొంత కాలము ఉద్యోగము చేసినప్పటికిని, పదవీ విరమణ తరువాత బెంగుళూరులో విశ్రాంతి తీసుకుంటున్నారు. తెలుగు కన్నడముల చుట్టరికము పురాతనమైనది. ఈ చుట్టరికానికి శర్మగారు ఉత్తమ ప్రతినిధిగా ఉన్నారని చెప్పితే అతిశయోక్తి కాజాలదు. ఈ రెండు రాష్ట్రాలలోని సాంస్కృతిక వర్గాలు వారిని సమానంగా గౌరవిస్తున్నవి. శర్మగారిలోని ఈ విశిష్టత జాతీయ సమైక్యతకు ఉత్తమ చిహ్నము. సంగీత సాహిత్యాలు రెండును తెలుగు కన్నడములవలె, ప్రాకృత సంస్కృతముల వలె, ప్రాచీనాధునిక సాహిత్య సంప్రదాయాలవలె శర్మగారి సారస్వత మూర్తిలో సరసముగా సమ్మిళితమైనవి. హృదయశక్తి, మేధాశక్తి రెండింటి మేలికలయికను శర్మగారిలో మనము చూడవచ్చును. కావుననే కవులుగా, సాహితీ విమర్శకులుగా వారు అగ్రశ్రేణిని అలంకరిస్తున్నారు.

శర్మగారి సారస్వత మూర్తితో నాకు చిరకాల పరిచయము. నేను కళాశాలలో విద్యార్థిగా ఉన్న కాలములో అనుకుంటాను వారు వ్రాసిన నిగమశర్మ అక్క అనే సాహిత్య విమర్శన వ్యాసాన్ని భారతిలో సుమారు నలుబది సంవత్సరాల క్రింద చదివే అవకాశం లభించింది. ఆ వ్యాసము నన్ను అత్యంతంగా ఆకర్షించింది. నిజానికి తెలుగు సాహిత్య విమర్శలో నాకు అభిరుచి కలిగించింది. యీ వ్యాసమేనని చెప్పవచ్చును. ఆ వ్యాసము Cutting తీసుకొని ఆ రోజులలో నేను పదే పదే చదువు కొనే వాడిని. ఇట్లా చదువుకున్న వారు తెలుగు వారిలో ఇంకా అనేకులుండవచ్చును. అనంత కృష్ణశర్మగారి వలె వచనము వ్రాయవలెనని ఆకాంక్ష నాకు ఉండేది. తరువాత అనంత కృష్ణశర్మగారి ఇతర రచనలు చదువవలెననే కుతూహలంతో, వారి వ్యాసాలకొరకు అన్వేషించి రాయల నాటి రసికత, రాయల వైదుష్యము, నాచన సోముని నవీన గుణములు మొదలైన వ్యాసాలు చదువుకున్నాను. ఆపైన వేమన ఉపన్యాసాలు తెప్పించుకొని తనివిదీర చదువు కున్నాను - బహుశా ఆ రోజులలో నేననుకుంటాను వారి

నాటకోపన్యాసాలు భారతిలో ప్రకటితము కాగా ఎంతో శ్రద్ధతో ఆ వ్యాసాలను భద్రపరచుకొని పలుమారు చదివినాను. ఈ విధంగా నాలుగు దశాబ్దాల క్రింద అనంతకృష్ణ శర్మగారి రచనలు నా హృదయము మీద చెరగని ముద్ర వేసినవి. ఆ చిన్న వయస్సులో వారిపైన నాకు కలిగిన అభిమానము దినదినాభివృద్ధి నొంది వారిని సందర్శించవలెననే ప్రబలమైన కోరిక కలిగినది. కాని 1957 వరకు అనగా 20 సంవత్సరాల గడిచేవరకు ఆకోరిక నెరవేరలేదు.

ఇంచు మించుగా వారి వచన రచనలతో పరిచయము కలిగినప్పుడే వారి కవిత్వముతో కూడా నాకు పరిచయము కలిగినది. ఆ రోజులలో స్వర్గీయ కురుగంటి సీతారామయ్యగారు నిజాం కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా ఉండే వారు. నాకు అనంతకృష్ణశర్మగారి పట్ల ఉన్న గౌరవాభిమానాలు వారికి తెలియ జేయగా, అవి సరియైనవని వారు హర్షించి అనంతకృష్ణ శర్మగారు వ్రాసిన పెనుగొండను గూర్చిన కవితను నాకు వినిపించినారు. వీరరసపుముద్దయైన ఆ కవిత నారక్తాన్ని ఉడికించినది. శాలివాహన గాథాసప్తశతికి శర్మగారు చేసిన కొన్ని అనువాదాలను కూడా అదే సందర్భంలో సీతారామయ్యగారు నాకు చదివి వినిపించి శర్మ గారి పట్ల నా అభిమానాన్ని ద్విగుణీకృతము చేసినారు

స్వర్గీయ సురవరం ప్రతాపరెడ్డిగారు నాకు ఆప్తులుగా ఉండేవారు. వారికి అనంతకృష్ణశర్మగారి పైన అపారమైన గౌరవము. తెలుగు సాహితీ విమర్శకులలో అనంతకృష్ణ శర్మగారిది అగ్రస్థానమని నాకు ప్రతాపరెడ్డిగారు చెప్పుతుండేవారు. 1950లో ప్రతాపరెడ్డి గారి సాంఘిక చరిత్ర నాతో గాఢ సంబంధము కలిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తు పక్షాన ప్రకటితమైనది. ఆ గ్రంథాన్ని అనంతకృష్ణశర్మగారికి ప్రతాపరెడ్డిగారికోరిక ప్రకారం పంపించగా శర్మగారు ఆ గ్రంథము పైన చక్కని విమర్శ గావించి విలువగల అనేక సూచనలు చేసినారు. ఆ సూచనలనన్నింటిని ప్రతాపరెడ్డిగారి ఆమోదముతో రెండవ ముద్రణలో క్రోడీకరించనైనది. తరువాత కొంతకాలానికి వారి అగ్రజు లైన గోపాలకృష్ణమాచార్యులవారితో నాకు పరిచయము కలిగి క్రమక్రమంగా వారికి మిక్కిలి సన్నిహితుడను కాగలిగిన సదవకాశము లభించినది. గోపాల కృష్ణమాచార్యులవారు వారిసోదరుని గూర్చి మా సంభాషణలలో ప్రస్తావించేవారు.

1957 వ సంవత్సరమున ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి అవత రించినది. అనంతకృష్ణశర్మగారు సాహిత్య అకాడమి సభ్యులైనారు. అదే నాకు

వారితో వ్యక్తిగతమైన తొలిపరిచయము. ఆ మొదటి పరిచయములోనే వారి పట్ల నాకు అంతకు ముందున్న గౌరవాభిమానాలు పదింతలు పెరిగినవి. సాహితీ పరులుగా వారి కీర్తి ఎంత విశిష్టమైనదో సుందరమైన వారి మూర్తి కూడ అంత విశిష్టమైనదిగా నన్ను ఆకర్షించినది. సాహిత్య అకాడమి సమావేశాలు జరుగుతుంటే విలక్షణమైన వ్యక్తిగా కవి పండితుల చూపులు వారిపైన ప్రసరించేవి. తెల్లని ధోవతి, తెల్లని ఉత్తరీయము, తీర్చిదిద్దిన ఊర్ధ్వ పుండ్రములు, మృదువైన హాసము, మధురమైన వాక్కు, సుందరమైన ఆకారముతో మూర్తీభవించిన సరస్వతి వలె యెంతటి విద్వత్సభకైనను మార్గదర్శి కాగలిగిన మహోన్నతులు వారు. నాటినుండి నేటి వరకు శర్మగారితో నా పరిచయం క్రమక్రమంగా అభివృద్ధి పొందినది. అందుకు కారణము నా యోగ్యతకాదు; వారి సౌజన్యమే. ముత్యాలసరము వంటి వారి అక్షర పంక్తి వారి సుకుమార సరస హృదయానికి మేలి దర్పణము, అనంతకృష్ణశర్మగారి జాబులు సారస్వతశకలాలు. వారు వ్రాసిన లేఖల పఠనము హృదయాహ్లాదకరమైన వ్యాసంగము.

శాలివాహన గాథాసప్తశతిని వారు అనేక సంవత్సరాల క్రిందట తెనిగించి, అందులో కొంత భాగము ప్రకటించినారు. కాని పది సంవత్సరాల క్రిందటి వరకు ఆ గ్రంథము పూర్తిగా ప్రచురణ కాలేదు. సమగ్రంగా ఆ గ్రంథాన్ని ప్రకటించే అవకాశం నా జీవితంతో గాఢముగా పెనవేసుకొనిన ఆంధ్ర సారస్వత పరిషత్తుకు లభించినది. మరొకమారు శర్మగారు మా అందరికీ, సారస్వత పరిషత్తుకు దగ్గరగా వచ్చినారు. అది మా అందరికీ గర్వకారణం.

నా నలుబది సంవత్సరాల ప్రజాహిత జీవనంలో వివిధ రంగాలలోని చాలా మంది గొప్ప వారితో పరిచయం, స్నేహం లభించినవి. నిజానికి ఎందరో మహానుభావులు. వీరిలో కొందరు త్యాగమూర్తులైన దేశనాయకులు; మరి కొందరు మేటి పరిపాలకులు; ఇంకా కొందరు గొప్ప విద్యావేత్తలు; ఆ పైన కొందరు ఉన్నతాధికారులు; వేరొక కొందరు ఉద్దండులైన పండితులు; ప్రతిభావంతులైన కవులు – ఇందరిలో నా హృదయాన్ని ఎక్కువగా ఆకర్షించిన వారు అనంతకృష్ణ శర్మగారు.

కొందరిపైన అపారమైన గౌరవాభిమానాలు మనకు ఉండవచ్చును. కాని వారితో ఎక్కువ సేపు కాలక్షేపము చేయజాలము; కొందరి ప్రతిభ ఎంత గొప్పదైనను వారు తొందరగా మన దగ్గర నుండి వెళ్ళి పోతే బాగుండుననిపిస్తుంది. కాని

అనంత కృష్ణశర్మగారి సహవాసములో ఎంతకాలము గడపినప్పటికిని మరికొంత సేపు గడపవలెనని కోరిక కలుగుతుంది. వారితో సహవాసము, సంభాషణ విజ్ఞాన దాయకమైనవి; రసాత్మకమైనవి. వారి సమక్షము పన్నీటి చిలుకరింపు, మల్లెపూల మైమరపు — ఎవరినీ నొప్పించే పరుషవాక్కు వారి నోటి నుండి వెలువడదు. ఏ భావమునైనను రమణీయముగా, ఆహ్లాదకరముగా చెప్పుటలో అనంత కృష్ణశర్మ గారు అద్వితీయులు. సాహిత్య రంగములో వారు ఎంతటి యెత్తునైనను అందుకో గలరు; ఎంతటిలోతునైనను చేరుకోగలరు. పాండిత్యము, కవిత్వము, సాహిత్యమూ, సంగీతము తెలుగూ కన్నడము, ప్రాకృతము, సంస్కృతము, ప్రాచ్యపాశ్చాత్య సాహితీ సంప్రదాయాలు వారికి కరతలామలకములు. తెలుగు వారిలో ఇంతటి మహనీయమైన సారస్వతమూర్తి మరియెవ్వరిది ? తెలుగు విద్వన్మణి మండలిలో దివ్యమణి శ్రీ అనంతకృష్ణ శర్మగారు.

(శ్రీ అనంతకృష్ణశర్మ సన్మాన సంచిక అనంతరాగంలోని వ్యాసము 1977)

o:——:o

నా దృష్టిలో విశ్వనాథ సాహితీ వ్యక్తిత్వము

ఈ శతాబ్దాదిలో తెలుగు దేశమున రచనా వ్యాసంగము చేసిన ప్రతిభావంతులు అనేకులు ఉన్నారు; వారిలో కొందరు వైతాళికులుగా నిలచినారు; మరి కొందరు కొన్ని వాఙ్మయ ప్రక్రియలలో మార్గదర్శకులైనారు; ఇంకొక కొందరు ఒక్కొక్క రంగములో అగ్రగణ్యులుగా ప్రకాశించినారు. కాని సమష్టిగా బహుముఖ ప్రజ్ఞ చూపినవారు మిక్కిలి కొద్ది మంది. వాస్తవానికి ఏ భాషలోనైనా ఇటువంటి వారి సంఖ్య స్వల్పమే. తెలుగు భాషలో ఇటువంటి వారిని పేర్కొనవలసి వచ్చినప్పుడు శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారిని నిస్సంకోచముగా మొట్టమొదలు చెప్పక తప్పదు.

కందుకూరి వలె ఆయన నవయుగ ప్రవక్త కాక పోవచ్చును; తిరుపతి వేంకట కవులవలె ఆయన తన కవితచే ఆబాలగోపాలమును రంజింపక పోవచ్చును. గురజాడ వలె వైతాళికుడు కాకపోవచ్చును. రాయప్రోలు వలె కవితా మార్గ సంస్కర్త కాక పోవచ్చును; కాని పరిమాణమును బట్టియే గాక ప్రమాణమును బట్టి కూడ విశ్వనాథ సృజించిన సాహిత్యము అందరికన్న ఎక్కువగా నున్నదని నిస్సందేహముగా చెప్పవచ్చును. కవిగా, నవలా రచయితగా, నాటక కర్తగా, కథానికా రచయితగా, విమర్శకుడుగా, ఉపాధ్యాయుడుగా, ఉపన్యాసకుడుగా ఆయన స్థానము అద్వితీయమైనది. వాఙ్మయరంగములో ఆయన సాధించక విడిచి పెట్టిన ప్రక్రియలేదని చెప్పితే అతిశయోక్తి కాదు. పట్టిన దాని నెల్ల బంగారము చేసినాడని చెప్పితే సత్యానికి తలవంపులు కలుగ జాలవు.

సత్యనారాయణ గారు తమ సారస్వతజైత్ర యాత్రను ప్రారంభించిన రోజులలో ఆసేతు హిమాచలమైన భారత దేశములో గాంధీ మహాత్ముని నాయకత్వమున భారత స్వాతంత్ర్యోద్యమము విజృంభించినది. భాషా రాష్ట్రాల నేర్పాటు చేయవలెనను ఉద్యమము కూడా తల ఎత్తినది. ఆంధ్రోద్యమము జాతీయోద్యమానికి అనుకూలముగా ముందడుగు వేసినది. ఈ ఉద్యమాల ప్రభావము సత్యనారాయణగారి మీద మనకు కనిపించుచున్నది. నా దేశము, నా భాష, నా సంస్కృతి గొప్ప అనే భావము ఆ రోజు సమస్త భారత ప్రజానీకమును ఉత్సాహతరంగితము గావించినది. ఈ ఉత్సాహము, ఈ ఆవేశము

ఆయన రచనలందు మనకు స్పష్టముగా గోచరించును. ఖద్దరు, స్వదేశీ ఉద్యమాలను సత్యనారాయణగారు అభిమానించినారు. సత్యనారాయణగారు కల్తీలేని జాతీయవాది.

విశ్వనాథ సత్యనారాయణగారు నూటికి నూరుపాళ్ళు తెలుగువాడు. ఆంధ్రావేశము ఆయనలో మూర్తీభవించినది; ఆంధ్రుల పూర్వ రాజ్యాలు ఆనాటి సంస్కృతి తలంచు కొన్నంతనే ఆయన హృదయము ఉప్పొంగినది. ఎన్ని జన్మములనుండియో కదా నాతనువున ఆంధ్ర రక్తము ప్రవహించుట అని ఆయన తలపోసినాడు. "ఆంధ్రప్రశస్తి" సత్యనారాయణగారి రచనలో సకలాంధ్ర దేశమును ఉత్తుంతలూగించిన కావ్యము. కిన్నెరసాని పాటలు తెలుగు భాషకు అపూర్వమైన అలంకారము. తెలుగు భాష నిలిచియున్నంత కాలము కిన్నెరసాని పాటలు తెలుగు వారి నాలుకలపైన తాండవ మాడక తప్పదు. కవిత్వములో విశ్వనాథగారి కలము పోయినన్ని పోకడలు మరి యే కవి కలం పోలేదని నిస్సంశయముగా చెప్పవచ్చును. సంస్కృత సమాసాల నుపయోగించుటలో సత్యనారాయణగారు ఎంత నైపుణ్యము ప్రదర్శించినారో తీయని తెలుగు పదాల పొందికలో కూడ అంతే ప్రజ్ఞను చూపినారు. తెలుగు దేశము, తెలుగు పల్లెలు, తెలుగు ప్రజల ఆచారాలు వీరి రచనలలో కనిపించినంత పుష్కలముగా చాల తక్కువ మంది రచనలలో కనిపించునని చెప్పవచ్చును. గేయము, పద్యము ఒకే రీతిగా నడిపించగలిగిన ప్రజ్ఞా సమన్వితుడు సత్యనారాయణగారు. నన్నయ, తిక్కన పోతనాది మహాకవుల అడుగు జాడలలో సత్యనారాయణగారు మహాకావ్య రచనకు ఉపక్రమించి, రామాయణ కల్పవృక్షమును వ్రాసి ధన్యులైనారు. ఆమహా కావ్యమును ఆయన చదివినప్పుడు విని అశేషాంధ్రజనము ఆనంద సముద్రములో మునిగి తేలినారు. సత్యనారాయణగారి కవిత్వము ఎంత రమణీయమైనదో వారి కంఠము, చదివే పద్ధతి కూడ అంత వీనుల విందు గావించునది. కవిత్వము వీరి చేతులందలి క్రీడాకందుకము, ఆరి తేరిన క్రీడాకారుడు టెన్నిస్ కోర్టులో బంతి విసిరినట్లుగా సత్యనారాయణగారు కవితారంగమున విజృంభించినారు. పండితులకు గూడ దురవగాహమైన శైలిని నాడుటలో ఆయన ఎంత దిట్టయో సామాన్యజనులు కూడ అర్థము చేసుకొను శైలిని ఉపయోగించుటలో కూడ ఆయన అంతే సమర్థుడు. ప్రాచీనులలో ప్రాచీనుడు, ఆధునికులలో ఆధునికుడు విశ్వనాథ సత్యనారాయణగారు.

సత్యనారాయణగారు అనేక నాటకాలను వ్రాసినారు. వారి నాటకాలలో అనార్కలి, నర్తనశాల, ప్రశస్తమైన రచనలు. నవలా రచయితగా సత్యనారాయణ గారిది విశిష్టమైన స్థానము. సంఖ్యలో ఆయన వ్రాసినన్ని నవలలు మరొకరు వ్రాయలేదని చెప్పవచ్చును. రకరకాలైన ఆయన నవలలలో వివిధ శైలీ విన్యాసము మనకు కనిపించును. ఏకవీర, మాబాబు, బద్దన్న సేనాని మొదలైన నవలలు తెలుగు భాష ఉన్నంత కాలము నిలువదగిన రచనలు. చిన్న కథలు అనేకము విశ్వనాథ సత్యనారాయణగారు వ్రాసినారు. కథానికా రచయితగా సత్యనారాయణ గారిది సమున్నతమైన స్థానము, "మాక్లిన్ దుర్గములో కుక్క", "సిబుణము దీర్చుకున్నాను" వంటి కథలు కథానికారచయితగా సత్యనారాయణగారి ప్రతిభకు ఉదాహరణలు.

సత్యనారాయణగారి చిత్తశుద్ధి గొప్పది. తాను విశ్వసించిన అభిప్రాయములను వెల్లడించుటలో ఆయన ఎప్పుడు వెనుదీయలేదు. ఆ భావాలు కొందరికి రుచించినను, రుచింపక పోయినను వారు స్వేచ్ఛగా సభలలోను, రచనలలోను ప్రకటించినారు. సత్యనారాయణగారి సమకాలికులలో ప్రతిభావంతులు చాలా మంది ఉన్నారు. కాని వారు ఏ ఒక్కరును ఒకటి రెండు ప్రక్రియలలోనే తమ ప్రతిభను ప్రదర్శించినారు. సత్యనారాయణగారి వలె విభిన్న ప్రక్రియలను వారు చేపట్టలేదు. చేపట్టినప్పటికిని వాని సాధనలో సత్యనారాయణగారి వలె విజయము పొందలేదు.

సత్యనారాయణగారిది సమున్నతమైన వ్యక్తిత్వము. ఈ వ్యక్తిత్వము ఆయన ఆకారములోను, మేధాశక్తిలోను, హృదయశక్తిలోను, వాక్కులోను సర్వదా ప్రతిబింబితమైనది. ఇంతటి సర్వతోముఖమైన ప్రతిభాశాలి గడచిన కొన్ని శతాబ్దములలో తెలుగుదేశము నందు జన్మించలేదని నిస్సందేహముగా చెప్ప వచ్చును.

సత్యనారాయణ గారు తమ గురువు గారిని గూర్చిన వ్రాసిన ఒక పద్యములో "ఆనాడు నన్నయకు గాని, తిక్కనకు గాని నా వంటి శిష్యుడు దొరుక లేదు. ఇది మీకు ప్రత్యేకమైన గౌరవము" అని చెప్పినారు. ఈ మాట అత్యుక్తి కాదు; సత్యోక్తి మాత్రమే. సత్యనారాయణ గారు తమ తొలి కవితలో

నీచే మంజు కషాయ కంఠ కల కంఠీ గీతి పాడించెదన్
నీ చంద్రామృత సేక వాఙ్నదులలో నిండింపింతు కేదారముల్
ప్రాచీ దిగ్వనితాన నోజ్వల దుషః ప్రారంభ రమ్యాంశు, మా
లా చీనాంబర డోలి కావళినినున్ లాలించి యూగించెదన్

అనియు

నీనుడులయందు చిక్కన నెగడజేతు
నీ పలుకులందు జిగి తీపి నిలువ జేతు
నీ వచస్సుధ రక్తిమ నిలువ జేతు
చెలగి భాషాంబుధిని పుడిసిళ్ళ గొనుము

అనియు

ఆశావాణిచే ఒక కవికుమారుని ప్రబోధింపజేసినాడు. ఇది ఆయన నూనూగు మిసాల నూత్న యౌవనమున వ్రాసిన కవిత. సత్యనారాయణగారి సాహిత్యమును పరిశీలించినపుడు ఆనాడు ఆయన కనిన యీ స్వప్నము వారి జీవితములో సత్యముగా పరిణమించినదని స్పష్టమగుచున్నది. భాషాంబుధిని పుడిసిళ్ళ గొన్న మహా కవులు సత్యనారాయణగారు.

సత్యనారాయణగారికి అన్ని గౌరవాలు లభించినవి మరే రచయితకు ఇటు వంటి సత్కారాలు జరుగలేదు. ఆయన రచనలు వేల ప్రతులు అమ్ముడు పోయినవి. సకలాంధ్ర దేశము ఆయనకు బ్రహ్మరథము పట్టినది. ఆయన వెళ్ళని పట్టణము లేదు; పొందని సన్మానము లేదు. విశ్వవిద్యాలయము ఆయనను కళా ప్రపూర్ణుని చేసినది. కేంద్ర ప్రభుత్వము ఆయనను పద్మ భూషణునిగా భూషించినది. రాష్ట్ర కేంద్ర సాహిత్య అకాడమీలు ఆయన రచనలను బహుమానించినవి. జ్ఞాన పీఠము ఆయనను సన్మానించినది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము ఆయనను ఆస్థాన కవిగా చేసినది. సమస్త భారతము ఆయనను గుర్తించినది. ప్రాచీన ఆధునిక కవులెవరికిని ఇటువంటి అపూర్వ గౌరవాలు లభించలేదు. సత్యనారాయణ గారు సర్వవిధాల ధన్యజీవి. ఆంధ్ర భాష ఉన్నంత కాలము రచయితగా, కవిగా సత్యనారాయణ గారు నిలువగలరని నిస్సందేహముగా చెప్ప వచ్చును.

(విశ్వనాథ సాహిత్య సంచిక కాకతీయ విశ్వవిద్యాలయ ప్రచురణ మే 1978)

వృత్తిపదకోశాల నిర్మాణావశ్యకత

భారతదేశంలో బహు భాషలు మాట్లాడే ప్రజలు ఉన్నారు. ఈ భాషల చరిత్రను వికాసాన్ని పరిశీలించితే అన్నింటి సమస్యలు ఒకే విధంగా ఉన్నవి. ఈ భాషలపైన పడిన ప్రభావాలు కూడా ఒకే విధమైనవి. మొదలు సంస్కృతం, మధ్యకాలంలో ఫారసీ తరువాత ఇంగ్లీషు భాషలు, మనదేశంలోని విద్యావంతుల మధ్య వైజ్ఞానిక సంబంధాలు కల్పించినవిగాను, ఉన్నత విద్యా సముపార్జనకు తోడ్పడినవిగాను దేశ పరిపాలనా నిర్వహణకు ఉపయోగపడినవిగాను గోచరిస్తున్నవి. కాని దేశ భాషలలో దేనికిని ఇటువంటి స్థాయి కలుగలేదు. అనగా ఉన్నత విద్యాబోధనా భాషలుగాను పరిపాలనానిర్వహణ భాషలుగాను మన దేశ భాషలు సరియైన స్థానమును అవకాశమును పొందలేదు. ఈ భాషలన్నీ కావ్య భాషలుగాను, సాహిత్య భాషలుగాను మాత్రమే వికాసము పొందినవి. అందుచేత ఈ భాషలలో సమగ్రమైన నిఘంటువులు కూడా మనకు లభ్యం కావడంలేదు. తెలుగులో కూడా ఇదే పరిస్థితి మనకు గోచరిస్తున్నది.

ఇంగ్లీషు పరిపాలన మన దేశంలో స్థిరపడిన తరువాత కొందరు సివిలియన్ అధికారులు దేశభాషలలో నిఘంటువుల నిర్మాణానికి కృషిచేసినారు. తెలుగు భాషలో నిఘంటువు నిర్మాణానికి పూనుకొని రెండు నిఘంటువులను సిద్ధంచేసి ప్రకటించిన గౌరవము బ్రౌన్‌కీయవలసి ఉన్నది. ఆయన తరువాత తెలుగులో మరికొందరు నిఘంటువులను తయారుచేసి ప్రకటించినారు. ఈ నిఘంటువులలో ఏ ఒక్కటి కూడా సమగ్రమైన నిఘంటువు కాదని చెప్పితే సత్యానికి విరుద్ధముకాదు. ఎందుకనగా ఈ నిఘంటువులన్నీ ప్రకటితమైన గ్రంథాలలోని పదజాలానికి సంబంధించినవి. సాధారణంగా చదువుకున్నవారి నాలుకలమీద ఆడే పదజాలానికి, నుడికారానికి సంబంధించినవి. నిరక్షరాస్యులై వివిధ ప్రాంతాలలో నివసిస్తూ వివిధ వృత్తుల నవలంబించేవారు నిత్య జీవితంలో ఉపయోగించే మాటలు ఈ నిఘంటువుల కెక్కలేదు. వాటిని ఎక్కించే ప్రయత్నము కూడా జరుగలేదు. అందుచేత ఇప్పటి వరకు ప్రకటితమైన నిఘంటువులు తెలుగు భాష సమగ్ర స్వరూపాన్ని తెలియజేసేవికావు. కావున తెలుగు భాషకు ఒక ప్రామాణికమైన, సమగ్రమైన నిఘంటువు శాస్త్రీయ పద్ధతులలో

సిద్ధం చేయించవలసిన ఆవశ్యకత స్పష్టంగా కనిపిస్తున్నది. ఇప్పటి వరకు కావ్య భాషగా, సాహిత్య భాషగా మాత్రమే పరిణతి చెందిన తెలుగు భాష ఇతర దేశ భాషల వలెనే ఉన్నతవిద్యను బోధించే భాషగా రాష్ట్ర పరిపాలనను నిర్వహించే భాషగా రూపొందవలసి ఉన్నది. అందుకొరకు కూడా ఒక ప్రామాణికమైన నిఘంటువు ఆవశ్యకత స్పష్టముగా కనిపిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఇందుకు సంబంధించిన సమస్యలన్నింటిని కూలంకషంగా పరిశీలించి నిఘంటు నిర్మాణానికి కావలసిన సామగ్రిని మొట్టమొదట సేకరించవలెనని నిర యించినది. ఈ నిర్ణయానుసారము వృత్తిపదకోశాలు, పదప్రయోగకోశాలు కొన్ని ఇప్పటివరకు సాహిత్య అకాడమి పక్షాన ప్రకటితమైనవి. ఈ పని పూర్తికావశానికి మరికొంత కాలం పట్ట వచ్చును.

భారతదేశ భాషలలో మొట్టమొదట ఇటువంటి ప్రయత్నం జరిగింది తెలుగు భాషలోనే. మన దేశంలో అనేక వృత్తులు అవలంబించేవారు ఉన్నారు. వీరు వివిధ ప్రాంతాలలో నివసిస్తున్నారు. వారు తమ నిత్య వ్యవహారంలో తమ వృత్తుల నిర్వహణలో అనేక శబ్దాలను ఉపయోగిస్తున్నారు. ఈ శబ్దాలు వివిధ మండలాలలో భిన్నంగా కనిపిస్తున్నవి. అందుకు కారణాలు అనేకం. పొరుగు భాషల ప్రభావం, పరిపాలనా భాషల ప్రభావం, ఉచ్చారణలో వ్యత్యాసాలు మొదలైనవి, ఇందుకు కారణాలని చెప్పవచ్చును. ఈ కారణాలను దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి మాండలిక వృత్తిపదకోశాలను సిద్ధం చేయించవలెనని నిర్ణయించినది.

భారతదేశంలో ఇటువంటి ప్రయత్నాలు కొన్ని జరిగినవి. సర్ జార్జ్ గ్రియర్సన్ అనే ఆంగ్ల విద్వాంసుడు 1885 వ సంవత్సరమున మన దేశంలోని పల్లెటూళ్ళలో అవలంబించే వృత్తులకు సంబంధించిన పదాలను సేకరించే ప్రయత్నం చేసినారు. ఇందుకు ఆయన బీహార్ రాష్ట్రాన్ని ముఖ్య ప్రాతిపదికగా తీసుకున్నారు. బ్రజ్ భాషకు సంబంధించిన పదాల సేకరణకొరకు డా॥ అంబాప్రసాద్ సుమన్ కొంత కృషి చేసినారు. ఏమైనప్పటికిని మన తెలుగు భాషలో జరిగినట్లు శాస్త్రీయ పద్ధతులలో ఒక నిర్దిష్ట ప్రణాళిక ననుసరించి వృత్తిపదకోశాల నిర్మాణం ఇతర భాషలలో ఇప్పటివరకు జరుగలేదు. 1958 జూన్‌లో ఈ మాండలిక వృత్తిపద కోశాల ప్రచురణకు పూనుకొన్న ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఇప్పటివరకు వ్యవసాయం, చేనేత, వాస్తులకు సంబంధించిన నిఘంటువులను ప్రకటించినది.

త్వరలోనే మత్స్య పరిశ్రమ, కుమ్మరము, కమ్మరములకు సంబంధించిన పదకోశాలు ప్రకటితము కానున్నవి. ఈ విధంగా దేశభాషలకు మార్గదర్శకమైన పద్ధతిలో వృత్తిపదకోశ నిర్మాణం సాహిత్య అకాడమి పక్షాన జరిగినది. జనుల నిత్య వ్యవహారంలోని సమస్త శబ్ద సంపదను సేకరించిన తరువాతనే ప్రామాణికమైన, సమగ్రమైన నిఘంటు నిర్మాణం జరుగవలసి ఉన్నదని నిస్సందేహంగా చెప్ప వచ్చును.

మనదేశంలో ఇటీవలి వరకు రాకపోకల సౌకర్యాలు సంతృప్తికరంగా ఉండక పోవడం వలన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు భిన్నభిన్న పరిపాలనలలో ఉండడం వలన ఈ భిన్నప్రాంతాలలో నివసించే తెలుగువారి మధ్య సంబంధాలు తక్కువగా ఉండేవి. అందుచేత శబ్ద ప్రయోగంలోను, ఉచ్చారణలోను అనేక వ్యత్యాసాలు కనిపించుతున్నవి. ఈనాడు ఇంచుమించుగా తెలుగు దేశమంతా ఒక పరిపాలన కిందకి వచ్చి తెలుగుద్వారా ప్రభుత్వ వ్యవహారాలు నిర్వహించవలెననీ, ఉన్నత విద్యాబోధన చేయవలెననీ నిర్ణయమైనది. అందుచేత రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల వారికి అంగీకారయోగ్యమైన ప్రామాణికమైన భాషను కూడా రూపొందించవలసిన అవసరం ఉన్నది. ఆ పని చేయడానికి తెలుగు భాషయొక్క సమగ్ర స్వరూపాన్ని మన ముందు ఉంచుకొనవలసి ఉన్నది. వివిధ మండలాల లోని తెలుగు నుడికారాన్ని సరిగా అవగాహన చేసుకోవలసి ఉన్నది. అందుకొరకు వివిధ మండలాలలోని వివిధ వృత్తులకు సంబంధించిన పదాలను సేకరించడం అనివార్యమని చెప్పక తప్పదు.

ఇంతకు ముందు ప్రస్తావించినట్టుగా ఉన్నత విద్యాబోధనకు, పరిపాలనకు తెలుగును ఉపయోగించినపుడు అందుకు కావలసిన శాస్త్రగ్రంథాలను, సాంకేతిక గ్రంథాలను కూడా సిద్ధం చేయించవలసి ఉన్నది. ప్రభుత్వ శాసనాలను తెలుగు లోనికి పరివర్తించవలసి ఉన్నది. ఈ కార్యక్రమాల నిర్వహణకు తెలుగు అకాడమి, అధికార భాషా కమీషన్ మొదలైనవి ఏర్పడి ముందడుగు వేస్తున్నవి. వీని కృషికి మాండలిక వృత్తిపద కోశాలు మిక్కిలి ప్రయోజనకరాలు కాగలవు. ఈనాడు పారిభాషిక పదాలను రూపొందించడానికి ఎంతో కృషి జరుగుతున్నది. వివిధ మండలాలలోని వివిధ వృత్తులకు సంబంధించిన పదాలు ఈ కృషికి ఉపయోగ కరాలు కాగలవు. ఆధునిక శాస్త్రాలలో పుస్తకాలను వ్రాసేటప్పుడు ముఖ్యంగా వ్యవసాయం, పశుపోషణ, చేనేత, మత్స్య పరిశ్రమ మొదలైనవంటి వృత్తులకు సంబం

ధించిన పదాలు మిక్కిలిగా తోడ్పడగలవు. అంతేగాక భాషా శాస్త్రములో పరిశోధన చేసే పండితులకు ఈ పదకోశాలు అత్యంత ఉపయోగకరమైనవి. ఒక పదము యొక్క పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవడానికీ, పొరుగు భాషల ప్రభావాన్ని పరిశీలించడానికి భాషా పరిణామాన్ని గూర్చి పరిశోధించడానికి, ఇప్పటివరకు మనకు అర్థం కానటువంటి మాటలకు సరియైన అర్థం నిరూపించడానికి ఈ మాండలిక పదకోశాలు ఎంతో ఉపయోగపడగలవు.

సాంఘిక శాస్త్ర దృష్ట్యా కూడా ఈ మాండలిక పదకోశాల నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నది. ఒకే భాష మాట్లాడే ప్రజలు, భిన్నభిన్న ప్రాంతాలలో ఉపయోగించే మాండలికాలు వారి జీవితానికి భాషకు గల సంబంధాన్ని వివరించడానికి కూడ ఉపయోగపడగలవు. తెలుగు భాష గడచిన శతాబ్దాలలో ఏ విధంగా పరిణామం పొందిందీ ఈ మాండలిక వృత్తిపదకోశాలు వివరించగలవు. అందుచేత భాషా శాస్త్రంలో పరిశోధన చేసేవారికి ఈ వృత్తి పదకోశాలు ఉపయుక్తమని చెప్పవచ్చును. తెలుగు దేశ చరిత్రకు, భూగోళానికి సంబంధించిన అనేక విషయాలు ఈ మాండలిక వృత్తి పదకోశాల వలన తెలుసుకోవడానికి వీలుకలదని విజ్ఞుల అభిప్రాయం. కావుననే సాహిత్య అకాడమి కార్యక్రమాలలో పదకోశాలకు ప్రత్యేకమైన ప్రాధాన్యమీయనైనది.

ఈ పదకోశాల నిర్మాణానికి ఒక ప్రణాళికను సిద్ధంచేసి అందుకు అనుగుణంగా సాహిత్య అకాడమి విద్వాంసుల సహకారంతో కృషి చేసినది. తెలుగు దేశంలోని వివిధ మండలాలకు విద్యావంతులైన కార్యకర్తలను పంపించి పద సేకరణ చేయించడం జరిగింది. ఆయా ప్రాంతాలలో, ఆయా వృత్తుల నవలంబించే వారి నుండి పదాలను సేకరించి కార్యకర్తలు విశేష శ్రమకు ఓర్చి కార్య సాధన గావించినారు. తెలుగు అకాడమి పక్షాన కూడా ఇటువంటి కృషి కొంత జరిగినది. జిల్లాల వారిగా మాండలిక భాషాకోశాలను సిద్ధం చేయవలెనని తెలుగు అకాడమి నిర్ణయించి ఇప్పటివరకు కొంత పని చేసినది. ఈ విధంగా ఈ కృషి మరికొంత వేగంగా జరిగి ఈ మాండలిక పదాల సేకరణ మాండలిక భాషా స్వరూప నిర్ణయం మొదలైనవి త్వరలోనే పూర్తి కాగలవని ఆశించవచ్చును.

ప్రస్తుతం తెలుగును అధికార భాషగా చేయడానికి ప్రభుత్వ యంత్రాంగానికి సంబంధించిన పదాలను కొత్తగా తయారు చేసుకోవడం జరుగు

తున్నది. అట్లాగే వివిధ శాస్త్ర విషయాలను తెలుగు మాధ్యమంగా బోధించడానికి కూడా సాంకేతిక పదాలను కొత్తగా నిర్మించుకోవలసిన అవసరం కూడా ఏర్పడు తున్నది. కాని పరిపాలనకు సంబంధించిగానీ, అనేకమైన వస్తువులను, భావాలను సూచించడానికి గానీ, అనేకమైన పదాలు భిన్నప్రాంతాల సాధారణ జన వ్యవహారంలో కనిపిస్తవి. అనేక ప్రాంతాలలోని వివిధ వృత్తుల వారి వ్యవహారంలో ఉన్న సజీవమైన పదాలను గుర్తించి సేకరించగలిగితే కొత్తపదాలను కృత్రిమంగా సృష్టించవలసిన అవసరం ఉండదు. తెలుగు భాష సజీవమైనది. ఇతర భాషా సంస్కృతుల ప్రభావం అంతగాలేని వివిధ మాండలికాలలో చదువుకొన్న వారికే తెలియని ఆయా మాండలిక భాషలలోని పదజాలం వివిధ భాషలను, వస్తుజాలాన్ని సూచించగలిగి ఉన్నది. అన్ని ప్రాంతాలకు, అన్ని వృత్తులకు, వర్గాలకు సంబంధించిన పదజాలం సేకరించడం ద్వారాను, మాండలిక వృత్తిపదకోశాలను సిద్ధం చేయడం ద్వారాను సమగ్రమైన తెలుగు నిఘంటు నిర్మాణం జరిగితే తెలుగు వైజ్ఞానిక భాషగాను, పరిపాలనా భాషగాను వృద్ధిచెందే అవకాశం ఉంటుంది.

(రేడియో ప్రసంగం 17–11–76)

దొరకుచోటు
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్ - హైదరాబాదు.